2003 - 2013

# కమ్మజన సేవాసమితి, గుంటూరు
# విద్యార్థినుల వసతి గృహము



## పదేళ్ళ ప్రగతి సంచిక



**భూదాతకు భూరి ధన్యవాదాలు**

వసతి గృహ సేవాసౌకర్యాల విస్తరణకు వీలుగా గుంటూరు
నగర పరిసరాలలో విలువైన రెండు ఎకరముల భూమిని
దానం చేసిన వదాన్యులు

**డా॥ కొమ్మాలపాటి శ్రీధర్**

పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు

**శ్రీమతి మాధవిలత**

మేనేజింగ్ డైరెక్టర్

**అభినందన హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్**

గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు

అభినందన

# కమ్మజన సేవాసమితి
# విద్యార్థినుల వసతి గృహము
# పదేళ్ళ ప్రగతి సంచిక
# 2003-2013




## కమ్మజన సేవాసమితి

డోర్.నెం. 3-25-26/4, వార్డు నెం. 35,

**బృందావన్ గార్డెన్స్, గుంటూరు - 522 006.**

ఫోన్స్ : 91 863 2355471 (ఆఫీస్) New Block 2235471

2355571 (జూనియర్స్) 2268901 (సీనియర్స్)

Website : www.kammajanasevasamithi.com

E-mail : kamma@kammajanasevasamithi.com

---

*మనం విడివిడిగా బిందువులం. అంతా కలిస్తే అనంత సాగరం.*

# కమ్మజన సేవాసమితి
# విద్యార్థినుల వసతి గృహము
# పదేళ్ళ ప్రగతి సంచిక
# 2003-2013


**ప్రచురణ : జులై 2013**

**(For Private Circulation only)**

**ప్రచురణ :** సామినేని కోటేశ్వరరావు, కార్యదర్శి, పాలకమండలి

**Cell : 94410 65414**

**సంపాదకులు :** పెద్ది (ఉన్నవ) సాంబశివరావు

**Cell : 98481 43721**

**డి.టి.పి.**

శ్రీవల్లీ కంప్యూటర్ సెంటర్, పట్టాభిపురం, గుంటూరు. సెల్ : 9704436572,

**గ్రాఫిక్స్**

బాబు డిజిటల్స్, 3/3 అరండల్‌పేట, ఫోన్ : 99484 10319

లక్ష్మీప్రసన్న గ్రాఫిక్స్ : డొంకరోడ్డు, గుంటూరు. ఫోన్ : 98660 16690

దుర్గాప్రసాద్ గ్రాఫిక్స్ : 8/2 అరండల్‌పేట, గుంటూరు. ఫోన్ : 92464 66596

ఫోటోలు : ఎ. సుబ్బారావు

వెబ్ నిర్వహణ : సాయిరాం, వెబ్ స్మార్ట్

సమన్వయం : వడ్లమూడి శివరామకృష్ణయ్య

సలహాలు : పాతూరి కోటేశ్వరరావు

సాంకేతిక సలహాలు : ఎమ్. బెనర్జీనాథ్, చీఫ్ ఎడిటర్, కాకతీయ దినపత్రిక

ముద్రణ :శ్రీ లక్ష్మి ప్రింటర్స్, 14/2 అరండల్‌పేట, గుంటూరు.

ఫోన్: 0863-2230643. మొబైల్ : 9848134236




తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లు ఎత్తిన కూలీలు ఎందరో... శ్రీశ్రీ

# విషయ సూచిక

## వసతి గృహం


ఆకాంక్షలు - అధ్యక్షులు - 6

కృతజ్ఞతలు - కార్యదర్శి - 8

ప్రవాసాంధ్రుల ఔదార్యం - కోశాధికారి - 11

ప్రముఖుల సందేశాలు - 14

ఘంటా పున్నయ్యచౌదరిగారికి నివాళులు - 22

సంస్థ శ్రేయోభిలాషులు - 26

ప్రస్తుత పాలకవర్గం - 32

ఛాయచిత్రమాలిక - 33

వసతిగృహ సౌకర్యాలు, నిబంధనలు - 50

భవన నిర్మాణదాతలు, విద్యానిధిదాతలు - 52

స్థానిక వైద్య శ్రేయోభిలాషులు - 71

సందర్శకులు - 72


## బాలికలు


బాలికల తరగతుల వారీ ఫోటోలు - 77

వినోద కార్యక్రమాలు, ప్రతిభావంతులు

వసతి గృహ విద్యార్థినులు, ఆటలలో విజేతలు వగైరా


## మంచి మాటలు


కథలు, స్ఫూర్తిదాయక గాధలు, విద్యాభివృద్ధికి

సూచనలు సూక్తులు, పద్యాలు, నైపుణ్యాలు వగైరా


## మనం మనవారు


కమ్మవారి చరిత్ర, వివిధ రంగాలలో ప్రముఖులు,

మన సంస్థలు వగైరా

# భవనాలు



















ఈ మహా భవనాలకు దాతలు ఎందరో...

# అధ్యక్షుని ఆలోచనలు, ఆకాంక్షలు

వంకాయలపాటి బలరామకృష్ణయ్య, అధ్యక్షులు

మానవజన్మ మహోత్కృష్టమైనది. సామాజిక బాధ్యతను గుర్తెరిగి భగవంతుడు తమకిచ్చిన కాలంలోను, ధనంలోను కొంత భాగాన్ని తోటి వారికి తోడ్పటం ద్వారా జన్మకు సార్థకత చేకూరుతుంది. 'మానవసేవే మాధవసేవ' గనుక సామాజిక సేవ ద్వారా భగవంతుడ్ని కూడ సేవించిన వారౌతారు.

ఈ విషయాన్ని పెద్దల ద్వారా పుణికి పుచ్చుకున్నాను. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్న నానుడి కూడ వున్నది కదా... అందుకే ముందుగా నా కులస్తులైన పేద కమ్మ తల్లిదండ్రులకు నా మిత్రుల సహకారంతో కొంత చేయూత నివ్వదలచాను. అందుకు వేదికగా కమ్మ జన సేవాసమితిని ఎన్నుకోవటం జరిగింది.

సుమారు ఒక శతాబ్దం క్రితమే గుంటూరు పట్టణ పెద్దలు పేద కమ్మ బాలురకు విద్యావరంగా చేయూతనివ్వటానికి నాంది పలికారు. ఫలితంగా ఎంతో మంది కమ్మ విద్యార్థులకు ఉచిత భోజన వసతులు కల్పించారు. నేటికీ కల్పిస్తున్నారు. ఆ రోజులలో వదాన్యుల సహకారంతో 'వారాలు' యిప్పించటం ద్వారా ఉచిత భోజన వసతి కల్పించేవారు. మారుతున్న కాల పరిస్థితులను బట్టి ఒక విద్యార్థి భోజన ఖర్చుకు సరిపడా దాతల నుండి విరాళాలు సేకరించటం జరిగింది, జరుగుతుంది.

కాలం వేగంగా మారింది. అంతకంటే వేగంగా సామాజిక పరిస్థితులు, స్థితిగతులు మారాయి. స్త్రీ విద్య అవసరం గుర్తింపబడింది. గ్రామీణ ప్రాంత పేద రైతులు, రైతు కూలీలు సైతం తమ ఆడ బిడ్డలను చదివించుకోవాలనే తపన పెరిగింది. కాని ఆర్థికస్తోమత గాని, ఆడ పిల్లలను చదువుకోసం పట్టణాలకు పంపగల ధైర్యాన్ని కలుగజేసే సామాజిక పరిస్థితులు గాని నేటికి కూడా లేవనే చెప్పాలి. అది గమనించిన కొందరు పెద్దలు 1978వ సం॥లో గ్రామీణ ప్రాంత బాలికల కొరకు ఒక వసతి గృహం (హాస్టలు) నిర్మించ సంకల్పించి తదనుగుణంగా తీర్మానించారు.

ఈ సందర్భంగా కీ.శే. వాసిరెడ్డి వెంకయ్య చౌదరి, శ్రీ వలివేటి నరసింహారావు, కీ.శే. డా॥ముద్దన హనుమంతరావు, శ్రీ వాసిరెడ్డి రామారావు, కీ.శే. గొరిజవోలు సాంబశివరావు, (సెంట్రల్ కేఫ్) శ్రీ కొత్తపల్లి రమేష్ చంద్ర, కీ.శే. కొర్రపాటి వెంకట నారాయణ, కోశాధికారిగా పనిచేసిన డా॥ మోటూరు సత్యనారాయణ, శ్రీ పి.యల్.నారాయణ, శ్రీ కుటుంబరావు, ఉపాధ్యక్షులు, నాగండ్ల చలపతిరావు, డా॥ సూర్యదేవర హనుమంతరావు, జాయింట్ సెక్రటరి, సభ్యులు నేతాజి స్కూల్ అధినేత కీ.శే. శివయ్య, ఉపాధ్యాయులు శ్రీశైల మల్లిఖార్జునరావు, శాంతా ట్యుటోరియల్ ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ, జె.కె.సి. అధ్యాపకులు శ్రీ మాదల తిమ్మయ్య, శ్రీ గొల్లపూడి ప్రకాశరావు, వి. శ్రీరామమూర్తి మరెందరో పెద్దలందరినీ గుర్తు చేసుకోవటం నా బాధ్యతగా భావిస్తున్నాను.

కమ్మజన సేవా సమితి వ్యవస్థాపక కార్యవర్గం స్థల సేకరణ చేయగా శ్రీ నాగళ్ళ చలపతిరావు గారు ఈ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు. తరువాత కార్యవర్గమైన డా॥ కె. బసవపున్నయ్య, ఎ.సిహెచ్. సుబ్బారావు. కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి గార్లు ఘంటాపున్నారావు గారు యిచ్చిన భూరి విరాళంతో సమితి ప్రాంగణానికి ఒక నిర్దిష్టమైన, అందమైన రూపాన్ని కల్పించారు. వారందరి కృషినీ అభినందిస్తూ వారిని గుర్తు చేసుకోవటం కూడ నా బాధ్యతగా భావిస్తున్నాను.

ఇకపోతే 2003వ సం॥ము ప్రారంభంలో కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి గారు అధ్యక్షులుగా శ్రీ ఎ.సిహెచ్. సుబ్బారావు గారు కార్యదర్శిగా ఏర్పడిన కార్యవర్గంలో నేను ఉపాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించటం జరిగింది. సమాజంలో కొందరికైనా నా శక్తి సామర్థ్యాలు ఉపయోగపడాలనే నా కోరిక తీరటానికి నాంది పలికింది.

ఘంటా పున్నయ్య చౌదరి గారు దాతల నుండి విరాళాల సేకరణలో త్వరిత పురోగతిని సాధించారు. భవన నిర్మాణ బాధ్యతను నేను చేపట్టి మిత్రుల సహకారంతో భవనాలు అనుకున్న సమయంకంటే ముందుగా నిర్మించుకోగలిగాం.

*ప్రతి వ్యక్తి ఆత్మలో ఒకభాగం చాలా బలంగా ఉంటుంది. ఏమిచ్చినా దానిని కొనడం సాధ్యం కాదు.*

అయితే అప్పటి వ్యవస్థాపకులు సమకూర్చిన వసతి చాలలేదు. మరింత అవసరము కలిగింది. ఎందుకంటే బాలికలలో పెద్ద చదువులు చదివి తమ తల్లిదండ్రులకు చేయూత నిచ్చి కొడుకులకు కూతుళ్ళు తీసిపోకపోగా వాళ్ళకంటే వీళ్ళే నయం అనిపించుకోవాలనే కోరిక పెరిగింది. తల్లిదండ్రులలో కూడ మారుతున్న సామాజిక పరిస్థితుల దృష్ట్యా వారి కూతుళ్ళు ఆర్థికంగా మరొకరిపై ఆధారపడకుండా తమ కాళ్ళపై తాము నిలబడేటట్లు చేయాలనే సంకల్పం పెరిగింది. దానికి వారిని పెద్ద చదువులు చదివించట మొక్కటే మార్గమనే విషయం అర్థమయ్యింది.

అయితే కౌమార దశలోని పిల్లలను స్వేచ్ఛగా వదలితే చెడు ప్రభావాలకు లోనయ్యే అవకాశం మెండు. ఆ దశలో వారికి స్వేచ్ఛతో పాటు నిరంతర పర్యవేక్షణ అవసరం. సమాజంలో అత్యాచారాలు, సైబర్ నేరాలు, హైటెక్ ఘోరాలు పెరుగుతున్న యీ రోజులలో వారిని తల్లిలా లాలించి, తండ్రిలా దండించి, గురువులా బోధించే పర్యవేక్షకులున్న వసతి గృహం ఎంతో మేలు చేస్తుందని నా నమ్మకం. అదే నమ్మకంతో పనిచేసిన అధ్యక్షులు శ్రీ ఘంటా పున్నయ్య చౌదరి గారు మాకు కొండంత అండనిచ్చారు.

దురదృష్టవశాత్తు, ఘంటా పున్నయ్యగారు అకాలంగా కన్నుమూశారు. తదనంతరం బాధాతప్త హృదయంతో 2008వ సం॥ము నుండి నేను అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. "నేను కన్న పిల్లలు ముగ్గురు, నాకు వున్న పిల్లలు ఎందరో.... మరెందరో" అందర్నీ కన్న బిడ్డల కన్నా మిన్నగా చూసుకుంటూ సహ కార్యవర్గ సభ్యుల సహకారంతో గ్రామీణ ప్రాంత కమ్మ బాలికల పురోభివృద్ధికి సహకరిస్తూ, వారిని ప్రోత్సహిస్తూ వారు జీవితంలో ఒక సుస్థిరమైన స్థానాన్ని సాధించటమే గాక, సమాజానికి ఉపయోగపడేలా వారిని నడిపించే ప్రయత్నం చేయగలనని విశ్వసిస్తున్నాను.

ఈ పది సం॥ల కాలంలో యీ హాస్టలు ద్వారా లబ్ది పొంది స్థిరపడిన విద్యార్థినులు ఎందరో వున్నారు. వారిని చూచినప్పుడు గర్వంగా ఉంటుంది. వారు యీ హాస్టలును మరచిపోకుండా వారి వంటి మరికొందరికి సహాయ మందించాలని విన్నవిస్తున్నాను.

ఇక ప్రాంగణ విస్తరణ కొస్తే.... మంచి కార్యక్రమం జరుగుతుంటే ప్రోత్సహిస్తారు. నిర్వాహకులు నమ్మకాన్ని కలుగజేస్తే దాతలకు కొదవే లేదని నిరూపించబడింది. గదులకు సహకరించిన వారు, బ్లాకులకు సహకరించిన వారు, ప్రాంగణానికి భూరి విరాళాలందించిన వారు, డిపాజిట్ల రూపంలో బాలికలకు స్కాలర్‌షిప్‌లు యిస్తున్న వారు.. ఎందరో వున్నారు. అందరి పేర్లు ఇదివరకే ప్రాస్పెక్టస్‌లో చేర్చడం జరిగింది. స్థలాభావం వలన వారి పేర్లు యిక్కడ ఉదహరించ లేకపోతున్నందుకు క్షంతవ్యుణ్ణి. వారే కాదు.. అహ్వానించగానే హాస్టలుకు విచ్చేసి బాలికలకు సూచనలు, సలహాలు యిస్తూ ఉత్తేజపరిచే పెద్దలు, విద్యావేత్తలు ఎందరో... మరెందరో.... వారందరూ మహానుభావులే... అందరికీ... వందనాలు... కమ్మ బాలికలకు జరుగుతున్న సేవా కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా భావించి మరింత మందికి విస్తరింపజేయాలనే సత్సంకల్పంతో మా కార్యవర్గం వున్నదని తెలియజేస్తూ... భవిష్యత్తులో మీ చేదోడు వాదోడు మరింత అవసరమనీ విన్నవించు కుంటున్నాను.

**ఒకనాడు పలువురి ఆకాంక్షగా, ఆశయంగా, ఆలోచనగా ఉన్న బాలికల వసతిగృహం ఆచరణలోకి తీసుకురావటానికి, ఇంత ఉన్నత స్థాయికి తీసుకు రావటానికి, నిర్వహణలో ప్రమాణాలు పాటించటానికి అనేకమంది త్యాగమే మొదటి కారణం. ఎందరో మహానుభావులు తమ ధనాన్ని, సమయాన్ని, మేధస్సును వెచ్చించి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడ్డారు. వారందరికీ కమ్మకులం ఋణపడి ఉంటుంది. ధన్యవాదాలు. సంస్థ సక్రమంగా నిర్వహించబడటానికి ఇప్పటి లాగానే తమ సహాయ సహకారాలను, సలహాలను కొనసాగించాలని విజ్ఞప్తి.**

*డబ్బు అంటే నీకు తెలియకపోతే ఆ డబ్బు నీ దగ్గర ఎక్కువకాలం నిలబడదు.*

# ఎందరో మహానుభావులు... అందరికీ వందనాలు

**సామినేని కోటేశ్వరరావు,** కార్యదర్శి

గుంటూరు పట్టణంలోని కమ్మజనసేవాసమితి కార్యదర్శిగా పనిచేసే అవకాశం లభించటం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. గతంలో కార్యవర్గ సభ్యునిగా 5 సం.రాలు, సహాయకార్యదర్శిగా 4 సం.లు అభివృద్ధిలో భాగస్వామిని అయినందుకు ఆనందిస్తున్నాను.

గ్రామీణ ప్రాంతాల నుండి ఉన్నత విద్యను కొనసాగించటానికి వసతి గృహానికి వచ్చే కమ్మవారి బాలికలకు సేవ చేయుటం ఒక మహద్భాగ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమం సఫలం కావటానికి కార్యవర్గ సభ్యుల సహకారం కీలకమైనది. ముఖ్యంగా **శ్రీ వంకాయలపాటి బలరామకృష్ణయ్యగారు** అధ్యక్షులుగా తన పెద్దరికంతో పలు సమస్యలను సులభంగా పరిష్కరిస్తూ, ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతున్నారు. పాలకవర్గ సభ్యులందరినీ కలుపుకొని ముందుకు వెళుతున్నారు. **గోరంట్ల పున్నయ్య చౌదరి** గారు కోశాధికారిగా తన పలుకుబడి ఉపయోగించి నిధుల సమీకరణకు, వసతిగృహ నిత్యకార్యక్రమాల నిర్వహణలో మిక్కిలి సహకరిస్తున్నారు. అలాగే ఇతర కార్యవర్గ సభ్యులు విధులు పంచుకొని సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఎవరి వ్యాపారాలలో వారు తలమునకలుగా ఉంటున్నప్పటికీ సాయంత్రానికి వసతిగృహ ప్రాంగణంలో కలసి అభివృద్ధి, దైనందిన కార్యకలాపాల గురించి చర్చించుకొని బాధ్యతలు పంచుకోవటం, బాలికల పట్ల కుటుంబ పెద్దల వలె ప్రేమాభిమానాలను ప్రదర్శించటం ముదావహం.

కమ్మజన సేవాసమితి ప్రస్తుత రూపురేఖలు దిద్దుకోవటానికి ఎందరోమహానుభావులు కారణం. స్థలసమీకరణలో **డా. కొండబోలు బసవపున్నయ్యగారు, డా. ముద్దన హనుమంతరావుగారు, వలివేటి నరసింహారావు గారు, వాసిరెడ్డి రామారావుగారు, కీ.శే. కొ(క్రపాటి వెంకట నారాయణ గారు, కీ.శే. గోరిజవోలు సాంబశివరావుగారు (సెంట్రల్ కేఫ్).** మరెందరో పెద్దలు సహకరించారు. వారు సమీకరించిన స్థలం వల్ల ఈ సంస్థ భవిష్యత్ తరాలకు ఆశాజ్యోతిగా వెలుగుతున్నది. ఇందుకు సహకరించిన ముందుతరం వారందరికీ నా కృతజ్ఞతాభివందనాలు.

ఈ సందర్భంగా ముఖ్యంగా పేర్కొనదగిన ప్రముఖులను గురించి కొన్ని మాటలు చెప్పటం నా ధర్మం. గ్రామీణ ప్రాంతాల, వ్యవసాయ కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థినులు ఉన్నత విద్య కొనసాగించటం కష్టతరమై, విద్యను అర్థంతరంగా అపవలసి రావటం గమనించి,హాస్టల్ ఆవశ్యకతను గుర్తించి, మిత్రమండలితో చర్చించి హాస్టల్ భవన నిర్మాణ రూపకల్పనకు ఆద్యులు పార్లమెంట్ సభ్యులు గౌరవనీయులు **యంపరాల వెంకటేశ్వరరావు** గారు. నాటి నుండి నేటి వరకూ హాస్టల్ అభివృద్ధి, నిర్వహణలకు సూచనలిస్తున్న **పెద్దాయనకు** వినమ్ర కృతజ్ఞతాభి వందనాలు.

నాటి ఆలోచనలను ఆచరణలో పెట్టి మిత్ర మండలి, సభ్యులు, దాతల సహకారంతో, ఎన్నో ఒడుదుడు కులను తట్టుకొని, అహర్నిశలు శ్రమించి, ప్రారంభదశలో కేవలం 100 మంది విద్యార్థినులతో ప్రారంభించి 600 మందికి వసతి కల్పించటానికి కావలసిన భవనాలు, ఇతర సౌకర్యాలను అభివృద్ధి పరచిన మహావ్యక్తి / శక్తి **కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి గారు,** వారికి సహకరించిన **శ్రీ వంకాయలపాటి బలరామకృష్ణయ్యగారు, కార్యదర్శి అంబటి చెంచు సుబ్బారావు గారు,** గౌరవనీయ పాలకమండలి సభ్యులు పున్నయ్య గారికి చేదోడు వాదోడుగా నిలిచిన వారి అర్థాంగి **శ్రీమతి సుజాత** గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. హాస్టల్ నిర్మాణానికి తొలి విరాళం అందించిన సహృదయులు, మిత్రులు వడ్లమూడి నాగేంద్రంగారికి కృతజ్ఞతలు. పలురకాలుగా సహకరించిన పారుపల్లి నాగేశ్వరరావుగారికి ధన్యవాదాలు.

**కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి** గారి తదుపరి పాలకవర్గంలో అధ్యక్షులుగా వంకాయలపాటి బలరామకృష్ణయ్య గారు, కార్యదర్శిగా అంబటి చెంచు సుబ్బారావు గారు, కోశాధికారిగా గోరంట్ల పున్నయ్య చౌదరిగార్లతో కలసి సంయుక్త కార్యదర్శిగా, విశేషకృషి

సలిపి, 600 మందికి వసతి ఇవ్వగల స్థాయి నుంచి 1300 మందికి వసతి కల్పించగల స్థాయికి భవన నిర్మాణాలు, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనలో భాగస్వామిని కావటం మరపురాని అంశం.

కమ్మజనసేవాసమితి వసతిగృహంలో ఇంటర్మీయట్ నుండి డాక్టరేట్ వరకు వివిధ విద్యా విభాగాలలో గల విద్యార్థినులందరికీ వసతి కల్పించటం వల్ల వారి మధ్య అక్కాచెల్లెళ్ళ అనుబంధం చూడముచ్చటగా ఉంటుంది. వీరందరూ వివిధ విద్యాసంస్థలలో చదువుచున్నందువల్ల విషయ పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునే సౌలభ్యం ఇక్కడ మెండుగా ఉంటుంది. ఈ వాతావరణం అందరికీ ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

హాస్టలులో ఉండే పిల్లలకు స్ఫూర్తి కలిగించే నిమిత్తం వివిధ రంగాలలో నిష్ణాతులైన నిపుణులతో ఉపన్యాసాలను తరచుగా ఇప్పించటం, వారితో పిల్లలు వ్యక్తిగతంగా చర్చించటం, భవిష్యత్తులో ప్రయోజనకరమైన చిరస్మరణీయ జ్ఞాపకాలు. చదువుతో పాటుగా సమగ్ర అభివృద్ధికి అవసరమైన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, వ్యక్తిత్వ వికాసానికి, నైతిక విలువల పెంపుదలకు దోహదపడే పలు కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుంది. ఆ జ్ఞాపకాలను ఛాయాచిత్రాలుగా తీసుకొని తల్లిదండ్రులకు/ సంరక్షకులకు చూపించి అనుభూతి పొందటం అందరికీ ఆనందంపై కార్యక్రమాలకు ఆహ్వానించబడే ప్రముఖులు విద్యా, వైద్య, పారిశ్రామిక, కళలు, క్రీడలు, పరిపాలన, రాజకీయ రంగాలకు చెందిన వారు.

గత నాలుగైదు ఏళ్లుగా ప్రవాసాంధ్రులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి అత్యున్నతంగా ఎదిగి అమెరికాలో స్థిరపడినవారు హాస్టలును సందర్శించి, ఇక్కడి వసతులను చూసి, పిల్లల పేదరికాన్ని తెలుసుకొని, చదువులో వారి ప్రతిభాపాటవాలను గ్రహించి, ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న విద్యార్థినులకు సహాయాన్ని విరాళాల రూపంలో ప్రకటించటం ప్రశంసనీయం. వారిలో ప్రముఖులయిన శ్రీ నాదెండ్ల గంగాధర్, శ్రీకోమటి జయరామ్, శ్రీవెన్నం మురళి, శ్రీ వేమన సతీష్, శ్రీ మేదరమెట్ల మల్లిక్ మున్నగు వారికి కృతజ్ఞతలు.

హాస్టలు భవన నిర్మాణానికి, ఇతర సౌకర్యాల కల్పనకు భూరి విరాళాలిచ్చి సహకరించిన వదాన్యులు ప్రముఖ పారిశ్రామిక వేత్త, సద్గుణశీలి, వసతి గృహభవన సుజనా ప్రాంగణ ప్రధానదాత, రాజ్యసభ సభ్యులు, గౌ. యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి) గారు, వ్యవసాయాధారిత పారిశ్రామిక ప్రముఖులు, నూజివీడు సీడ్స్ అధినేతలు మండవ వెంకట్రామయ్య గారు, మండవ ప్రభాకరరావు గారు, ఫార్మా రంగ ప్రముఖులు రావి రవీంద్రనాధ్ గారు. ప్రముఖ ఇంజనీరు కావూరి ప్రసాదరావు గారు, నూలు పరిశ్రమ ప్రముఖులు కందిమళ్ళ శ్రీనివాసరావు గారు, శ్రీసత్యసాయి శాంతిసుధ, ధర్మజ్యోతి సన్మానితులు, విద్వాన్, గోగినేని కనకయ్యగారు, ప్రముఖ పారిశ్రామికవేత్త విద్యాదాత, పలుసేవా సంస్థల నిర్వాహకులు కొమ్మారెడ్డి రాంబాబు గారు, ప్రముఖ వ్యాపారవేత్త సమితి శ్రేయోభిలాషి చేబ్రోలు నరేంద్రనాధ్ గారు, విత్తన ఉత్పత్తి రంగ ప్రముఖులు, దాత కారుమంచి ప్రసాద్ గారు, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది, విద్యారంగ ప్రోత్సాహకులు, లావు నాగేశ్వరరావు గారు, ఇంకా ఎందరో మహానుభావులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**భవిష్యత్ ప్రణాళిక :**

కమ్మజనసేవాసమితి ప్రస్తుత వనరులతో హాస్టల్ వసతిని అవసరమున్న వారందరికీ కల్పించలేకపోతున్నది. ప్రస్తుతం 1300 మంది బాలికలకు మాత్రమే వసతి కల్పించగలుగుతున్నాము. ఇంకా కనీసం 700 మంది బాలికలకు వసతి సౌకర్యాలు తక్షణ అవసరంగా గుర్తించటమైనది. విస్తరణ మార్గాల కోసం మన సమితి అన్వేషిస్తున్నది. ఇంకా ఇప్పుడున్న 1300 మందిలో సుమారు 800 మందికి ఉపకార వేతనాల అవసరం ఉన్నది. ఒక్కొక్కరికి కనీస ఉపకారవేతనం రు. 7,000లు ఇచ్చినచో ఒక విద్యా సంవత్సరానికి 56 లక్షల నిధులు అవసరం అవుతాయి.

అదనపు భవనాలు, ఇతర సదుపాయాల కల్పనకు అవసరమైన అనువైన ప్రాంతంలో గల రెండు ఎకరాల స్థలాన్ని పెదకూరపాడు శాసనసభ్యులు గౌ. **కొమ్మాలపాటి శ్రీధర్‌గారు** ఇచ్చారు. ఆదర్శ ప్రజాప్రతినిధిగానే గాక గ్రామీణ నేపధ్యాన్ని క్షుణ్ణంగా జీర్ణించుకున్న వీరు గొప్పమనసుతో ఈ భూరి విరాళం అందజేసినందుకు వారికి కృతజ్ఞతాభివందనాలు.

*అసలు ప్రయత్నమే చేయకపోవడమే అసలైన ఓటమి.*

మరొక గొప్ప దాత మన సమితి శ్రేయోభిలాషి, ఎన్నో ధార్మిక, సేవా సంస్థలకు భూరి విరాళాలను అందించి ప్రోత్సహిస్తున్న జనచైతన్య రియల్ ఎస్టేట్ అధినేతలు **శ్రీమతి మాదల శకుంతలమ్మ, శ్రీ మాదల రత్నగిరిబాబు, శ్రీ మాదల సుధాకర్ వారి కుటుంబ సభ్యులు** విలువైన ఒక ఎకరం స్థలాన్ని చాలా అనువైన ప్రాంతంలో మన సమితికి విరాళంగా ప్రకటించారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

నిధుల సేకరణకు ఐదుగురు కార్యవర్గ బృందం మే నెలలో అమెరికాలో వివిధ ప్రాంతాలలో పర్యటించి, తానా మహాసభలకు హాజరయ్యాము. అక్కడి ప్రవాసాంధ్రుల సహకారం, ప్రోత్సాహం చాలా సంతృప్తికరంగా, ఆశాజనకంగా ఉన్నది. వారు 50 లక్షలు విద్యానిధికి విరాళాలుగా ప్రకటించారు. వారి సహాయంవల్ల గ్రామీణ బాలికల విద్యాభివృద్ధి మరింత బాగా కొనసాగుతుందని ఆశిస్తున్నాము. ప్రవాసాంధ్ర దాతలకు కృతజ్ఞతలు.

భిన్న ప్రాంతాల నుండి, విభిన్న నేపథ్యాల నుండి వచ్చిన వందల మంది బాలికల పట్ల క్రమశిక్షణ విషయంలో, హాస్టలు సక్రమ నిర్వహణ కోసం, కొన్ని సందర్భాలలో కఠినంగా వ్యవహరించక తప్పదు. తత్ఫలితమే గత పది సంవత్సరాల కాలంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడగలిగాము. వాస్తవానికి ఈ ఘనత మన బాలికలకు, వారి తల్లిదండ్రులకు దక్కుతుంది. ఇందుకు సహకరించిన బాలికలు మరింతగా ప్రగతి పథంలో పయనించాలని, తద్వారా కన్న తల్లిదండ్రులకు, జన్మభూమికి మంచిపేరు తీసుకురావాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. క్రమశిక్షణ విషయంలో తమకు కొంత ఇబ్బంది కలిగినప్పటికీ, అర్థం చేసుకొని సహకరించిన గౌరవనీయ తల్లిదండ్రులు, సంరక్షకులందరికీ ధన్యవాదాలు.

మూలనిధి నుంచి రూపాయి కూడా తీయకుండా ఈ పదేళ్ళ ప్రగతి సంచికను తీసుకురావటానికై తమ ప్రకటనలతో ప్రోత్సహించిన అభిమానులు, గౌరవ సోదరులకు సాదర అభివందనములు.

కమ్మజనసేవా సమితి సక్రమ నిర్వహణలో పాలక మండలి సభ్యులు, సామాన్య సభ్యులు, దాతలు, శ్రేయోభిలాషుల సహాయసహకారాలను ఆకాంక్షిస్తున్నాను.

## ప్రవాసాంధ్రుల ఆతిథ్యం

న్యూజెర్సీ, న్యూయార్క్‌లలో స్వర్ణపరమేష్, గోరంట్ల రత్నశిల్పగారు **ఎడిసన్**లో ఆత్మీయ విందు సమావేశం ఏర్పాటుచేశారు.

వర్జీనియా రాష్ట్రంలో (వాషింగ్టన్ డి.సి. దగ్గరలో) మైనేని రామ్, సుష్మ పెద్ది చక్కని హృదయపూర్వక ఆతిథ్యం ఇచ్చారు.

హోటల్ యజమాని ఉప్పుటూరి రామ్‌చౌదరి డా॥ యడ్ల హేమప్రసాద్, వేమన సతీష్, చెన్నుపాటి కిషోర్, ఉన్నవ బుల్లయ్యచౌదరి అనేక విధాలుగా ప్రోత్సహించారు.

అట్లాంటాలో మల్లిక్ మేదరమెట్లగారి అపూర్వ ఆతిథ్యం అందుకున్నాము. తాతినేని శ్రీనివాస్, డా॥ శివ దండా సహకారం మరువలేనివి.

ఇక డల్లాస్‌లో తానా మహాసభలలో భారతదేశం నుంచి వచ్చిన ప్రతినిధులు ఎందరినో కలుసుకోగలిగాం. వారంతా మంచి ప్రోత్సాహాన్ని, ప్రేరణను పంచి ఇచ్చారు. నాట్స్ వ్యవస్థాపకులు మాదాల రవిగారు, న్యూజెర్సీలో డా॥ శివకుమార్, డా॥ బుచ్చి రామప్రసాద్‌గారు చూపిన ఆదరణ చిరకాలం గుర్తుంటుంది. జె.పి. మమ్ములను వెన్నంటిఉండి ఎంతో సహకరించారు. వారందరికీ మన:పూర్వక ధన్యవాదాలు.



గుంటూరుజిల్లా అమృతలూరు మండలం, కూచిపూడి గ్రామస్తులు యలవర్తి ఉమామహేశ్వరరావుగారి కుమారుడు వెంకటేశ్వరరావు, కోడలు లక్ష్మి. ఈ యువదంపతులు డల్లాస్‌లో మన ప్రతినిధి బృందానికి మరువలేని ఆతిథ్యం అందించారు. వారికి శుభాశీస్సులు.

వైఫల్యం ఓటమి కాదు. ఆలస్యం మాత్రమే. తాత్కాలిక అవరోధమే కాని ఎటూపోని దారి కాదు.

# ప్రవాసాంధ్రుల ఔదార్యం

**- గోరంట్ల పున్నయ్యచౌదరి,** కోశాధికారి

వసతి గృహంలో ఉండి విద్యాభ్యాసం కొనసాగిస్తున్న బాలికలకు శుభాశీస్సులు. వారి తల్లిదండ్రులకు నమస్కారములు.

ఇష్టం లేకపోయినప్పటికీ ఇటీవల కాలంలో పెరుగుతున్న అన్ని సరుకుల ధరలవల్ల హాస్టల్ ఫీజులను స్వల్పంగా పెంచక తప్పలేదు. మన ఫీజులు బయటవారితో పోల్చితే చాలా తక్కువ, సౌకర్యాలు ఎక్కువ. ఐనప్పటికీ గ్రామీణ నేపధ్య కుటుంబాల బాలికలకు విద్యాభారం తగ్గించడానికి అర్హులైనవారికి ఉపకార వేతనాలను అందించడానికి ప్రయత్నిస్తున్నాము. అందులో ఒక ప్రయత్నం మేము ఒక బృందంగా తానా సభలకు హాజరు కావడం.

ఉత్తర అమెరికాలో ఉంటున్న తెలుగువారు తమ తెలుగుతనాన్ని, సాంస్కృతిక విశిష్టతలను పరిరక్షించుకుంటూ, జన్మభూమికి దూరంగా ఉన్నప్పటికీ మూలాలను మరువకుండా ఉండటానికి ఒక సంఘాన్ని (తానా) తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా పేరుతో చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసుకున్నారు. తానా ప్రతినిధులు, కార్యవర్గసభ్యులు 2012లో గుంటూరు సందర్శించిన సందర్భంలో కమ్మజన సేవాసమితి వారి ఆహ్వానం మేరకు మన బాలికల వసతి గృహానికి విచ్చేశారు. వాస్తవానికి విదేశాలలో ఉద్యోగాలు, అవసరమైన నైపుణ్యాలు వంటి వివరాలను తెలియ జేయటానికి వారు ఆనందంగా దయచేశారు. బాలికలతో ప్రత్యక్షంగా, ముఖాముఖి సంభాషణలు జరిపారు. గ్రామీణ బాలికల ఉన్నత విద్య ఇటువంటి వసతి గృహసౌకర్యం గనుక లేకపోతే కొనసాగలేదని గ్రహించారు. మేధావంతులు కూడా ముందుకు రాలేకపోతున్నారని తెలుసుకున్నారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాల పట్ల సంతృప్తివ్యక్తం చేశారు. 2013లో జరుగనున్న తానా మహాసభలకు సేవాసమితి ప్రతినిధులను ఆహ్వానించారు.

ఆ ఆహ్వానాన్ని పురస్కరించుకొని మే నెలలో అధ్యక్షులు వంకాయలపాటి బలరామయ్య, కార్యదర్శి సామినేని కోటేశ్వరరావు, మన్నవ సుబ్బారావు, పెద్ది సాంబశివరావు గారు, నేను బృందంగా **డల్లాస్‌లో జరిగిన తానా మహాసభలకు** స్వంత ఖర్చులతో హాజరయ్యాము. అంతకు ముందుగా పరిచయస్తులు, సమితి కార్యక్రమాల ప్రోత్సాహకులు, అభిమానులు వివిధ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన సన్నిహిత సమావేశాలలో పాల్గొని మన సమితి కార్యక్రమాలను, ప్రస్తుత అవసరాలను, ముఖ్యంగా ప్రతిభావంతులైన పేద బాలికలకు ఉపకారవేతనాల కొరకు మూలనిధికి సహాయపడవలసిన ఆవశ్యకతను వివరించాము.

**ఈ సందర్భంగా విరాళాలను అందజేసిన వదాన్యుల పేర్లను దిగువ తెలియజేస్తున్నాము.**

**అనిల్ బొప్పూడి : 250 డాలర్లు**

**శ్రీరామ్ యంపరాల : 250 డాలర్లు**

**తాతినేని శ్రీనివాస్ :1000డాలర్లు**

**క్వాలిటీ సొల్యూషన్స్ : 250 డాలర్లు**

**లక్ష్మణ్ కోడూరి : 100 డాలర్లు**

**మైనేని రామ్ : 2000 డాలర్లు**

**నెట్ వెబ్ (శేషు కానూరి) : 250 డాలర్లు**


రామ్ ఉప్పుటూరి తల్లిదండ్రులు


ఈశ్వర్, హేమ


లావు అంజయ్యచౌదరి


సుబ్బారావు కొల్లా

ప్రసాద్ గుర్రం : 116 డాలర్లు
రాజేష్, సుజాత జంపాల : 1000 డాలర్లు
గోరంట్ల రమ, శ్రీమన్నారాయణ అంబటి : 2000 డాలర్లు
శరత్ / సునీత వేమూరి : 1000 డాలర్లు
శ్రీలత వెల్లంకి :150 డాలర్లు
శ్రీనివాస్ మొక్కపాటి : 300 డాలర్లు
వెన్నాయ్ ఫౌండేషన్ (శ్రీనివాస్ నిమ్మగడ్డ) 1000 డా
అశోక్ బొప్పన : 250 డాలర్లు
నరేన్ గొడుగుల : 250 డాలర్లు
శైలేంద్ర పరిటాల : 250 డాలర్లు
రాణి / శ్రీను ఉన్నం : 500 డాలర్లు
శ్యామ్ యలమంచిలి : 100 డాలర్లు

**నగదుగా ఇంతవరకు అందిన విరాళాలు 5 లక్షల 6వేలు. వాగ్దానాలు. 45 లక్షలు.**
**ఈ దాతలందరికీ కమ్మజన సేవాసమితి తరఫున హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు.**

వీరితో పాటు మరికొందరు దాతలు విద్యానిధికి విరాళాలను వాగ్దానం చేశారు. వారు కూడా త్వరలోనే పంపుతారని ఆశిస్తున్నాము. ఈ దాతలందరికీ మన:పూర్వక కృతజ్ఞతలు తెలుపుకోవటం మా కర్తవ్యం.

యుగంధర్ చిమటా, డల్లాస్ : 5 లక్షలు రూ.
డా. శివ : 1 లక్ష రూ.
డా. హేమప్రసాద్ యడ్ల : 5 లక్షలు రూ.
ఇన్ఫో ల్యాబ్స్, జనార్ధన్ నిమ్మలపూడి : 500 డాలర్లు
జయప్రకాష్ వేజండ్ల : 10 లక్షలు రూ.
కారుమంచి కిషోర్ : 1 లక్ష రూ.
కారుమంచి రమేష్ : 1 లక్ష రూ.
మన్నవ మోహనకిషోర్ : 1 లక్ష రూ.
అనితా మన్నవ, రమేష్ అవిర్నేని : 1000 డాలర్లు
రాధికా చౌదరి కొల్లిపర : 100 డాలర్లు
రత్నశిల్ప గోరంట్ల, పరమేష్ స్వర్ణ : 2000 డాలర్లు
ఉప్పుటూరి రామ్‌చౌదరి : 5 లక్షలు రూ.
సుష్మ, మైనేని రామ్ (గుంటూరు, మైనేని రాంప్రసాద్‌గారి కుమారుడు) : 2000 డాలర్లు
క్వాలిటీ సొల్యూషన్ : 250 డాలర్లు
రాంబాబు యడ్లపల్లి : 250 డాలర్లు
హరీష్ సి.హెచ్. : 50 వేలు రూ
ఈశ్వర్ కక్కెర : 200 డాలర్లు
అంకినీడు గార్లపాటి : 200 డాలర్లు
సత్యనారాయణ మన్నె : 200 డాలర్లు
సుబ్బారావు కొల్లా : 1000 డాలర్లు
సాయిగిరిధర్ ఆరె : 1000 డాలర్లు
డా॥ నరేన్ కొడాలి : 1000 డాలర్లు
రవి గుర్రం : 1000 డాలర్లు
త్రిలోక్. కె. : 2000 డాలర్లు
కోయా బ్రదర్స్ : 1 లక్ష రూ
దినేష్ కొల్లా : 1000 డాలర్లు
రమణ : 1000 డాలర్లు
బుల్లయ్య చౌదరి ఉన్నవ : 1 లక్ష రూ
వెంకటరావు మూల్పూరి : 1 లక్ష రూ
త్రినాధ్ కావూరి : 250 డాలర్లు
చౌడే చౌదరి : 200 డాలర్లు
సతీష్ ద్రోణవల్లి : 1000 డాలర్లు
సురేష్ పాలడుగు : 200 డాలర్లు
సాంబశివరావు గనిపినేని : 200 డాలర్లు
సాయి వల్లూరిపల్లి : 250 డాలర్లు
రాము వలివేటి : 200 డాలర్లు
నాగేశ్వరరావు నల్లూరి : 200 డాలర్లు
రమణ ప్రత్తిపాటి / రామ్ పాలెం : 250 డాలర్లు
మౌళి నల్లమల : 500 డాలర్లు
కిషోర్ చెన్నుపాటి : రూ. 1 లక్ష
రమాకాంత్ కోయ : రూ. 50 వేలు
అమర్ అన్నా : 100 డాలర్లు

**దగ్గుబాటి శ్రీనివాసప్రసాద్ ప్రతియేటా ఉపకార వేతనాలకు రూ. 15 వేలు.**

**బాలా కుక్కపల్లి, కిషోర్ పోట్రు ఒక్కొక్కరు ప్రతియేటా ఇద్దరు బాలికలకు ఉపకారవేతనం.**

*రాజు తన రాజ్యంలోనే గౌరవించబడతాడు. విద్యావంతుడు ఎక్కడైనా గౌరవించబడతాడు.*

## సందేశం



Member
Standing Committee on Finance
Committee on Estimates
Committee on Ethics
House Committee
Consultative Committee for the
Ministry of Road, Transport & Highways
Permanent Special Invitee in the
Consultative Committee for Railways

# ఆకాంక్షలు

***Rayapati Samba Siwaa Rao***
Member of Parliament, (Lok Sabha)
C-1/20, Pandara Park, New Delhi - 110 003
Tel : 011 - 23388272, Fax : 011 - 23388252

కమ్మజన సేవా సమితి కమ్మ విద్యార్థినుల వసతి గృహము పదేళ్ళ ప్రగతి ప్రత్యేక సావనీరు ముద్రణ జరుపుతున్నట్లు తెలిసి చాలా సంతోషిస్తున్నాను.

అనేక కులాలు, జాతులు, మతాల సమాహారమే భారతజాతి. పైకి భిన్నత్వం కనిపించినా అంతరంలో ఏకత్వం కలిగి ఉండటమే మన దేశ ప్రత్యేకత. ప్రతి కులము తనదైన ప్రత్యేకతను, సంప్రదాయాన్ని కలిగి ఉంది. ఒక కులం అభివృద్ధి చెందటమంటే సమాజం ఆ మేరకు అభివృద్ధి చెందటమే అవుతుంది.

కమ్మవారిలో విద్యావంతుల సంఖ్య పెరగాలనే సదాశయంతో, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సౌకర్యం కల్పించేందుకు దాదాపు నూరేళ్ళ క్రిందటే గుంటూరులో బాలుర వసతి గృహం నెలకొల్పటం జరిగింది. ఎందరో పేద విద్యార్థులు ఈ హాస్టలులో చదువుకొని ఉన్నత స్థితికి చేరుకున్నారు.

అదే స్ఫూర్తితో స్త్రీ విద్యను ప్రోత్సహించడం కోసం జిల్లా మారుమూల ప్రాంతాల నుండి విద్యార్థినులై వచ్చే మహిళల కోసం గుంటూరులో హాస్టలు నిర్మాణం చేసి ఇప్పటికి పదేళ్ళు పూర్తి కావడం ముదావహం. స్త్రీ విద్య వల్లనే కుటుంబంలో విద్యా సంస్కృతి అభివృద్ధి చెందుతుందనేది అందరికీ తెలిసిన సత్యమే.

కమ్మ జన సేవాసమితి దిన దినాభివృద్ధి చెందాలనీ, తన జాతి జనుల అభ్యున్నతికి సోపానం కావాలనీ దేశాభివృద్ధిలో కమ్మవారి భాగస్వామ్యం గణనీయం కావాలనీ ఆకాంక్షిస్తున్నాను.

జైహింద్

రాయపాటి సాంబశివరావు

4th Line, Lakshmipuram, Guntur - 522 007, Andhra Pradesh. Tel. : 0863 - 2350400, 2350500, Fax : 0863 - 2240500
Hyedrabad - Tel. : 040 - 23734544, 23734788, Fax : 040 - 23734766, E-mail : sambasivaraorayapati@yahoo.co.in

## సందేశాలు

# అభినందనీయం

వై.వి.రావు
మాజీ పార్లమెంట్ సభ్యులు, గుంటూరు



File Photo

వ్యక్తి జీవితంలోను, మొత్తం సమాజంలోను విద్య విలువైన సాధనం. ముఖ్యంగా స్త్రీకి విద్య అనేది జీవితంలో ఏ ఆపదలు వచ్చినా కష్టాల పాలు కాకుండా ధైర్యంగా నిలబెట్ట కలుగుతుంది. మహిళలు అక్షరాస్యులు అయితే దేశం ఎంతో అభివృద్ధి చెందుతుంది. అందుకే స్త్రీకి విద్య ముఖ్య లక్ష్యం. చదువు అనేది ఖర్చుతో కూడిన పని అనే అపోహ ప్రజలలో ఉండటం చేత గ్రామాలలో చాలా మంది పేద ప్రజలు తమ పిల్లలను చదివించడానికి సుముఖత చూపడం లేదు. ప్రతిభ కలిగిన గ్రామీణ పేద, మధ్య తరగతి కమ్మ బాలికలు ఆర్థిక స్థోమత లేక ఉన్నత చదువులకు వెళ్ళలేకపోతున్నారు. నేను లోక్‌సభ సభ్యునిగా ఉన్న సమయములో వారి స్థితిగతులు చూసి చలించి పోయాను. ఒకవైపు ఆత్మాభిమానం, మరో వైపు పేదరికం. ఈ రెంటి మధ్య వారు పడే మానసిక సంఘర్షణ ప్రత్యక్షంగా చూశాను. కొంతమంది మిత్రులతో దీనికి పరిష్కార మార్గం కోసం సమాలోచనలు జరిపాను. **రక్త సంబంధాలకూ, బంధుత్వాలకూ అతీతంగా ఉండేది స్నేహం. ఈ సృష్టి ఉన్నంతకాలం నిలిచేది ఒక స్నేహమే.** అలాంటి నా మిత్రమండలి సభ్యులు నా వెన్నంటి ఉండి నన్ను ముందుకు నడిపారు. మంచి సలహాలతో ముందుకు నడిపిన మిత్రుల ఆకాంక్షలతో తక్షణమే కమ్మ బాలికల వసతిగృహం ఏర్పాటు చేయాలనే ఆలోచన తొలిసారిగా నాలోనే వచ్చింది. **బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలనే సత్ సంకల్పం నా జీవితంలో మరపురాని సంఘటన.** ఆలోచన నాది అయినప్పటికీ కార్యరూపం దాల్చటానికి కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి, అనేకమంది దాతలు నిస్వార్థంగా తమ సహాయ, సహకారాలు అందించారు. ఇంతమంది మన్ననలు పొందుతున్న ఈ కమ్మ బాలికల వసతి గృహం నా మనసులో నుంచి వచ్చిన ఆలోచన అని చాలామందికి తెలియదు. ఈ విషయం చెప్పటానికి నేను గర్విస్తున్నాను.

ప్రత్యక్షంగా, పరోక్షంగా కమ్మ జన సేవా సమితి అభివృద్ధి చెందటానికి అనేక మంది పెద్దలు సమష్టి కృషి చేశారు. మహిళలకు విద్య అవసరం అని స్త్రీ విద్యను ప్రోత్సహించడానికి ముందుకు వస్తున్న దాతలకు సర్వదా కృతజ్ఞతలు. ఆడ పిల్లలకు రక్షణ లేని నేటి సమాజంలో వందలాది మంది బాలికలకు రక్షణ కల్పిస్తూ వారి బాగోగులు పర్యవేక్షిస్తున్న కమ్మజన సేవా సమితి **కమిటీ వారి కృషి అభినందనీయం.**

# SHIVASHAKTHI LILA & ANJAN FOUNDATION

**(CHARITABLE SOCIETY) REGD. NO. 694/2006**



## అభినందనలు

**మానవసేవే మాధవసేవ** అను ఆర్యోక్తిని అనుసరించి, కనపడే సమాజమే భగవంతునిగా భావించి సేవించు సంస్థ మన కమ్మజన సేవా సమితి. ఒక స్త్రీ విద్యావంతురాలయితే ఒక కుటుంబం మొత్తము విద్యావంతులవుతారనే గాంధీ మహాత్ముని ఉదాత్త ఆశయాలను పుణికిపుచ్చుకొని సేవాసమితిని స్థాపించి ప్రత్యేకంగా విద్యార్థినులకు విద్యాసేవలందిస్తున్న పాలకవర్గాన్ని అభినందిస్తూ, గుంటూరు నగరములో సువిశాల ప్రాంగణములో, దాతల సహకారముతో, కోట్ల రూపాయలు వెచ్చించి, భవన సముదాయములను నిర్మించి కేవలం బాలికలకు ఇంటర్ నుండి ఇంజనీరింగ్ మరియు పి.జి. వరకు మంచి రక్షణతో కూడిన వసతి గృహమును, దాదాపు 14 వందల మంది విద్యార్థినులతో సమర్థవంతముగా నడుపుతున్న పెద్దలకు మనసారా అభినందనలు తెలుపుకుంటున్నాము,

గ్రామీణ బాలికలు వేలాది సంఖ్యలో ఈ వసతి గృహములో ఉండి విద్య నభ్యసించాలని ఈ హాస్టల్ భవన సముదాయము ఇంకా అభివృద్ధి చెందాలని ఆశిస్తూ దానికి మా సహకారం ఎల్లప్పుడు ఉంటుందని మనవి చేస్తున్నాము.

తక్కువ ఖర్చుతో బాలికలకు వసతిని చేకూర్చి, ఇంటి తరహా భోజనం అందిస్తూ, భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పట్ల గౌరవభావాన్ని పెంపొందిస్తూ, ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతూ మంచి సామాజిక సేవాభావంతో ఆదర్శవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను మరొక్కమారు మనసారా అభినందిస్తున్నాము.

అలానే ఈ వసతి గృహములో చదివిన విద్యార్థినులు మంచి సేవాభావంతో సమాజసేవ చేయాలని, దేశాభివృద్ధికి తోడ్పడాలని, మంచి పౌరులుగా రాణించాలని ఆశిస్తున్నాము. ఇంకా ఈ వసతి గృహములో ఉండి విద్యనభ్యసించిన విద్యార్థినులు, మహిళలలో మణిపూసలు కావాలని భారతదేశము గర్వించేటంతటి గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని, మన వంశానికి జాతీయస్థాయిలో మంచిపేరు తీసుకురావాలని ఆశీర్వదిస్తూ, ఆకాంక్షిస్తూ.......

మీ

**శ్రీ జి.వి. ఆంజనేయులు**
శాసనసభ్యులు, వినుకొండ.
**శ్రీమతి జి. లీలావతి**

Regd. Office : H.No. 7-1-621/98 & 34, Opp. UTI Bank, Main Road, S.R. Bazar, Hyderabad - 500 038
Phone : 66687276 / 7 / 8, Fax : 040-66821339
Vinukonda Office : D.No. 23-6/1, Palnadu Road, Vinukonda - 522 647, A.P., Telefax : 086646-275306

# విద్యార్థులకో ఆత్మీయ సందేశం



**డా॥ త్రిపురనేని హనుమాన్ చౌదరి**
డైరెక్టర్ ఫర్ టెలికాం మేనేజ్‌మెంట్ & స్టడీస్
ఛైర్మన్, ప్రజ్ఞాభారతి, ఆంధ్రప్రదేశ్
ఫెలో : టాటా కన్సల్‌టెన్సీ సర్వీసెస్
మాజీ ఛైర్మన్ విదేశ్ సంచార్ నిగమ్ లి.
డిప్యూటీ డైరెక్టర్ జనరల్, టెలికాం శాఖ
ఛైర్మన్, భారతీయ విద్యాభవన్, హైదరాబాద్.

పుట్టినప్పుడు మానవులందరూ సమానులే. కాని కాలక్రమేణ అసమానులవుతారు. దీనికి ముఖ్య కారణాలు కుటుంబపు పెంపకం, విద్యాలయంలో గురువుల బోధ, సహాధ్యాయుల సాంగత్యం, వారి ప్రవర్తన, దేవాలయాల్లో పండితుల సాన్నిధ్యంలో, ఆధ్యాత్మికతా ప్రభోదం, సూక్ష్మంగా చెప్పాలంటే, మనిషియొక్క వ్యక్తిత్వం "ఒడి, బడి, గుడి'ల్లో శిల్పింప (Sculpted) బడుతుంది. తల్లి ఒడిలో లాలిపాటలు వినడం, కుటుంబసభ్యుల నీతి, నియమ ప్రవర్తన, గురువుల వల్ల మనలో ఉన్న దైవాంశము, ప్రతిభ ప్రచోదితమవడం, సాధుసంత్‌ల ప్రవచన శ్రవణం ద్వారా నిత్యానిత్య వివేక విచార సంప్రాప్తి కలుగుతూ– వీటన్నిటివల్ల మనోవికాసం జరుగుతుంది.

మనం గురువుల వద్దనుండి నాల్గోవంతు, సహాధ్యాయులనుండి నాల్గోవంతు, స్వమేధస్సు ద్వారా మరో నాల్గోవంతు, చివరి నాల్గవవంతు, జీవితాంతం వరకు కాలక్రమేణ నిరంతర కృషితో (Life long learning) నేర్చుకుంటాం. ఆదేశింపబడ్డ పాఠ్యపుస్తకాల ద్వారానేగాక, ప్రాచీన, సమకాలీన గ్రంథాల ద్వారా, సమగ్ర, సంతులిత జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. వ్రాయబడిందల్లా, విన్నదంతా, ప్రమాణికంగా, సత్యంగా తలపకూడదు. విద్యవల్ల సదసద్వివేక చతురత కలగాలి. అలా కలిగించని విద్య నిరర్థకం. ప్రతివిద్యార్థి, వ్యక్తి ఆలోచనా శక్తిని, విశ్లేషణాపటిమను పెంపొందించుకోవాలి.

నిష్ణాతులైనంత మాత్రాన, చాతుర్యం కలిగినంత మాత్రాన వ్యక్తి గొప్పవాడు కాజాలడు. బుద్ధిలేని విద్య వ్యక్తికీ, సమాజానికి హానికరం. బుద్ధి, నీతి నియమాలు కెమిస్ట్రీ, ఫిజిక్సు, కంప్యూటర్, ఐ.టి. విద్యలవల్ల రావు. సాహిత్యం ద్వారా, చరిత్ర ద్వారా వస్తయ్. అదికూడా మాతృబాషలోని సాహిత్యమే సరియైన, చిరస్మరణీయమైన, విలువలను నేర్పగలదు. రామాయణం, మహాభారతం, నీతిచంద్రిక, వేమన, సుమతీశతకాలు, భర్తృహరి సుభాషితాలూ అమూల్యమైన సంపదలు. ప్రతి వ్యక్తీ వాటిని చదివి, నీతి నియమాలను, ధర్మాన్ని విధులను తెలుసుకొని జీవితాన్ని సుగమం, సార్థకం చేసుకోవాలి.

విద్యార్థినులు, స్త్రీ సృష్టికి మూలమని తెలుసుకోవాలి. సనాతన ధర్మం–హిందూత్వం స్త్రీకి ఎంతోగౌరవాన్ని, ఆదరణను ఇస్తోంది. సోదరిగా, తల్లిగా, భార్యగా, శక్తి చోదకిగా, స్త్రీని గౌరవిస్తోంది, భారతీయేతర మతాల్లో స్త్రీ దేవుళ్లు లేరు. లక్ష్మిగా, సరస్వతిగా, పార్వతిగా, దుర్గగా, స్త్రీ దేవుళ్లని పూజిస్తాం. పురుషదేవుళ్లపేర్లు, స్త్రీయొక్క భర్తగా చెబుతాం–సీతారాముడు, లక్ష్మీనరసింహుడు, ఉమా మహేశ్వరుడు, రాధాకృష్ణుడు, ఉమాపతి–ఇలా భారతీయతను నిలుపుకోవాలంటే, ఆదర్శమూర్తుల నుండి స్ఫూర్తి పొందాలంటే, మనపేర్లు సోన్యా, లూన్యా, చరిత, భరిత, అరణ్య, అనూష, మౌనిక, గాక అన్నపూర్ణ అనసూయ, సావిత్రి, దుర్గ, పార్వతి, సరస్వతి, సీత, సౌమిత్రి, రుక్మిణి, యజ్ఞసేనిలా ఉండాలి.

*నేను ఇది కొనలేను, చేయలేను అనవద్దు. ఎలా కొనగలను, ఎలా చేయగలను అని ఆలోచించు.*

# ప్రత్తిపాటి పుల్లారావు



శాసనసభ్యులు, చిలకలూరిపేట

కమ్మజన సేవా సమితి నిర్వహిస్తున్న గ్రామీణ బాలికల వసతి గృహం స్థాపించి పదేళ్ళు పూర్తి అయిన సందర్భంగా సందేశం పంపటానికి చాలా సంతోషంగా ఉంది.

**హాస్టలు నిర్వహణ మామూలు విషయం కాదు.** వందలమంది బాలికలకు ఆదర్శప్రాయంగా వసతి కల్పిస్తున్న సభ్యులకు, దాతలకు, పాలక మండలికి నా అభినందనలు. మీ కార్యక్రమాలు మరింతగా విస్తరించాలని నా శుభాకాంక్షలు.

గ్రామీణులలో కూడా చదువు అవసరం తెలిసింది. అవగాహన పెరిగింది. ముఖ్యంగా బాలికలు సౌకర్యాలు, భద్రత, ఆర్థిక చేయూత లేక ఉన్నత విద్యను కొనసాగించలేకపోతున్నారు. అటువంటి వారిలో కొందరికి ఇలాంటి వసతి గృహాలు చాలా కావాలి. ఆ పనిని స్వచ్ఛంద సంస్థలు మాత్రమే చేయగలవు. కమ్మజన సమితి నడుపుతున్న **వసతి గృహం ఆదర్శంగా, ఆచరణ సాధ్యమని నిరూపించేలా పనిచేస్తుంది. అందరికీ మనసారా అభినందనలు.** ●

---

మన వ్రతాలకూ, అలంకరణాలకూ ఎంతో అర్థం, ప్రయోజనాలున్నాయ్. పాశ్చాత్యులనుంచి-అందరినుంచి మంచిని నేర్చుకోవాలి. నవీనత, నాగరికత అనే భావంతో అంధానుకరణం, మంచిదికాదు. ఎన్ని, ఎటువంటి ఉద్యోగాలు చేసినా, గృహనిర్వాహకత్వం, మాతృత్వం, బంధుమిత్రత్వం మరచిపోకూడదు. పరస్పరాధారం మానవత్వలక్షణం. ప్రతిపనీ విలువ కలిగిందే. కేవలం ఆఫీసుల్లో ఉద్యోగమో, ఊడిగమో మాత్రమే విలువ కలిగింది కాదు. కన్నబిడ్డల పాలనవారుల కప్పజెప్పి, ఎవరి నుద్ధరించగలం? ఏ భారతీయ భాషయందూ "హక్కు" అనే పదంలేదు (హక్కు అనేది అరబీపదం). మనభాషలో, విధి అనే పదం, మనం ఏంచేయాలో చెబుతుంది. విధులు నిర్వహిస్తే, తన్మాత్రలో ఫలాలు అనివార్యంగా వస్తాయి. స్త్రీలహక్కులు, బాలల హక్కులూ, జంతువుల హక్కులూ, వృద్ధుల హక్కులూ అంటూ విధులను విస్మరించడం తగదు.

ప్రతి వ్యక్తీ సమాజసభ్యుడు. పెద్దమనిషిలా ప్రవర్తించాలి. వేషం, భాష సౌమ్యంగా ఉండాలి. సెల్‌ఫోన్‌ల మీద అన్నిచోట్లా, అందరిమధ్యలో, ఏకాలంలోనయినా మాట్లాడరాదు. వేచి యుండవలసి వస్తే "క్యూ"లోనే ఉండాలి. సమయపాలన చేయాలి, జనాలమధ్య ఆవులింత, తుమ్ము, హాసము, నిష్ఠీవనం చేయరాదు.

విద్యార్థినులనుద్దేశించేకాదు, అందరిని ఉద్దేశించే పై విషయాలను వ్రాశాను. విద్యతోపాటు బుద్ధిని, నేర్పరితనంతోపాటు వినయము, సంపదతోపాటు సౌహార్ద్రమూ, భుక్తితోపాటు ముక్తి, శక్తితోపాటు సహాయతను నేర్చుకోవాలని కోరుతున్నాను. ఈ క్రిందిసూక్తులు చిరస్మరణీయం, ఆచరణీయం.

*ఆనోభద్రా, రితవోయాంతు విశ్వతః*
*వసుధైవ కుటుంబకం*
*సహనావతు; సహనౌభునక్తు*
*తేజస్వినావధీత మస్తు.*
*సర్వేసంతు నిరామయా* ✸

నీ మనస్సుకు ఏది సరైనదని అనిపిస్తే దానిని చేయి. చేసినా చేయకపోయినా విమర్శలు వస్తాయి.

## మీ కృషి శ్లాఘనీయం



**వై.ఎస్. చౌదరి (సుజన)**

పార్లమెంట్ సభ్యులు (రాజ్యసభ)

గుంటూరులో 'కమ్మజన సేవా సమితి'కి అనుబంధంగా వున్న విద్యార్థినుల వసతిగృహం దశమ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా మీకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

పదేళ్ళ క్రితం 100 మంది విద్యార్థినులతో ప్రారంభమైన ఈ వసతి గృహం ఈనాడు నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు చెందిన 1400 మంది పిల్లలకు ఆశ్రయం కల్పించడం ముదావహం. ఇంటర్మీడియెట్ మొదలు ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చదువుకునే పిల్లలనేకమందికి ఆశ్రయం కల్పిస్తూ, **ఆడపిల్లల్లో అక్షరాస్యతను పెంచేందుకు మీరు చేస్తున్న కృషి శ్లాఘనీయం.**

మహిళలు ఎంత ఎక్కువగా అభివృద్ధి చెందితే అంతగా మెరుగైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుంది. 'కమ్మజన సేవా సమితి' రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఈ విధమైన సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని కోరుకుంటున్నాను.

## వేల కుటుంబాల దీవెనలు



**"కమ్మజన సేవా సమితి'** మంచి మనసులు గల మంచి మనుషుల ఆలోచనలో నుండి పుట్టినది. ఈ కులంలో పుట్టినందుకు భగవంతుడు మనకు ఇచ్చిన అన్ని వనరులను, ఉపయోగించి ఎంతో మంది పేద విద్యార్థినులకు చదువులు చెప్పించి వారిని జీవితంలో మంచి స్థితికి వచ్చేటట్లుగా చేయడానికి, నిరంతరము ఆలోచించే ఎంతో మంది పెద్దమనుషులకు కృతజ్ఞతాభివందనములు. ఇది నిరంతర యజ్ఞము. ఈ యజ్ఞఫలాలు ఎంతో మంది జీవితాలకు వెలుగురేఖలు. సమష్టికృషి సేవాతత్పరతతో మీరు చేస్తున్న కృషికి ఆ భగవంతుడు మీకు అన్ని విధాలుగా సహకరిస్తారని ఆశిస్తూ, ఇన్ని వేల కుటుంబముల దీవెనలు మీకు ఉండాలని కోరుకుంటూ, భవిష్యత్తులో ఇది శాఖోపశాఖలుగా విస్తరించాలని కోరుకుంటున్నాను.

**యరపతినేని శ్రీనివాసరావు**

శాసనసభ్యులు, గురజాల





బంగారం అన్నిచోట్లా ఉంటుంది. దానిని తెలుసుకొనే శిక్షణ, నైపుణ్యం అందరికీ ఉండదు.

# స్త్రీ విద్యా చరిత్రలో సువర్ణాక్షరాలు



**కొమ్మాలపాటి శ్రీధర్**
శాసనసభ్యులు, పెదకూరపాడు.

గుంటూరుజిల్లా చదువులకు పుట్టినిల్లు. ఇక్కడినుంచి వచ్చిన డాక్టర్లు, ఇంజనీర్లు ప్రపంచవాప్తంగా కీర్తిప్రతిష్టలు అందుకుంటున్నారు. కష్టపడి పనిచేయడానికి, కొత్త వాతావరణానికి అలవాటుపడడానికి వీరు సిద్ధహస్తులు. ముఖ్యంగా కమ్మయువత అన్ని రంగాలలో రాణించడానికి ఇవే కారణాలు. వ్యవసాయ ఆధార కుటుంబాలలో ఆదాయాలు స్థిరంగా ఉండవు. మధ్యతరగతి, పేద కుటుంబాలకు చదువులు పెనుభారమౌతున్నాయి. అయినా తల్లిదండ్రుల త్యాగాల వల్ల పిల్లలు చదువును కొనసాగించగలగుతున్నారు. కానీ బాలికల చదువు నల్లేరుమీద బండిలాగా నడవటంలేదు, ముళ్ళబాటలాగానే ఉంటుంది.

ఈ పరిస్థితులలో గుంటూరు నగరంలో కమ్మజన సేవాసమితి ముందుచూపుతో పదేళ్ళ క్రితమే గ్రామీణ బాలికలకు వసతిగృహం ప్రారంభించడం అందులో వసతి సౌకర్యాలను పదిరెట్లు పెంచగలడం సామాన్యవిషయం కాదు. ఈ పదేళ్ళు స్త్రీ విద్యాచరిత్రలో సువర్ణాక్షరాలుగా నిలిచిపోతాయి. **దాదాపు 13 వందల మంది బాలికలకు ఆదర్శమైన రీతిలో సేవలందిస్తున్న పాలకవర్గానికి ఇతర సభ్యులకు అభినందనలు.**

ఇంకా ఇటువంటి సేవలు విస్తరించడానికి నాకు చేతనైనంతమేరకు తోడ్పడగలనని విన్నవించు కుంటున్నాను. ఇక్కడి సేవలు అందుకుంటున్న బాలికలు కూడా తమ భవిష్యత్తును బంగారుబాటగా మలచుకోవడానికి ఎన్నోత్యాగాలు చేయాలి. వారి సర్వతోముఖాభి అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నాను.

---

## తెలుగు సంస్కృతి, సాంప్రదాయము

తెలుగు ముంగిట నిలిచి చూడర
గోమయపు కళ్ళాపి కనరా।
ముద్దులొలికెడి ముగ్గులివిరా।
కాలద్రొక్కక కాంచి నడవర
ద్వార బంధము తీరు చూడర
గడప యిది కళ్ళార గనరా।

పసుపు కుంకుమ బొట్ల వరుసతొ
ముగ్గులతొ మురిపించుచున్నది
కొట్టముల గోవులను చూడర
లేచి యెగిరెడి లేగలవిరా।

తెలుగు లోగిలి తొంగి చూడక
తడబడక అడు గిడర లోనికి
సంస్కృతికి యిది అలవాలము
కాంచరా। కనులార సోదర,
గాటగట్టిన గేదెలవిరా।

రంకెలిడు వృషభములు యివిరా।
పచ్చిగడ్డితొ, ఎండుసొప్పతొ
నిండియున్నవి మచ్చులవిరా।
గరిసెలను, గాదెలను గనరా।
ఎండుధాన్యము నిండి యున్నది
అటకపై, అరకలను చూడర
గుంటకల, గొఱ్ఱులను కనరా।
॥ తెలుగు సంస్కృతి॥

పరుగెత్తటానికి ప్రయత్నించే ముందు నడక నేర్చుకో. వేయి మైళ్ళ ప్రయాణమైన ఒక అడుగుతోనే మొదలుపెట్టాలి.

**బాలికల వసతి గృహదశాబ్ది ఉత్సవం**
**కీర్తి దశదిశల వ్యాపించాలని కోరుకుంటూ.....**



చదువని వాడజ్ఞుండగు
చదివిన సత్ అసత్ వివేక చతురత కలుగున్
చదువగ వలయును జనులకు
చదివిన శీలంబు మిగుల చక్కగ అబ్బున్. మహాభారతము

"విద్యకు సాటి ధనంబులేదిలన్"

విద్యానామ సరస్వరూప మధికమ్ ప్రచ్ఛన్నగుప్తమ్ ధనమ్
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూనామ్ గురుః
విద్యా బంధు జనో విదేశగమనే విద్యా పరా దేవతా
విద్యా రాజసుపూజ్యతే, నహి ధనం విద్యా విహీనః పశుః ... భర్తృహరి

ఉపాధ్యాయాన్ దశాచార్యః
ఆచార్యాన్ శతం పితా
సహస్రంతు పిత్రాణాం మాతా
గౌరవేణాతి రిచ్యతే -
పదిమంది ఉపాధ్యాయుల కన్న ఒక ఆచార్యుడు గొప్ప.
వందమంది ఆచార్యుల కన్నా ఒక తండ్రి గొప్ప.
వెయ్యిమంది తండ్రుల కన్నా ఒక తల్లి గొప్ప.
పూజించ తగినది - మీరు చేస్తున్నది "ఒక మహాయజ్ఞము"

ప్రతి ఫలాపేక్ష లేకుండ ఇతరులకు మేలు చేకూర్చే పని యజ్ఞమన్నారు కృష్ణ పరమాత్మ అనేక మంది విద్యార్థినులను ఒకచోట చేర్చి, సకల సదుపాయములు సమకూర్చి వారి విద్యాభివృద్ధికి భవిష్యత్తుకు ఎంతో తోడ్పడుచున్న మీ అందరి కృషి బహుధా ప్రశంసనీయము నిస్వార్థ సేవా పరాయణులైన మీ కార్యకర్తలందరకు, దాతలకు, విద్యార్థినులకు, అందరకు సర్వేశ్వరుడు సదా సకల శుభసంపదలు, శక్తి సామర్థ్యములు ఆయురారోగ్యములు సర్వదా ప్రసాదించాలని కోరుకొనుచున్నాను.



**విద్వాన్ గోగినేని కనకయ్య**
ధర్మజ్యోతి పురస్కారగ్రహీత
విద్యాదాత



## ప్రశంస

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మ జనసేవా సమితి బాలికల వసతిగృహం దశమ వార్షికోత్సవం జరుపు కొంటున్న శుభ సందర్భముగా పాలక వర్గానికి, విద్యార్థినులకు, సిబ్బందికి శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుచున్నాను. పాలకవర్గ బాధ్యులు వంకాయలపాటి బలరామయ్య, సామినేని కోటేశ్వరరావు, గోరంట్ల పున్నయ్య చౌదరి మిగతా సభ్యులను ప్రత్యేకముగా అభినందిస్తున్నాను.

కులాన్ని సేవ కోసం ఉపయోగించడం, అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ, ఆర్థిక సమస్యలతో చదువు కొనసాగించలేని దశలో ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను గుర్తించి వారికి భోజనం, వసతి కల్పించి వారి చదువు పూర్తిచేసి, జీవితంలో స్థిరపడేందుకు దోహదం చేస్తున్న సేవా సమితి కృషి అభినందనీయం. ఈ సేవా సమితి కృషి రాష్ట్రంలో మిగతా వారందరికి మార్గదర్శకం కావాలని నేను ఆకాంక్షిస్తున్నాను. ఇక్కడి విద్యార్థినులు చదువుతోపాటు క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పొందడం ముదావహం. భవిష్యత్తులో మరిన్ని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో ఉంటూ అత్యుత్తమ ప్రతిభ కనపరుస్తూ, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు మరింతమందికి సమితి సేవ చేసేందుకు దాతలు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను. దశమ వార్షికోత్సవం జరుపుకుంటున్న గుంటూరు కమ్మజన సేవా సమితి పాలకవర్గాన్ని మరోసారి అభినందిస్తూ...

**డాక్టర్ కోడెల శివప్రసాదరావు**
మాజీ మంత్రి, నరసరావుపేట



## సకల శుభములు కలగాలి

**డా॥ కొండబోలు బసవ పున్నయ్య**

2002 సం॥లో ఘంటా పున్నయ్య చౌదరి గారు అధ్యక్షులుగాను, కొత్త కార్యవర్గం ఏర్పడింది. దాతలు వందల మంది తమకై తామే ముందుకు వచ్చి, ఆర్థిక సహాయం చేయడం జరిగింది. కమ్మ విద్యార్థినుల వసతిగృహం అంచెలంచెలుగా - చాలా ఘనంగా - అన్ని సౌకర్యాలతో నిర్మాణం చేయగలిగారు. ఈ వసతిగృహం వంటిది ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడ లేదని పలువురి ప్రశంసలందు కొంటున్నది. ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, ఇతర పెద్దలు నిరంతరం ఈ వసతిగృహ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. శ్రీ బలరామయ్య గారు, వారి బృందం దీటుగా గత నాలుగైదు సంవత్సరాలుగా, ఎనలేని కృషి చేస్తూ ఉపకార వేతనాలకు నిధిని సేకరించడం మరొక ముఖ్య విషయం. నాకు అవకాశం ఉన్నంతవరకు అందులో కూడా సంతోషంగా భాగస్వామిని అవుతున్నాను. ఈనాడు అద్దె భవనాలను సైతం తీసుకొని, నిరుపమాన సేవలు మన సంఘానికి అందించడం ప్రశంసనీయం.

ఇంతమంది విద్యార్థినులు 1400 లకు పైగా చేరే పరిస్థితులు, ముఖ్యంగా గ్రామీణ విద్యార్థినుల, వారి తల్లిదండ్రుల దృక్పథంలో మార్పు రావడం వలన, ఉన్నత విద్య, సాంకేతిక విద్యల్లో పోటీపడి, బాలుర కంటే మిన్నగా ఫలితాలు సాధిస్తున్నందువలన-ఈ వసతిగృహం అవసరం ఇంకా ఎంతైనా ఉన్నదని నేను భావిస్తున్నాను. నేను ఎంతోకాలంగా బాలుర వసతి గృహాలను నిర్వహిస్తూ ఉన్నాను. ఈనాడు బాలుర వసతిగృహాల కంటే బాలికల వసతిగృహాలే ప్రధానం. కనుక, నాకు తెలిసిన దాతలకు, చిరుసహాయం చేసే వారికి బాలికల వసతిగృహానికి సహాయపడండి అని సలహా ఇస్తుంటాను.

మన 'కమ్మజన సేవాసమితి'కి భగవంతుని ఆశీస్సులు నిరంతరాయంగా ఉండాలని ప్రార్థిస్తాను. ఇక్కడ వసతి సౌకర్యాలు పొంది విద్యావిషయంగా అభివృద్ధి చెందుతున్న బాలికలకు సకల శుభములు కలగాలని కోరుకుంటున్నాను.

# కీ.శే. ఘంటా పున్నయ్య చౌదరి




**బాలికల విద్యాభివృద్ధికి తపించిన తపస్వి**
**కలలను సాకారం చేసుకున్న ధన్యజీవి ప్రముఖ ఆడిటర్**

**ఘంటా పున్నయ్యచౌదరి గారు** గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలోని గూడవల్లి గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. అతికష్టమైన, నూటికి నలుగురైదుగురు మాత్రమే ఉత్తీర్ణులు అయ్యేటంతటి కష్టమైన చార్టర్డు అకౌంటెంటు కోర్సులో ఉత్తీర్ణత సాధించి, చిన్నవయసులోనే ప్రముఖ ఆడిటర్‌గా పేరుగాంచారు. గుంటూరు కేంద్రంగా హైదరాబాద్, విశాఖ పట్టణాలలో శాఖలను నెలకొల్పి వృత్తిరీత్యా తీరిక లేకుండా ఉన్నప్పటికీ గ్రామీణ వ్యవసాయ నేపధ్యంగల మహిళల విద్యాభివృద్ధికి ఎంతో చేయవలసి ఉందని తపించారు. అటువంటి సేవల అవసరం గుంటూరు ప్రాంతంలో ఎక్కువగా ఉంది. బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మజన సేవాసమితికి గల స్థలం, దానిని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూ నెమ్మదిగా అభివృద్ధికి పునాదులు వేస్తున్న గత పాలకవర్గాలు, సానుకూల దృక్పధంగల పెద్దలను మించిన మరేమి వనరులు ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకొని తొలిఅడుగు వేయాలనుకున్నారు మన పున్నయ్యగారు.

"ఒక రకం వ్యక్తులు అసలు పనినే ప్రారంభించరు. మధ్యములు ప్రారంభించి ఆటంకాలు రాగానే ఆగిపోతారు. కానీ ఉత్తములు ఎన్ని విఘ్నాలు వచ్చినా అనుకున్న పనిని సాధించేవరకు ఆగరు". అన్న భర్తృహరి సుభాషితం మన పున్నయ్యచౌదరిగారికి సరిగ్గా సరిపోతుంది. పక్కా వ్యూహరచన, ప్రణాళికను సిద్ధం చేసుకొని 2003లో గ్రామీణ బాలికలకు వసతి గృహాన్ని కేవలం 110మంది బాలికలతో ప్రారంభించారు.

మనం జీవించేది సంవత్సరాలలో కాదు, చేసిన పనులలో. శ్వాసలలో కాదు ఆలోచనలలో – అరిస్టాటిల్











ఇతరులు సుఖంగా నడవడానికి గతుకులులేని బాటను వేయాలి. ప్రణాళికాబద్ధంగా ప్రయాణం సాగించాలి. ఆయనొక సమర్థుడైన నిర్వహణాదక్షుడు. ఉన్న వనరులను వృధా చేసుకోకుండా, నూతన వనరులను సమర్థవంతంగా సమకూర్చుకొని వినియోగించుకోగల నేర్పరి.

అటు తన వృత్తిపరమైన వత్తిడి ఒకవంక. హాస్టల్ నిర్వహణలో రెప్పకొట్టడానికి వీలులేని అప్రమత్తత మరొకవంక అవసరం. పున్నయ్యగారికి ఆనాటి పార్లమెంట్ సభ్యులు గౌ. వై.వి.రావు మిత్రమండలి చేయూత అందిచారు. ఒకస్థాయిలో స్థిరత్వానికి చేరుతుండగానే, అంతటితో తృప్తిపడక మరొకస్థాయి అభివృద్ధికి ప్రణాళికలు రచించడం ఉత్తమ నాయకుని లక్షణం. తన పేరును, పరిచయాలను ఉపయోగించుకొని భావసారూప్యం గలవారికి అవసరాలను వివరించి నిధుల సేకరణకు నడుం బిగించారు. ఇవాళ ఒకస్థాయికి చేరిన తర్వాత మన హాస్టల్‌కు విరాళాలు స్వచ్ఛందంగా లభించడంలో ఆశ్చర్యంలేదు. కానీ ఆనాడు చాలా కష్టం. అయినా తాను అడిగేది తన స్వంతంకోసం కాదు కనుక పదిమందిని అడిగితే ఒకరైనా ఇవ్వరా అని పట్టుదలతో తన సమయం వెచ్చించారు. ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్త ఆర్.టి. రవిగారు, మండవ వెంకట్రామయ్యగారి వంటి దాతలు కుటుంబసభ్యులు తన ఖాతాదారులు, వ్యాపారులు ఎక్కడో ఉండేవాళ్ళు కూడా పున్నయ్యగారి ఆశయాన్ని సమర్థించేవాళ్లు, విశ్వసనీయమైన ఆయన వ్యక్తిత్వం చూసి విరాళాలు ఇచ్చారు.

తాను సమితి కోశాధికారిగా, అధ్యక్షునిగా పదవులు సమర్థవంతంగా నిర్వహించారు. అయినా తాను నిర్వహించని పనిలేదు. అవసరమైనప్పుడు తానే ప్రధాన సంరక్షకునిగా కూడా నిలిచేవాడు. సౌకర్యాలు సమకూర్చడంలో రాజీపడేవాడు కాదు. ఇంకా ఇంకా మెరుగుపరచాలని ప్రయత్నించేవాడు. నిరంతరంగా నాణ్యమైన సేవలు, ఆహారం, వసతి సౌకర్యాలు కల్పించడం కంటే కష్టమైనది తన సంరక్షణలోగల బాలికలను కంటికి రెప్పలా కాపాడటం.

*విశ్వసనీయమైన వ్యక్తిత్వం ఉన్నవారికి విరాళాలు ఎవరైనా ఇస్తారు.*







అయితే అంతటితో తన బాధ్యత తీరిపోయిందని అనుకోలేదు. బాలికలకు చదువుతో పాటు లోకజ్ఞానం పెరగాలి, ప్రయోజనకర విద్య వారికి అందించాలి, ఈ బహుముఖ తీవ్రపోటీ ప్రపంచంలో వారు తమ కాళ్ళపై తాము నిలబడ గలగాలి. అదే తన లక్ష్యం. అందుకని వివిధ రంగాల ప్రముఖులను ఆహ్వానించాడు. వారిచేత వ్యక్తిత్వ వికాస ఉపన్యాసాలు ఇప్పించాడు. స్ఫూర్తిదాయకులను పిలిపించి ఎదురుగా నిలిపి "ఇదిగో చూడండి, ఇలా ఎదగండి" అని సోదాహరణంగా చూపాడు.

పున్నయ్యచౌదరిగారు కేవలం మాటలద్వారా కాకుండా చేతలద్వారా చెప్పేవాడు, ఆచరించి వ్యక్తపరచేవాడు. హాస్టల్ పిల్లలకు ఏ ఆహారం పెడుతున్నారో తాను, తన శ్రీమతి సుజాత అదే తినేవాళ్ళు. పిల్లలంతా రాత్రికి గదులకు వెళ్ళిన తరువాతనే తాము ఇంటికి వెళ్ళేవారు. ఎంతటి ఒత్తిడిలో ఉన్నా, ఏ కష్టంవచ్చినా చిరునవ్వును చెరగనివ్వని ఆయనకు భగవంతుడు చాలా పెద్ద పరీక్షలు పెట్టారు. చేతికి అందిరాబోతున్న కుమారుడు, నేడో-రేపో వైద్యపట్టా పుచ్చుకొని ఇంటికి వస్తాడనుకుంటున్న కుమారుడు డా॥ వినీత్ చౌదరి హఠాత్తుగా కన్నుమూశాడు. దాన్ని తట్టుకొని నిలబడగలిగాడు స్థిరచిత్తుడైన మన పున్నయ్యచౌదరి. కీ॥శే॥ వినీత్ తీపి జ్ఞాపకాలకు రూపం కల్పిస్తూ అతని పేరున హాస్టల్‌లో ఆడిటోరియం నిర్మించాడు. ప్రతి అడుగులో తన దివంగత కుమారుని తలచుకుంటూ కోలుకో గలుగుతున్నాడు.

భగవంతుడు ఆ మహావ్యక్తికి అంతిమ పరీక్షపెట్టాడు. ఆయనను తీవ్ర అస్వస్తతకు గురిచేశాడు. శిరస్సువంచని నాయకుడు శిరస్సువంచక తప్పలేదు. వారి అంతిమయాత్రలో హాస్టల్‌బాలికలు స్వచ్ఛందంగా కాలేజిని మానుకొని పాల్గొని శోకతప్త హృదయులైన పురప్రముఖులతో జతకలిశారు. ఆనాడే కాదు నేటికీ కమ్మజన సేవాసమితి పూర్వ విద్యార్థినులు ఆయన సేవలను గుర్తుచేసుకుంటూ కృతజ్ఞులై ఉంటారు.

ఆయన ఏ లోకంలో ఉన్నప్పటికీ, తాను కలలు కన్న వసతి గృహం నేడు పదేళ్ళు పూర్తిచేసుకొని నాలుగు జిల్లాలకు చెందిన 1300 మంది బాలికలకు వసతి కల్పిస్తున్నదని ఆనందించే వారిలో ఆయన ప్రథముడు. అంతటి **స్ఫూర్తిదాతకు పాలకవర్గం నివాళులు అర్పిస్తుంది.**





ప్రముఖ కవి, రచయిత, వక్త సుద్దాల అశోక్ తేజగారికి సన్మానం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండవ వెంకట్రామయ్యగారు



గవర్నర్ రమాదేవిగారితో కీ.శే. ఘంటా పున్నయ్యచౌదరి, శ్రీమతి



చలసాని వెంకటేశ్వరరావుగారు, దగ్గుబాటి పురందేశ్వరిగార్లతో



పెద్దలతో ఘంటాపున్నయ్యచౌదరి దంపతులు



ప్రసంగిస్తున్న ఘంటా పున్నయ్యచౌదరిగారు



మంత్రివర్యులు గౌ॥ కట్టా సుబ్రమణ్యానాయుడుగారికి సన్మానం



మంత్రివర్యులు గౌ॥ పి. వెంకటేశ్వరరావు, రేణుకాచౌదరిగారు

నీకు ఎంత తెలుసు అనేది లెక్కలోకి రాదు. నీవు ఎంత త్వరగా నేర్చుకోగలవు అనేది నేడు ముఖ్యం.



**వలివేటి నరసింహారావు** సమితికి వ్యవస్థాపక అధ్యక్షులు. జన్మస్థలం, యనమదల, జననం 1943, అనంత వరప్పాడులో స్థిరపడ్డారు. నాగపూర్ విశ్వవిద్యాలయం నుండి యం.ఏ. పట్టా పొందారు. జిన్నింగ్, పత్తి వ్యాపారం చేశారు. అనంతవరపుపాడు 5 వేల జనాభా గల ఊరు. అక్కడ 1975లో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయటానికి ఎకరం పొలం దానం చేశారు. అయిన ఖర్చు 50 వేలలో సగం ఆయనే భరించారు. ఇంకా అక్కడ శివాలయ నిర్మాణానికి, 2009లో కళ్యాణ మండపానికి, రామాలయానికి స్థలం దానం చేశారు. చాలా మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, చాలాసార్లు గుప్తదానాలు చేశారు. శుద్ధి చేసిన మంచినీటి పథకాన్ని మూడేళ్ళుగా సమర్థవంతంగా నడుపుతున్నారు. మరొకరు వేలెత్తి చూపకుండా జాగ్రత్తగా, ముందుచూపుతో, రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తున్న కార్యకర్త. ●

'విక్టరీ మధుసూదనరావు' అనగానే ప్రముఖ దర్శకుడని ఇట్టే అర్థమైపోతుంది. వెండితెర కేన్వాస్‌పై కోటి భావాలను చిత్రించిన కళాకారుడాయన. ఈయన బాల్యమంతా కష్టాలమయమే. వాటిని ఆయన మాటల్లోనే...

"నాకు ఏడేళ్ళు వచ్చాయో లేదో.... అమ్మ మమ్మల్ని విడిచివెళ్లిపోయింది. కుటుంబ పోషణ, నాచదువూ నన్ను తీవ్రంగా వేధించిన సవాళ్ళు. మా నాన్న చదువుకు డబ్బులివ్వలేనని నిస్సహాయత వ్యక్తం చేయడంతో ఆ సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాను.

బతకడానికి ఏదైనా పనిచేయాలన్న ఉద్దేశ్యంతో వీధుల్లో తిరిగాను. ఓచోట ఓ ముసలాయన సోడాలు అమ్ముతున్నాడు. నాకు పార్ట్‌టైమ్ పని చేయడానికి అవకాశమిచ్చాడు. ప్రతిరోజు స్కూలు నుంచి వచ్చిన తరువాత సోడాలు అమ్మేవాణ్ని. దసరా సెలవుల్లో అయిదు మైళ్ల దూరంలోని పక్క ఊళ్లో వేరుసెనగ కోతలకు వెళ్లాను. సంక్రాంతి సెలవుల్లో మా ఉళ్లోనే వరిచేలలో పరిగ ఏరి, ఎంతోకొంత సంపాదించేవాణ్ణి. వేసవి సెలవుల్లో యాభై సోడాలున్న బండిని తోసుకుంటూ, చుట్టు ప్రక్కల ఊళ్లన్నీ చుట్టివచ్చేవాణ్ని. అలా వచ్చిన డబ్బుల్ని భద్రంగా దాచుకుంటూ,అవసరాలకు ఉపయోగించుకునే వాళ్లం.



పునాదిపాడులో నుంచి స్కూల్ ఫైనల్ వరకు వారాలు చేసుకుంటూ చదువుకున్నాను. అప్పుడప్పుడే ప్రారంభమవుతున్న స్టూడెంట్స్ ఫెడరేషన్ సభ్యుడిగా చేరాను. నిషేధిత అతివాద సాహిత్యాన్ని రహస్యంగా చదివేవాణ్ని. విద్యార్థుల సమస్యలపై నాటకాలు వేసేవాళ్లం. అప్పట్నుంచే నాటకాలపై ఆసక్తి కలిగింది. అయితే ఇంటర్మీడియట్‌లో గుంటూరు హిందూ కాలేజిలో చేరాను.

స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నాను. ఇంటర్మీడియట్ ఎలాగో పూర్తయిందని పించాను.

ఇకచదువు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడటంతో ఓ మిత్రుడి వద్ద1500 రూపాయలు అప్పుగా తీసుకుని విజయవాడలో ఓ కిళ్లీకొట్టు పెట్టాను. పార్టీకోసం పూర్తి సమయం కేటాయించే ఓ కార్యకర్తకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో మా నాయకులు ఆ కిళ్లీకొట్టును అతనికి అప్పగించమని అడిగారు. కాదనలేకపోయాను. తరువాత ప్రజానాట్య మండలి వైపు ఆకర్షితుడినయ్యాను. మళ్లీ వేట..ఆ సమయంలో 'పల్లెటూరు' సినిమా షూటింగ్ కోసం విజయవాడకు వచ్చిన తాతినేని ప్రకాశరావుగారిని కలిశాను. ఇద్దరి మధ్యా మంచి పరిచయం ఏర్పడింది. నాక్కూడా సినిమాలపై ఆసక్తి ఏర్పడింది.

విజయవాడలో ఉండలేక మద్రాసు (చెన్నై) వెళ్ళాను. పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేశాను. కొంతకాలం ఓ స్కూల్లో డ్రిల్లు మాస్టారి అవతారం ఎత్తాను. ప్రకాశ్ స్టూడియోలో స్క్రిప్టు అసిస్టెంట్‌గా అవకాశం వచ్చింది.నెలకు వంద రూపాయల జీతం. నాలుగేళ్లు పనిచేశాను. ప్రకాశ్ స్టూడియోకు గడ్డు రోజులు ఎదురయ్యాయి. మళ్ళీ నాలుగురోడ్ల కూడలిలో నిలబడి ఉండగా తాతినేని ప్రకాశరావు గారి వద్ద 'జయం మనదే' చిత్రానికి సహాయకునిగా చేరే అవకాశం వచ్చింది. ఆ సినిమా పూర్తయ్యాక మళ్లీ నిరుద్యోగం. నిరాశ...1959 వరకూ ఆ నిరీక్షణ అలాగే కొనసాగింది.

నా స్వానుభవమే 'రక్త సంబంధం' చిత్రానికి స్ఫూర్తి. మా అమ్మ నా చిన్నతనంలోనే చనిపోవడంతో మా చెల్లిలి పెంపకం బాధ్యత నాపైనే పడింది. మా నాయనమ్మకు కళ్లు సరిగా కనిపించేవి కావు. అందుకని కోడికూతనే లేచి,ఇంటి ముందు కళ్లాపు చల్లి, ముగ్గులు వేసేవాణ్ని. పొయ్యి రాజేసి ఇంటి పనులన్నీ చేసేవాణ్ని. రెండేళ్ల చెల్లికి స్నానం చేయించి, తల దువ్వి జడ వేయడం, అన్నం తినిపించడం నా జీవితంలో మధురానుభూతులు,ఆ కలివిడితనమే మా ఇద్దరి మధ్య విడదీయరాని అనుబంధాన్ని పెంచింది. ఇదే బంధానికి కొంత నాటకీయతనూ మరికొన్ని వాస్తవ సంఘటనలను జోడించి **'రక్త సంబంధం'**గా చిత్రించాను.

**క్రమశిక్షణ, ప్రణాళికలే మనిషి పురోగమనానికి తోడ్పడతాయి. వాటిని ధిక్కరిస్తే మిగిలేది తిరోగమనమే** అనే భావనను నేను గట్టిగా విశ్వసిస్తాను. ఇప్పటి యువతకు ఇదే ఆదర్శం కావాలనేది నా కోరిక, అభ్యర్థన".

వాగ్దానం మేఘం వంటిది. నెరవేర్చటం వర్షం – అరేబియన్ సామెత

## తెలుగు పూలు



రచన :: నార్ల చిరంజీవి

మధుర మధురమైన మన భాష కంటెను
చక్కనైన భాష జగతిలేదు
తల్లిపాలకంటె తనయుల కేపాలు
బలము నీయ గలవు? తెలుగుబిడ్డ.

వెలుగు రాక ముందె వేగ నిదుర లెమ్ము
ప్రొద్దు బొడువ నిదుర బోవరాదు
సోమరితన మేల శుచి శుభ్రముల యందు
తెలిసి నడచుకొమ్ము తెలుగుబిడ్డ

క్రమము దప్పబోకు కాలకృత్యములను
ఆయువునకు పట్టు అవియె సుమ్ము
బద్ధకింతువేని పాడురోగములతో
దేహమెల్ల జెడును తెలుగుబిడ్డ

వెంట తోడులేక ఒంటిగా స్నానము
చెరువు కాల్వలందు చేయబోకు
నీకు దెలియనట్టి నీటి గుండము లుండు
కలుగు మోసమచట తెలుగుబిడ్డ

వేళ మీరకుండ వేవేగ సర్దుకొని
తోటి వారు వెంట తోడురాగ
పొమ్ము బడికి, గంట మ్రోగక మున్ముందె!
సలుపబోకు జాగు తెలుగుబిడ్డ.

పాఠములు చదువక బడిని మానితివేని
నిన్న చదువు తోడ నేటి చదువు
మన్ను కలిపి పోవు మరి కష్ట మాపైన
తిరిగి చదువ నీకు తెలుగుబిడ్డ

చదువు చున్న వేళ జాగ్రత్తగా నీవు
స్పష్టముగను నోట బలుక వలయు
గొణుగుకొన్న యెడల కొండంత తప్పులు
తెలియకొదుగు చుండు తెలుగుబిడ్డ

## జీవితంలో కొత్త కోణం - డా. ఉష జీవితం

పుట్టుకతోనే కళ్లు లేకపోవడం వేరు. జీవితంలో కొన్నేళ్ళపాటు తన కళ్లతో ఈ లోకంలోని అందాలను ఆనందించి, ఆస్వాదించి, అనుభవించిన తరువాత కళ్లను పోగొట్టుకోవడం బాధాకరం. డాక్టర్ ఉష జీవితంలోనూ ఇదే జరిగినా ధైర్యాన్ని కోల్పోకుండా మరింత పట్టుదలతో ముందడుగు వేసి చివరికి అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా 'Outstanding disabaled Employee' అవార్డును చేజిక్కించుకుంది.

మధురైకి చెందిన డా. ఉషానాగరాజన్ స్ఫూర్తిదాయక జీవితం ఇది. 1987లో ఎమ్.బి.బి.యస్. పూర్తి చేసి, స్పెషలైజేషన్ చదువడానికి అడుగులేద్దామను కుంటున్న సమయంలో ఆమె కాలిపైన పుండు ఉగ్రరూపం దాల్చడంతో ఎగబాకిన ఇన్ఫెక్షన్ ఆమె కళ్లను కూడ కబళించింది.'డయాబెటిక్ రెటినోపతి' కారణంగా ఉష జీవితం చీకటి మయమైంది. చిన్నతనం నుండి చదువులో మంచి ప్రతిభ కనబరచి, మెరిట్ స్కాలర్‌షిప్పులు పొందిన ఉష, తను కూడా పేదలకు సహాయం చేయాలని తాపత్రయపడేది. ఈ నేపథ్యంలో ఆమె చూపు పోవడంతో పరిస్థితిని జీర్ణించుకోలేని పరిణామాలు చోటు చేసుకున్నాయి. తను నేర్చుకున్న విద్యతోనే ఎలాగైనా ముందడుగువేసి ఇతరులకు చేయూతనిచ్చే వైకల్యాన్ని అధిగమించేందుకు 'బ్రెయిలీ' సహా పలు అంశాలపై రెండేళ్ళ పాటు తగిన శిక్షణ పొందింది. అనంతరం తన ప్రతిభతో మధురైలోని మధురై కంటి హాస్పిటల్ డాక్టరుగా చేరి రోగులకు సేవచేస్తున్నారు. అంతేగాక ఆ సంస్థకే చెందిన స్కూలు ఆఫ్ నర్సింగ్‌లో నర్సులకు వివిధ అంశాల్లో పాఠ్యాంశాలను బోధిస్తూ డా. ఉష వైద్య సేవలందిస్తున్నారు. ఆమెమధురైలోని రోటరీ టాకింగ్ లైబ్రరీకి సలహా మండలి సభ్యురాలిగా కూడ వున్నారు. ఆమెను పలు సంస్థలు సన్మానించాయి. భర్త నాగరాజన్ ఇచ్చిన శిక్షణతో ఇంట్లో పనులన్నీ కర్ర సహాయం లేకుండా చేసుకుంటుంది. స్వంతంగా వంట కూడా చేయగలదు. కళ్లుపోయినా తన జీవితంలో కొత్త వెలుగులతో నూతనాధ్యాయాన్ని నింపుకున్న ఉష జీవితం నిరుత్సాహంతో కృంగిపోతున్న కొందరికైనా స్ఫూర్తిదాయకం కావాలి.

*నీకు పరిష్కరించవలసిన సమస్య ఉందా? అది సమస్య కాదు, అవకాశం.*

## పరిమిత జల వనరులు - అధికావసరాలు

సకల జీవరాశికి ప్రాణాధారం నీరు. నీరు లేకుండా మనిషి మనుగడను, నాగరికతను ఊహించడం కష్టమే. భూమిని సస్యశ్యామలం జేసి, జీవచైతన్యాన్ని నింపి, విశ్వాంతరాళంలోని ఇతర గ్రహాల కంటే భూమిని విభిన్నంగానూ, విశిష్టంగానూ ఉంచుతున్నది నీరే. ఆర్థిక ప్రగతితో పాటు మానవుని నీటి అవసరాలు కూడా నానాటికి పెరిగిపోతున్నాయి. త్రాగటానికి, గృహావసరాలకు, భూమిని సాగుచేసి ఆహార పదార్థాలను ఉత్పత్తి చేసుకోవడానికి, విద్యుదుత్పాదనకు, పారిశ్రామికాభివృద్ధికి, పర్యావరణ పరిరక్షణకు, చేపల పెంపకానికి, నౌకాయానానికి, ఇంకనూ మరెన్నో ప్రయోజనాలకు మానవ జీవితంలో అడుగడునా నీటి అవసరం ఉంటూనే ఉంది.

వినియోగార్హమైన నీరు చాలినంతగా లభించనపుడు, దాహార్తితోను, క్షుధార్తితోను, జీవకోటి అలమటించిపోతుంది. పర్యావరణ సమతులనం దెబ్బతిని, భూతలమంతా దుర్గంధభూయిష్టమై, వ్యాధి వ్యాపక క్రిములు విజృంభిస్తాయి. ఆర్థికాభివృద్ధి, సాంఘికాభివృద్ధి నీటి అవసరాలను మరింతగా పెంచాయి. మన అవసరాలతో పాటు జల వనరుల అభివృద్ధి పెరగకపోవటం వల్ల, నీటి కొరత ఎదురవుతోంది. భూమి మీద గల మొత్తం నీటి పరిమాణం 140 కోట్ల ఘనకిలోమీటర్లని అంచనా. ఆ నీటినంతటిని భూతలంపై సమానంగా పరచినప్పుడు, దాని మందం 3 వేల మీటర్లుంటుంది. ఇది నిజంగా ఎంతో భారీ పరిమాణమే. కాని దానిలో 136.2 కోట్ల ఘ.కి. మీటర్లు (97.3 శాతం) ఉప్పు నీటి రూపంలో సముద్రంలోనే ఉండిపోయి, నేరుగా ఉపయోగపడటం లేదు. మిగిలిన 3.8 కోట్ల ఘ.కి. మీటర్లలో 2.9 కోట్ల ఘ.కి. మీటర్లు ధృవ ప్రాంతాలలో మంచు రూపంలో గడ్డకట్టుకొని ఉండటం వల్ల, నిరుపయోగంగా వుంది. మిగిలిన దానిలో 0.85 కోట్ల ఘన కిలోమీటర్లు భూగర్భంలోనూ, 0.05 కోట్ల ఘన కిలోమీటర్లు నదులు, సరస్సులు, చిత్తడి నేలల్లోనూ ఉంది. మొత్తం మీద ఉపయోగానికి అందుబాటులో నున్న నీరు కేవలం 43 లక్షల ఘన కిలోమీటర్లు మాత్రమే. ఇది మొత్తం భూమి మీదనున్న నీటి పరిమాణంలో 0.3 శాతం మాత్రమే. ఈ అత్యల్ప జల పరిమాణం మీదనే భూమండలంలో ఉన్న సకల జీవరాశుల మనుగడ ఆధారపడి ఉంటుంది.

ఇక మన దేశంలోని జల వనరులను గురించి సమీక్షిద్దాం. మొత్తం దేశంలోని సగటు వార్షిక వర్షపాతం 4000 బిలియన్ ఘనమీటర్లు (1 బిలియన్ = 100 కోట్లు). దానిలో నదులలోను వాగులోను పారే నీరు 1869 బి-ఘనమీటర్లు. డ్యాములు, ఆనకట్టలు కట్టడానికి అనుకూలమైన స్థలం లభించకపోవడం, మరియు ఇతర సాంకేతిక, పర్యావరణ ప్రతిబంధకాల వల్ల మనం జలాశయాల్లో నిల్వ చేసుకొని ఉపయోగించుకోగలిగే నీటి పరిమాణం కేవలం 690 బిలియన్ ఘన మీటర్లు మాత్రమే. అదనంగా వార్షికంగా 450 బి.ఘ. మీటర్ల భూగర్భ జలం మన ఉపయోగానికి లభిస్తుంది. అంటే, మన దేశంలో లభ్యమయ్యే భూతల, భూగర్భ జలాల మొత్తం పరిమాణంలో ఉపయోగపడేది 1140 బి.ఘ. మీటర్లు మాత్రమే. దీనిలో 2000వ సంవత్సరం నాటికి 500 బి.ఘ. మీటర్లు భూతల జలం మరియు 250 బి.ఘ. మీటర్లు భూగర్భ జలం మొత్తం 750 బి.ఘ. మీటర్ల నీరు వివిధావసరాలకు వినియోగించబడింది. **2050 నాటికి దేశ జనాభా 164 కోట్లకు చేరి వివిధ కారణాల వల్ల, అక్కడ ఆగిపోతుందని అభిజ్ఞుల అంచనా.** మనకున్న జలవనరులన్నిటిని పూర్తిగా ఉపయోగించుకున్నప్పుడే భవిష్యత్తులో పెరిగే జనాభా అవసరాలు అతి కష్టం మీద తీరతాయి.

మనం అనాదిగా వర్షపాతాన్ని ప్రకృతి ప్రసాదిస్తున్న ఉచిత కానుకగా భావిస్తున్నాము. అందువల్ల విచక్షణారహితంగా నీటిని దుర్వినియోగపరచటం జరుగుతోంది. మన దేశంలో వర్షపాతం అస్థిరమైన, అవిశ్వసనీయమైన రుతుపవనాలపై ఆధారపడి ఉండటం వల్ల దాని తీవ్రత, కాలావధి తరచుగా మారుతూ ఉంటోంది. అదీగాక, అన్ని ప్రాంతాలలోను, అన్ని సంవత్సరాలలోను వర్షపాతం సమానంగా విస్తరించి ఉండనందువల్ల **దేశంలో అతివృష్టి లేకుంటే అనావృష్టి అతి సహజమై పోయాయి.** అందువల్ల మనదేశపు మొత్తం భౌగోళిక విస్తీర్ణం 328 మిలియన్ హెక్టార్లలో 40 మిలియన్ హెక్టార్ల (1/8 వంతు) ప్రాంతం వరదల బారిన పడుతుండగా మరో 108 మి.హె. (1/3వ వంతు) ప్రాంతం తరచుగా అనావృష్టికి గురవుతోంది. దీనికి తోడు పారిశ్రామిక కాలుష్యాలను శుద్ధిచేయకుండా విడుదల చేయడం వల్ల అధిక పరిమాణంలో భూతల జలాలు, భూగర్భజలాలు కలుషితమై పోతున్నాయి. దీనివల్ల ఉపయోగానికి పనికివచ్చే నీరు మరింతగా తగ్గిపోతుంది.

***కాబట్టి, మొత్తం వార్షిక వర్షపాతంలో 67 శాతం వరకు కేవలం 3 లేక 4 నెలల్లోనే సంభవించడం వల్ల ఆ వాన నీటిని భూతల జలాశయాలలోను, భూగర్భ జలాశయాలలోను సాధ్యమైనంత ఎక్కువ పరిమాణంలో నిల్వ చేసుకొని, దానిని కాలుష్యరహితంగా పరిరక్షించుకొని, ఎంతో పొదుపుగా వాడుకోవాలి. లేనట్లయితే భావి కాలంలో తీవ్రమైన నీటి కొరత ఏర్పడి, దేశ ప్రగతి కుంటుబడటమే గాక, అసలు మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది.***

భూగర్భ జలాశయం ఒక బ్యాంకు లాంటిది. బ్యాంకులో మనమెంత డబ్బును జమచేస్తే, అంతే తీసుకోగలం. అసలు డబ్బును జమచేయనప్పుడు తీసుకోలేం గదా! అలాగే, ఎంత పరిమాణంలో వాననీరు భూగర్భ జలాశయంలోనికి చేరుతుందో, అంతనీటిని మాత్రమే మనం వెలికితోడి వాడుకోగలుగుతాం. అంతకు మించి ఎట్టి పరిస్థితులలోనూ తోడి వేయగూడదు. భూగర్భంలోనికి చేరే నీటికి భూగర్భం నుండి వెలికి తీసే నీటికి మధ్య సమతులనం పాటించాలన్నది భూగర్భ జల వినియోగంలో ప్రాథమిక సూత్రం. అందుచేత, ఈ సూత్రాన్ని పాటించి, వాననీటిని భూమిలోనికి యింకేటట్లు చేసి, భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు అవిరళ కృషి జరగాలి.

---

***ఇప్పుడు ఈ పవిత్ర జలాలు నన్ను వేగవంతం చేయాలి. ఎంత పరిశుభ్రంగా, నిర్మలంగా ఉన్నది ఈ నీరు! ఋగ్వేదం. 7.49.***

***ఓ జలరాశీ, ఆనందానికి మూలమా, నిన్ను ప్రార్థిస్తున్నాము. నీవు పిల్లలను ప్రేమగా పోషించే తల్లివంటిదానివి. మా దాహం తీర్చు. నీవే మా ప్రాణం. మా పాపాలను ప్రక్షాళన చేయి. ఋగ్వేదం. 10.9***

---




చెరుకూరి వీరయ్య

*జననం:* కృష్ణాజిల్లా, జమ్మిగొలివేపల్లి

సివిల్ ఇంజనీర్. వివిధ హోదాలలో భారీ పథకాల వివిధ దశలలో ఉద్యోగం. 1989, పదవీ విరమణ, ఉత్తమ ఇంజనీర్ పురస్కారం. తరువాత సాగునీటిపై శిక్షణా పాఠాల కూర్పు. 1996-97లో రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల నిపుణుడు, పురస్కార గ్రహీత. సాహితీవేత్త. చెరుకూరి - 'చిరుమెరుపులు', 'విరిజల్లులు', 'భావనాస్రవంతి' పద్యాలు; కాటన్ దొర, కృష్ణా జలాలు గోదావరీ జలాలు గ్రంథాలు, ఈనాడు మున్నగు ప్రముఖ పత్రికలలో ఎన్నో సాంకేతిక వ్యాసాలు రాస్తున్నారు.

ప్లాటు నెం. 211, 'లాలిత్య ' ఎమరాల్డ్, అమృతాహిల్స్, పంజాగుట్ట, హైదరాబాద్ -82, ఫోను 040- 23402237


---

## సుధాదేవి, ఐ.ఎ.ఎస్

ఈమె తమిళనాడు, తిరుచెంగోడు తాలూకాలోని కొంగువెళ్ళలార్ కులస్థురాలు. తల్లిదండ్రులకు వ్యవసాయమే జీవనం. చిన్న వ్యవసాయ కుటుంబం. పెద్ద చదువులు చదివించలేక, చిన్న వయస్సులోనే వివాహం చేశారు. అప్పటికి 12వ తరగతి పాసయ్యింది. పెళ్లయిన నాలుగేళ్ళకు వివాహం విఫలమైంది.

తల్లిదండ్రులకు నచ్చచెప్పి మరల చదువు ప్రారంభించింది. కోయంబత్తూరులో డిగ్రీ చేసింది. సివిల్స్ రాయాలని పట్టుదలతో కోచింగ్ తీసుకుంది. మొదటి ప్రయత్నంలోనే పాసయ్యింది. సామాన్య కుటుంబం నుండి వచ్చిన ఆడపిల్లలెవరైనా వివాహ బంధం తెగిపోతే మన బతుకింతేలే అనే నిరాశ నిస్పృహలకులోనై జీవితం సాగిస్తారు. కాని సుధ మనోధైర్యం కోల్పోక, పట్టుదలతో తన లక్ష్యం నెరవేర్చుకున్నది. ఆ కమ్యూనిటీ నుంచి సివిల్స్ పాసయిన మొదటి వ్యక్తి సుధాదేవి కావడం విశేషం.

*నీ జీవితాన్ని పాడుచేసే నాలుగు మాటలు.* ***నేను, నాది, - నీవు, నీది.*** *కనుక వాటిని మరచిపో.*

# భద్రతకు సూత్రాలు

**తోకల రామమోహన్‌రావు,** యం.ఎస్సీ. టెక్.
డీన్, శ్రీ చైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్, తిరుపతి









- ఎందుకు వసతి గృహం (హాస్టల్)లో ఉన్నామో గుర్తుంచుకోవాలి. The purpose of stay in hostel should always be remembered.
- Day Scholars తో పోలిస్తే హాస్టలులో ఉండటం వల్ల రోజుకు కనీసం 3 గం. సమయం ఎక్కువ అందుబాటులో ఉంటుంది. ఆ సమయాన్ని సద్వినియోగపరుచుకుంటే నీ విజయానికి దోహద పడుతుంది.
- ముచ్చట్లు, కబుర్లు, సినిమాలు, కథలు, ప్రేమ కబుర్లు తోటి వారితో మాట్లాడవద్దు. ఒకసారి ఇటువంటి సంభాషణలకు, కబుర్లకు బానిసలయితే ఆ వ్యసనం నుంచి బయట పడటం కష్టం. స్నేహితురాళ్లతో సంభాషణలు విద్యాపరంగా, విషయ పరిజ్ఞానం పెంచేవిగా ఉండాలి.
- ఇంటర్నెట్ సౌకర్యాలను విద్యా అవసరాల అభివృద్ధికి మాత్రమే వాడండి.
- విలువైన ఆభరణాలు ధరించవద్దు. దగ్గర ఉంచుకోవద్దు.
- ఆభరణాలు, దుస్తులు అరువు తీసుకో వద్దు. నీవి ఇతరులకు ఇవ్వవద్దు.
- వారానికి ఒకసారైనా, మీకు మార్కులు తక్కువ వచ్చినా సరే, మీ విద్యాపరమైన ప్రగతి ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు, సంరక్షకులతో పంచుకోండి.
- తల్లిదండ్రులకు తెలియకుండా విహారయాత్రలకు స్నేహితులతో కలసి (అవి ఎంత చిన్నవైనా) వెళ్ళవద్దు.
- ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్త అవసరం. ప్రతిరోజూ కనీసం అరగంట వ్యాయామానికి అంటే నడక / ఆట/ జాగింగ్ / యోగ / ధ్యానం/ ప్రాణాయామాలలో మీకు నచ్చినది ఏదో ఒక దానికి కేటాయించాలి. బయట దొరికే చిరుతిళ్లను తగ్గించండి.
- మీ వ్యక్తిగత పరిశుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత అంత ముఖ్యమని ఎప్పుడూ గుర్తుంచుకోండి.
- వ్యక్తిగత విషయాలు, ఐడెంటిటీ, కుటుంబ ఆర్థిక స్థితిగతులను అపరిచితులకు చెప్పవద్దు. పరిచయం లేని వ్యక్తులను నమ్మి వాళ్లు చెప్పిన వాటిని ఆచరించకుండా అందులో నిజానిజాలను విశ్లేషించుకోండి. హాస్టల్ నుంచి బయటకు వెళ్ళినపుడు వాళ్ళు అడిగినా అమ్మాయి/ అబ్బాయిలతో వాహనాలపై ఎక్కవద్దు. వీలయినంతవరకు ప్రజా రవాణా సౌకర్యాలనే వాడండి.
- అవకాశం దొరికినప్పుడలా విజయాలను సాధించిన మహిళల గాథలు చదవండి. ఉదా:- ఈ సంవత్సరం సి.ఏ. టాపర్ ప్రేమ జయకుమార్, మేరీకామ్ వంటివారు.

పుట్టుకతోనే ఎవరూ విజేతలుగా పుట్టరు, పనులను అలవాటుగా చేసేవారు విజేతలు అవుతారు.

# మన మహిళా మణిదీపాలు

పెద్దగా చదువుకున్నా, చదువుకోకపోయినా, ఆస్తిపాస్తులు ఉన్నా లేకపోయినా సమాజ క్షేమం కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తమ సర్వశక్తులూ ఒడ్డిన త్యాగధనులు మనవారిలో ఎందరో లేకపోలేదు. వారిలో మహిళామూర్తులూ ఉండడం విశేషం. సాహిత్యం వచ్చాక సాహిత్యంలో దృశ్య శ్రవ్య కళలలో రాణించిన వారిలో తెలుగుదేశానికి చెందినవారు పెక్కుర్రు కలరు. దీని వెనుక వారి లక్ష్యం, పట్టుదల, నిబద్ధత, ముప్పిరిగొని ఉన్నాయనడంలో సందేహం లేదు. ఈ అంశాలు నేటి యువతలో పాదుకొల్పవలసి ఉంది, ప్రేరణ కలిగించవలసి ఉంది. గత శతాబ్దకాలంలో కొందరి సంగ్రహ పరిచయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండాలనే ఉద్దేశంతో అందిస్తున్నాం.

### శ్రీమతి ఆవుల జయప్రదాంబ (1925-2004)

వీరు కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, బొమ్మలూరులో 1925 ప్రాంతంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. వీరు గుడివాడ హైస్కూల్లో మొట్టమొదటి విద్యార్థినిగా పరిగణింపబడ్డారు. తరువాత గుంటూరు కాన్వెంట్ హైస్కూల్లో చదివారు. హిందీ ప్రవీణ పరీక్ష వరకు అభ్యసించి అందులో ప్రథమ శ్రేణిలో కృతార్థులయ్యారు. జస్టిస్ ఆవుల సాంబశివరావు సతీమణిగా మూల్పూరు వాస్తవ్యురాలయ్యారు. గుంటూరులో 1955లో అంధుల, వికలాంగుల పాఠశాల నివాస శిక్షణా సంస్థ స్థాపించారు. గుంటూరులో సుధా మెమోరియల్ శిశువిహార్‌ను స్థాపించి పోషించడం జరిగింది. ఇప్పుడా సంస్థ గుంటూరు లైన్సు క్లబ్ వారి సహకారంతో పెద్ద భవనాలతో విలువైన సేవలను అందిస్తుంది. హైదరాబాదు వచ్చిన పిమ్మట బర్కత్‌పురాలోని ఆంధ్ర యువతీ మండలికి, సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ అందులోనే వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణంలో చురుకైన ఒక కార్యకర్తగా కృషిచేసి, ఆ హాస్టల్‌ను కొంతకాలం నడిపే బాధ్యతను కూడా వహించారు. ఆంధ్ర మహిళా సభయందు వికలాంగుల విభాగానికి 1983 నుండి 1994 వరకు అధ్యక్షురాలుగా ఉన్నారు. అన్నపూర్ణ మానవ సంక్షేమ సమితి స్థాపించి హైదరాబాదు, విశాఖ నగరాలలో కార్యక్రమాలు నిర్వహించారు. వృద్ధులకు డేకేర్ సెంటర్‌ను మీర్ మహమ్మద్ పహాడ్‌లో నిర్వహించారు. అక్కడి బాలబాలికలకు ఒక పాఠశాలను ఏర్పాటు చేసి ఉచిత విద్యాబోధన చేశారు. ప్రాణిక్ హీలింగు కోచింగు అడుసుమిల్లి శారదాంబ ఆధ్వర్యంలో ప్రతి శని, ఆదివారాలలో ఇవ్వబడుచున్నది. విశాఖపట్నంలో ప్రగతి ఛారిటబుల్ ట్రస్ట్ అనే సంస్థను స్థాపించి మేనేజింగ్ ట్రస్టీగా 1983 నుంచి 1986 వరకు కృషిచేశారు. అందులో 80 మంది ఉద్యోగినులకు సరిపడే హాస్టలు భోజన, నివాస వసతులతో నడుస్తున్నది. మహిళలకు, వికలాంగులకు ఉపాధి కార్యక్రమాలు జరుగుచున్నాయి. ఇలా ఎన్నో కార్యక్రమాలు ఒక్క చేతిమీదుగా చేసిన ధన్యాత్మురాలు.

### శ్రీమతి కల్లూరు తులశమ్మ (1910-2000)

25-12-1910న కొడాలి కృష్ణయ్య, సీతమ్మ దంపతులకు పెదరావూరులో జన్మించారు. ఆనాటి పల్లెటూరి ఆడపిల్లల వలెనే ఈమె చదువు ఎలిమెంటరీ పాఠశాల దాటలేదు. 14 సం.ల వయసులోనే వివాహమైంది. గాంధేయ మహిళగా మారి సంసారాన్ని త్యజించింది. గాంధీజీ 'ఆత్మకథ' చదివి తన జీవితసాధనకు మార్గదర్శకంగా నిరాడంబరత, స్వావలంబన, అపరిగ్రహం, బ్రహ్మచర్యం - అనే నాలుగు ముఖ్యాంశాలను స్వీకరించారు. స్వావలంబనకై చరఖాను చేతపట్టారు. బ్రహ్మచర్యానికై గృహస్థ జీవితాన్ని త్యాగం చేసారు. అపరిగ్రహ ప్రతిష్ఠకై తన తల్లి తనకిచ్చిన నగలు, ఖరీదైన వస్తువులు అన్నిటినీ ఇచ్చివేసి బయటకు వచ్చేశారు. తన మెడలో నున్న అరకాసు బంగారాన్ని అమ్మగా వచ్చిన దానిలో రూ. 4/-లతో రాట్నం, రూ. 3/-లతో ఖద్దరు చీర, రూ. 2/-లతో నూకలు కొనుక్కొని స్వావలంబన సిద్ధాంతాన్ని అనుసరించి జీవితం గడుపసాగారు. మోపర్రులోనే ఉంటూ ప్రతిదినమూ రాట్నం వడకగా వచ్చిన 3 అణాల మజూరీతో నూకల అన్నం, చింతకాయ పచ్చడి, దమ్మిడీ మజ్జిగతో భోజనం చేస్తూ చరఖాసంఘంలో జీవితం గడుపసాగారు. జంతువులను చంపి వాటి చర్మాలతో చెప్పులు తయారుచేస్తారని నమ్మి చెప్పులు



ధరించటం మానేశారు. సాటి మానవుని కష్టపెట్టి లాగించుకునే రిక్షాలు ఎక్కటం మానివేశారు. 1946లో గాంధీజీ ఆఖరుసారిగా చెన్నై వచ్చినపుడు తులశమ్మగారు వెళ్ళి దూరం నుండి గాంధీజీని దర్శించారు. తులశమ్మ మహాత్మునికి నమస్కరించి, తనదగ్గర ఉన్న ఓంకారపు బంగారుబిళ్ళ, వెండి పళ్ళెం (పూజ కొరకు), స్త్రీ తనానికి చిహ్నమైన 15 తులాల వెండి మెట్టెలు సమర్పించారు. ఖద్దరు అమ్మకం వల్ల మిగిలిన 3 వేల రూపాయలతో స్వగ్రామంలో ఒక ఇంటిని కొని దానిని గుంటూరు జిల్లా ఖాదీసంస్థ వారికి సమర్పించారు.



**శ్రీమతి కొడాలి అన్నపూర్ణమ్మ**

తెనాలి తాలూకా వేమవరం గ్రామంలో 1908లో జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 15 మాసాల జైలు శిక్ష అనుభవించారు. జైల్లో జెండా ఎగరేసిన సాహసి. ఆ రోజుల్లో భర్త చనిపోయాక పెద్దకర్మ రోజున స్త్రీని విధవరాలిని చేసే క్రూరమైన ఆచారం ఉండేది. మూఢాచారమని భావించి దానిని వ్యతిరేకించారు. భర్త చనిపోయిన మహిళను మానసిక హింసకు గురిచేసే దురాచారాన్ని రూపుమాపాలని ప్రయత్నించారు. బంధువుల ఇళ్లలోనూ ఇలాంటి సందర్భాల్లో వెళ్లి అందరికీ నచ్చజెప్పేది. దగ్గరుండి స్నానం చేయించి తెల్లచీర బదులు రంగుచీరె కట్టించేది. 1980లో విజయవాడ నాస్తిక కేంద్రంలో ప్రపంచ నాస్తిక మహాసభలు జరిగాయి. గోరా ఆశయాలను యువతరానికి అందించాలనే సంకల్పంతో 1994లో ఇంకొల్లులో 'గోరా నాస్తిక మిత్రమండలి' స్థాపించారు. గోరా జయంతి సందర్భంగా 2007లో నాస్తికోద్యమ ప్రచారానికి కేంద్రప్రభుత్వం ఇస్తున్న పింఛను మొత్తం నుంచి రూ. లక్ష అందజేశారు. జీవితాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కంటే, సామాజికశ్రేయస్సుకు వినియోగించారు. ఇసుక రేణువులో ప్రపంచాన్ని చూడటం నేర్చుకోవాలి అంటారు గాంధీజీ. బాల్యం నుంచి ఆత్మవిశ్వాసంతో అడుగువేశారు. దేశంకోసం ఏదో ఒకటి చేయాలన్న పట్టుదల, తపన, కుటుంబసభ్యుల సహకారం ఆమెను ముందుకు నడిపాయి.

**శ్రీమతి కొత్త లక్ష్మీ రఘురామయ్య (    - 2003)**

ఈమె తండ్రి దుగ్గిరాల వాస్తవ్యులు, గుంటూరు కమ్మ హాస్టల్ భవన నిర్మాత జంపాల వెంకటేశం. ఉన్నత విద్యావంతులు. కొత్త రఘురామయ్య (సంగం జాగర్లమూడి) గారితో వివాహమయ్యాక లక్ష్మీ రఘురామయ్యగా పేరు స్థిరపడింది. వీరి నివాసం మద్రాస్ అయింది. ఆ కారణం చేత ఆంధ్ర మహిళా సభ, చెన్నై కేంద్రానికి వ్యవస్థాపక సభ్యురాలుగా ఆ సంస్థ ప్రగతికి కృషిచేశారు. కొంతకాలం 'ఆంధ్రమహిళ' పత్రికకు సంపాదకురాలుగా ఉన్నారు. 1952లో రఘురామయ్యగారు పార్లమెంటుకు ఎన్నికైన సందర్భంలో వీరి మకాం ఢిల్లీ మారింది. వీరు ఢిల్లీలో అత్యంత ప్రతిష్ఠాకరమైన ఆంధ్ర సంఘానికి అధ్యక్షురాలిగా ఎన్నికైనారు. ఆనాటి నుండి ఓ పదేళ్ళు తప్ప (1961-70) ఆ పదవిలో కొనసాగగా కొత్త ఢిల్లీలోని ఉమన్స్‌లీగ్‌కు కూడా వారు అధ్యక్షురాలు. ఢిల్లీ ఆంధ్ర సంఘానికి కోట్లాది రూ. విలువగల భవన నిర్మాణంలో వీరి కృషి చాలా ఎక్కువ. అఖిల భారత మహిళా సంఘ భవన నిర్మాణానికి రెండు కోట్లు రూ. సమీకరించారు. ఈ సంస్థకు వీరు రెండు సార్లు ప్రధాన కార్యదర్శిగా, మూడుసార్లు అధ్యక్షురాలిగా ఎన్నికై కృషిచేశారు. ఇవిగాక వారు పుట్టి పెరిగిన దుగ్గిరాలలో కంభంపాటి నారాయణ జూనియర్ కాలేజి కమిటీకి, కొత్త రఘురామయ్య డిగ్రీ కాలేజి కమిటీకి అధ్యక్షురాలిగా ఆ సంస్థల ప్రగతికి సేవలందించారు. మొత్తం మీద 1962 నుండి దాదాపు 40 సార్లు 50 దేశాలకు పైగా వివిధ విషయాలపై సందర్శించారు. గుజరాత్ ప్రభుత్వంచే స్త్రీ శక్తి అవార్డు; కళాపీఠం అవార్డు (వైవిసి); సరోజినీ నాయుడు అవార్డు (యునైటెడ్ ఉమెన్స్ ఫోరం) భారత స్త్రీరత్న అవార్డు; లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు (గాడ్ ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్- 1998)లు అందుకున్నారు. కొంతకాలం దక్షిణ భారత ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలుగా వ్యవహరించారు. బహుముఖ ప్రజ్ఞావంతురాలు. ఈ ఆరు దశాబ్దాల మహిళా సేవకురాలిని ఆంధ్ర విశ్వ కళాపరిషత్, పద్మావతి యూనివర్సిటీలు 'గౌరవ డాక్టరేట్'తో సత్కరించాయి.

**శ్రీమతి తుమ్మల దుర్గాంబ (1907 - 1975)**

ఈమె ఒక అసాధారణ మహిళ. తెనాలి తాలూకా తురిమెళ్లలో 1907లో జన్మించారు. బాల్యం నుంచీ గాంధీజీ బాటలో నడిచారు. 1930, 1932, 1942 సం॥లో జైలు శిక్ష అనుభవించారు. గాంధీజీ చేత 1932లో వినయాశ్రమం ప్రారంభింపజేయగలిగారు. తన కాలిమెట్టెలు, కడియాలు అమ్మి గాంధీజీకి వెండి తాపీ

ఆలోచన సులభం, ఆచరణ కష్టం. ఆలోచనలను ఆచరణలుగా మార్చటమే ప్రపంచంలో అతి కష్టమైన అంశం.

చేయించి బహూకరించారు. తన వద్ద గల 200 నవరసుల బంగారం అమ్మి వినయాశ్రమ అభివృద్ధికి ఖర్చుచేశారు. 1942లో కావూరులో తిలక్ జాతీయ పాఠశాల ప్రారంభించారు. తమ ఆస్తి 17 ఎకరాల మాగాణి, 5 ఎకరాల మెట్ట భూమి వినయాశ్రమానికి దఖలు పరిచారు. మనసావాచా గాంధేయవాది. ఆదర్శ మహిళ.

**డా॥ నన్నపనేని మంగాదేవి**

వీరు 1937లో తెనాలి ఐతానగరంలో జన్మించారు. కళాశాల విద్యవరకు తెనాలిలోనే అభ్యసించారు. ఆంధ్ర యూనివర్సిటీలో బి.ఏ. ఆనర్స్ చేసారు. 1965లో గుంటూరులో శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్ స్థాపించారు. బెత్తాలు, గుంజిళ్ళు, బెంచీ ఎక్కించే పనిలేని విద్యా పద్ధతికి తొలుత ప్రోత్సాహం లభించలేదు. కానీ కాలక్రమంలో ఈ పద్ధతి తల్లిదండ్రులను ఆకట్టుకుంది. ఫలితంగా ఒక్క విద్యార్థితో ప్రారంభమైన పాఠశాల నేడు రెండువేల మంది విద్యార్థులతో, 200 మంది సిబ్బందితో ఆదర్శవంతమైన విద్యాసంస్థగా రూపుదాల్చింది. నిరంతర విద్యాధ్యయనులై ఎం.ఎడ్., పి.హెచ్‌డి. తీసుకున్నారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీ నుండి రష్యన్ భాషలో డిప్లొమా తీసుకున్నారు. ప్రవృత్తిగా సాహితీరంగాన్ని చేపట్టి పలు జీవిత చరిత్రలు, నృత్య నాటికలు, గేయాలు రాసారు. వీరేశలింగంపై 'వేగుచుక్క' పేరుతో రాసిన జీవిత కథకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. వీరు రూపొందించిన 'బాల నిఘంటువు' వీరి భాషా పరిజ్ఞానానికి నిదర్శనం. బోన్సాయ్ (మరగుజ్జు) మొక్కలపై ప్రచురించిన గ్రంథం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. మదర్ థెరిసా చేసే అనాధ సేవలకు స్పందించి, గుంటూరు సమీపంలో చౌడవరంలో 'చేతన' సంస్థ ఏర్పరచింది. ఇది నేడు గ్రామీణ పాఠశాలగా, అనాధ శరణాలయంగా, వృద్ధుల కుటీరంగా, వికలాంగుల సంక్షేమ కేంద్రంగా రూపుదిద్దుకుంది.



**శ్రీమతి బోయపాటి సుభద్రాదేవి (1943- 2002)**

కృష్ణాజిల్లా దొండపాడులో జననం. డాక్టరు మోటూరి సత్యనారాయణ మేనకోడలు సుభద్రాదేవి. వీరు హిందీ అధ్యాపకురాలు. మృదుమధుర కంఠ సంపన్నురాలు. తేనెలొలుకు వాణీ వారసురాలు. లయబద్ధమైన పద్య పఠనాభిలాషురాలు. ఉత్తరాది పద్ధతిలో రామాయణం పఠించే నైపుణ్యురాలు. గద్యబోధనా ఘటికురాలు. కస్తూరిబా గాంధీ స్మారక ట్రస్టు ముఖ్య నిర్వాహకురాలు. తెనాలి పట్టణ మహిళామండలికి దశాబ్దంపాటు కార్యదర్శిగా సేవకురాలు. దాతల నుండి విరాళాలు సేకరించి మహిళామండలి సొంతభవనం నిర్మించడానికి తోడ్పడ్డ ఔదార్యురాలు. ఇంతటి ఉత్తమురాలు జీవితభాగస్వామిగా పొందిన బోయపాటి నాగేశ్వరరావు కర్మయోగులు. చెదిరిపోని దరహాసం చిరునామాగా, హిందీ ప్రచారమే శ్వాసగా జీవనయానం చేయడం, సాటి వారికి, పేద విద్యార్థులకు అధికంగా సాయం చేయడం. త్రికరణ శుద్ధిగా గాంధేయమార్గాన్ని అనుసరించడం వీరి లక్ష్యం.

**శ్రీమతి వడ్లపట్ల రమాదేవి (1934 -2013 )**

పశ్చిమగోదావరి జిల్లా కొవ్వలి గ్రామంలో జన్మించారు. ఏలూరు, హైదరాబాదులలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. 1964లో కేంద్ర ప్రభుత్వ న్యాయశాఖలో అధికారిగా చేరారు. ఆ పదవి నుంచి శాసనసభ వ్యవహారాల శాఖ స్పెషల్ సెక్రటరీ స్థాయికి ఎదిగారు. లాంగ్వేజ్ కమీషన్ ఆఫీసరుగా సమర్థవంతంగా సేవలందించారు. 1990లో ఒక మాసం రోజులు భారత ఎన్నికల కమీషనరుగా పనిచేశారు. పదవీ విరమణ చేశాక హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు కొంతకాలం గవర్నరుగా పనిచేశారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చో నిరూపించారు, యువతకు మార్గదర్శకులయ్యారు.

**శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి (1932 - 2006)**

గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. చెన్నై దక్షిణ బారత హిందీ ప్రచార సభలో హిందీ విద్యాభ్యాసం, నాగపూరు యూనివర్సిటీ నుంచి ఎం.ఏ. డిగ్రీ తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో పలు హోదాలలో పనిచేసి జవహరు బాలభవన్ డైరెక్టరుగా పదవీ విరమణ చేశారు. కేంద్ర సాహిత్య అకాడమి సభ్యురాలిగా పనిచేశారు. శతాధికంగా కథలు రాశారు. వీరి నవల 'ఆమె కథ' సినిమాగా వచ్చింది. వీరిని శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. మద్రాసు, తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం వీరికి లభించాయి. ఈమె రాసిన 'సమత' నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. హేతుబద్ధ రచనల ద్వారా ఒక సంచలనానికి మారుపేరు అయ్యారు.

**శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి (1914 - 2008)**

కృష్ణా జిల్లా, నందిగామ తాలూకాలో వీరులపాడులో జన్మించారు. వీరికి చేబ్రోలులో సూర్యదేవర నాగయ్యతో వివాహం జరిగింది. తదుపరి వీరు చేబ్రోలు జాతీయోద్యమ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు. 1932లో చేబ్రోలులో జరిపిన ఊరేగింపు సందర్భంలో వీరిని అరెస్టుచేసి 12 నెలలు జైలుశిక్ష, 50రు.లు జరిమానా విధించారు. జరిమానా చెల్లించటం ఇష్టంలేని వీరు మరో రెండు నెలలు జైలుశిక్ష అనుభవించారు. వీరు మద్రాసు, వెల్లూరు జైళ్ళలో గడిపినపుడు హిందీ భాషను నేర్చుకున్నారు. 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1942 ఆగష్టు పోరాటంలో కూడా పాల్గొన్నారు. కొంతకాలం అజ్ఞాత జీవితం గడిపి చివరకు హైదరాబాదులో స్థిరపడి 1949 నుంచి తెలుగుదేశం వారపత్రికను ఆంధ్ర తెలంగాణా ప్రజల సమైక్య వారధిగా 12 సం. నడిపారు. వీరు క్రమంగా రాజకీయాలు మానుకొని గ్రంథాలయోద్యమం, మద్యపాన నిషేధం, మహిళా సంక్షేమం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటూ నిత్యోత్సాహంతో జీవించారు.

పైన ఉదహరించిన మహిళలు ఈ ప్రాంతంలో ప్రసిద్ధులు. ఇంకా ప్రసిద్ధులు లేకపోలేదు. స్థలాభావం చేత అందరినీ గుర్తు చేయలేకపోయాం. పైన ఉదహరించిన వారు సామాన్య కుటుంబాలనుంచి వచ్చినవారు. స్వశక్తి, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగినవారు. సమాజశ్రేయస్సుకు పాటుబడాలనే తపన గలవారు. వీరందరి త్యాగాలు, కష్టనష్టాలు, సాధించిన విజయాలు బేరీజువేసుకొని నేటియువత ముందుకు సాగాలి.



**- డాక్టరు వెలగా వెంకటప్పయ్య**

రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖలో మూడు దశాబ్దాలుగా పైగా అనుభవం. గ్రంథాలయ సమాచార విజ్ఞాన రచయిత, సంపాదకుడు, కౌన్సెలర్‌గా వివిధ అంశాలపై 200పైగా గ్రంథాలు వ్రాశారు. పలు నిపుణుల కమిటీలలో సభ్యత్వం. కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలు, అకాడమీల అవార్డులు, గౌరవాలు అందుకున్నారు.



**విలియం కేరి (1760-1834)**

వృత్తిరీత్యా చెప్పులు కుట్టేవాడు. సిరంపూర్ యూనివర్సిటీ స్థాపకుడు 1800 సం॥. నూతన నిబంధనను 40 భాషల్లోకి అనువదించాడు. పూర్తి బైబిలును 20 భాషల్లోకి అనువదించాడు. భారతదేశానికి మొట్టమొదటి పొగయంత్రాన్ని తెచ్చి ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో ఉపయోగించాడు. ఆసియాలోకెల్లా మొట్టమొదటి వార్తాపత్రికను ప్రచురించాడు. భారతదేశంలో మొట్టమొదటి బొటానికల్ సొసైటీని స్థాపించాడు. 'సతీ సహగమనం' నిషేధంలో పాత్ర వహించాడు.



**అలెగ్జాండర్ డఫ్ (1806-1878)**

భారతదేశంలో మొట్టమొదటి ఇంగ్లీషు మీడియం పాఠశాలలను ప్రారంభించాడు. అగ్రకులాలకు చెందిన స్త్రీలకు ప్రత్యేక పాఠశాలలను స్థాపించాడు. ఆనాటి సాంఘిక దురాచారాల గురించిన అవగాహన ప్రజల్లో కలిగించాడు.

## కూతురు దుర్గకు తండ్రి సాంబయ్య ఉత్తరం

వల్లూరి శివప్రసాద్





చిరంజీవి దుర్గకు,

మీ నాన్న రాసేది ఏమంటే ఇక్కడ మేమంతా క్షేమం. అక్కడ హాస్టల్‌లో నువ్వు కూడా క్షేమమని తలంచుతాను. నా జీవితంలో నేను రాస్తున్న రెండో ఉత్తరం ఇది. మొదటిది నువ్వు పుట్టకముందు మీ అమ్మకు రాశాను. పెళ్లయిన కొత్తల్లో శ్రీరామనవమి పండుగకని మీ అమ్మ పుట్టింటికెళ్లింది. వాళ్ల ఊళ్లో చలువ పందిళ్లేసి, తొమ్మిదిరోజులపాటు గొప్పగా చేసేవాళ్లు ఆ రోజుల్లో. ఎక్కడెక్కడి బంధువులో ఆ పండక్కి వచ్చే వాళ్లు. పండుగ మర్నాడు వస్తానన్న మనిషి రాకుండా ఎక్కువరోజులే తిష్టవేసింది. నాకేమో తిక్క పుట్టింది. అప్పట్లో ఇప్పుడున్నట్లు ఫోన్లు లేవుగదా!

ఒక ఉత్తరం ముక్క రాసి పడేశాను. ఉన్నపళంగా బయల్దేరి రాకుంటే నీకూ నాకూ చెల్లంటూ. మీ అమ్మకు అక్షరం ముక్క చదవటం రాదని నాకు తెలిస్తే గదూ!

మొగుడు రాసిన ఆ ఉత్తరం చదివి పెట్టినమ్మ అంతటితో ఊరుకోకుండా, విషయం ఊరంతా టాంటాం వేసింది. పాపం! మీ అమ్మను ఊరంతా ఆటలు పట్టించారు. మీకు తెలియదు గాని, ఆ రోజుల్లో మొగుడూ పెళ్లాలు నలుగురూ చూస్తుండగా ఎదురుపడి మాటాడుకోవటమంటే చచ్చేంత సిగ్గు పడేవాళ్లు. ఇప్పుడంటే కాబోయే మొగుడూ,పెళ్లాలు పెళ్ళిమాట అనుకోవటంతోనే గంటల తరబడి ఫోన్లలో కబుర్లూ,షికార్లూనూ. మళ్లీ ఇలాంటి రాతలు గానిరాస్తే కాపురానికే రాను పొమ్మంటూ బెదిరించేసింది మీఅమ్మ. పైకలా కోప్పడింది గాని, తలంబ్రాల చీర మడతల్లో ఇప్పటికీ ఆ ఉత్తరాన్ని భద్రంగా దాచినట్లుంది. ఇక ఈ ఉత్తరం సంగతి ఇంతటితో వదిలేద్దాం.

ఎప్పుడూ లేంది నీకు ఇయ్యాల ఉత్తరం రాయాల్సి వచ్చింది. వచ్చే ఏటికి నీ ఇంజనీరింగు చదువు పూర్తయిపోద్ది. ఇంతకాలం లేంది, మీ అమ్మ నీ గురించి భయపడిపోతుంది. ఒక్క మీ అమ్మేగాదు, ఇట్లా ఆడపిల్లలను గన్నతల్లిదండ్రులంతా మా లానే గజగజలాడిపోతున్నారు. ఊరుదాటి,చదువుకోసం, ఉద్యోగాల కోసం వేళ్లే ఆడపిల్లల మీద జరుగుతున్న దౌర్జన్యాలు, అగాయిత్యాలు చెవిన బడుతుంటే గుండెల్లో రయిళ్లు పరిగెడతా వుండయి. ఒకప్పుడు ఆడపిల్లకు పెళ్లి చెయ్యటం పెద్ద సమస్య అనుకునే వాళ్లు. ఇప్పుడంతకన్నా పెద్ద సమస్య ఆడపిల్లను పెళ్లయ్యేదాకా కాపాడుకోటం!

'దుర్గ మంచి తెలివిగల పిల్ల, పైచదువులు చదివించండి' అంటూ కాంతారావు పంతులుగారు అన్న మాటలు మా బుర్రల్లోకి బాగా ఇంకిపోయ్యాయి. నిజానికి నిన్ను పెద్ద చదువులు చదివించే స్థోమతు మాకు లేదు. మా చిన్నపుడు మేం అన్నదమ్ములం భాగాలు పంచుకుంటే ఆరెకరాలు మాగాణి, నాలుగెకరాలు మెట్ట చేతికొచ్చింది. ఇద్దరు పిల్లలు, పదెకరాలు పొలం ఇంతకంటే బతకటానికి ఏం కావాలను కున్నాం. కాని, ఓడలు బళ్లు, బళ్లు ఓడలు కావటం అంటారే అట్లాగయింది. నానాటికి ఎగసాయం దండగ మారిదయింది. ఏ యేటికా యేడు నష్టాలు మూటగట్టుకుంటూ, రెండెకరాల పొలం అమ్మాల్సివచ్చింది. ముందు ముందు బతుకు ఇంకెంత అధ్వాన్నమవు తుందోనన్న భయం పట్టుకొంది. ఎగసాయాన్ని నమ్ముకొనే పరిస్థితి కనబడటం లేదు. పిల్లలకు చదువులన్నా ఒంటబడితే ఉద్యోగాలు చేసుకొంటూ సుకంగా బతుకు తారనిపించింది. కాని అన్నను చదివించినట్లు నిన్నూ చదివించాలంటే మాటలా! మగాడు కాబట్టి వాడి పొట్ట వాడు పోసుకుంటాడు. ఆడపిల్ల విషయం అట్టా కాదుగదా! చదువుతో పాటు పెళ్లి బాధ్యతా తలకెత్తుకోవాలి. అయ్యే పనా! రైతుల ఇండ్లల్లో ఏ ఆడకూతురు సుఖపడగలుగుతుందని, నా కూతురూ సుఖపడుతుందని నిబ్బరంగా వుండటానికంటూ మీ అమ్మ లబలబలాడింది. కూతుర్ని చదివిస్తే గాని ఈ గానుగెద్దు చాకిరీ తప్పదంటూ తెగింపు చేసింది. మీ ఇద్దరి చదువుల కోసం నాలుగెకరాల పొలం చేజారింది. ఎట్టాగో అన్న చదువయింది. మంచి ఉద్యోగం కోసం కిందా మీదా పడతన్నాడు. రెండేళ్ళు బోతే నీ బతుకూ ఒక దారిన పడుతుందన్న ఆశ ఉంది.

చదువుకునే పిల్లల్ని ఒక కంట గమనిస్తుండా లంటూ హెచ్చరిస్తుంటాడు కాంతారావు పంతులు గారు. చదువుకొనే ఆడా, మగా పిల్లకాయలకు సెల్‌ఫోన్లు, కుర్రాళ్లకు మోటారు సైకిళ్లు కొనిత్తే చదువులు కుంటుపడతాయంటాడు. ఈ విషయంలో మీ అన్నా చెల్లెళ్లు మా మీద అలిగినా, మమ్మల్ని నిష్టూరాలాడినా మేం లెక్క పెట్టలేదు. అదేదో లేపుటాపు నీ చదువుకి ఎంతో అవసరం, కొనితీరాలన్నావు. కొనటానికి ఎంతో గుంజాటన పడాల్సివచ్చింది.

ఈ ఏడాది దేవుడు కరుణించి పంటలు కాస్త బాగానే పండాయి. ఖర్చులుపోను నాలుగు రాళ్ళు చేతిలో మిగులుతాయని సంబరపడ్డాం. అమ్మ చీరలు, నా పంచెలూ కొ్రరుబట్టి పోయాయి. అదిగో, ఇదిగో కొందామనుకుంటూ చేతుల్లో డబ్బులాడక అతుకులుపెట్టుకుంటూ గడుపుకొచ్చాం. ఈ ఏడన్నా బట్టలు కొనుక్కోవాలను కున్నాం. ఎవురింటికన్నా, ఏ మంచికి పోవాలన్నా సిగ్గుగా ఉంటుంది. ఏడాదిగా మీ అమ్మకు కడుపులో నొప్పి వస్తావుందట.మందుల కోట్టో ఏవో బిళ్లలు తెచ్చుకొని మింగుతా వుంది. ఎంతయితే అంతయింది,మీ అమ్మను ఆసుపత్రికి తీసుకెళ్లి చూపెట్టాలనుకున్నా, మిగిలిన డబ్బుతో బ్యాంకులో తాకట్టు పెట్టిన మీ అమ్మ పుస్తెలతాడు యిడిపించుకుందామనుకున్నాం.

ఆ లేపుటాపు కొనటానికి ముప్పయ్యేలు పంపాలనేసరికి మా గుండెల్లో రాయిపడింది. మా అవసరాలు వచ్చే పంటలనాటికి వాయిదా వేసుకున్నాం. కాంతారావు పంతులుగారిచేతికి డబ్బిస్తే ఇ దేశం నుండొచ్చే అబ్బాయితో కాస్త తక్కువ ధరకు తెప్పించి పెట్టాడు. ఇంత ఖరీదైనవస్తువు అవసరమా పంతులుగారూ? అంటూ అడిగాను.

మంచికీ,చెడుకీ రెండింటికీ ఉపయోగపడే వస్తువు సాంబయ్యా అంటూ నవ్వాడు పంతులుగారు. సినిమా పాటలు, సినిమాలు, రకరకాల ఆటలు లాంటివి ఎన్నో పెట్టుకొని కాలక్షేపం చేయటానికి పనికొస్తుంది. పెంపంచకాన్నంత ఒడిసిపట్టటానికి పనికొస్తుందన్నారు. చదువుకునే మన పిల్లల్ని ఒక కంట గమనిస్తా ఉండాలంటూ అప్పుడప్పుడూ బోధచేస్తుంటాడు కాంతారావు పంతులుగారు. మాకా మాటలు వింటుంటే భయం పుట్టిందమ్మా దుర్గా.

ఆహా, నీ శ్రద్ధ మీద మాకు నమ్మకం లేకగాదమ్మా,తెలిసీ తెలియని వయసుగదా! మా కళ్లకెప్పుడూ పిల్లలుగానే అవపడతారు మీరు. ముందు జాగ్రత్తగా,ఒకమాట చెప్తే తప్పులేదు గదా! ఆ లేపుటాపు తెరిచినప్పుడల్లా దాని తెరమీద మాకు ఏమాత్రం తెలవని గొప్ప ప్రపంచాన్ని నువ్వు చూడగలుగుతావు, బాగా అర్థం చేసుకుంటావు. మేం చదువు సంధ్యల్లేనోళ్లం. నీకన్నా వయస్సులో పెద్దవాళ్లమయినా, తెలివితేటల్లో, లోకగ్యానంలో నీకన్నా చిన్నవాళ్లం. ఆ తెరమీద రంగురంగుల పెపంచాన్ని నువ్వు చూస్తున్నప్పుడల్లా,ఒక్క క్షణమైనా,ఎండకు ఎండీ, వానకు తడిసే మాబండబారిన శరీరాలు బొమ్మకట్టాలి. చెమటలోడుతున్న మా కాయకష్టం కనబడాలి. మా కళ్లల్లో నీ బంగారు భవిష్యత్తు కోసం కంటున్న కలలు కనబడాలి.

పొద్దున పేపర్లలో, టీవీలలో ఆడపిల్లల మీద జరుగుతున్న అగాయిత్యాలు వింటంటే మాకు కంటిమీద కునుకు పట్టడం లేదు. నాబిడ్డకే గాదు, ఏ అమ్మ కన్నబిడ్డకీ ఇట్టాంటి గతి పట్టకూడదు దేముడా అని మొక్కుతున్నాం. నాకొడుకే కాదు. ఏ అమ్మకన్న కొడుకూ అట్లాంటి పాపపు పన్లు చెయ్యగూడదు దేముడా అని వేడుకుంటా ఉన్నాం.

ఈ మద్దెనపేపర్లో అదేదో పరీక్షంట ఆ. సి.ఎ.గావాల..అందులో దేశం మొత్తంమీద ఫస్టులో ప్యాసయిన అమ్మాయి గురించి చదివాను. ఆ పిల్ల ఫోటో చూస్తంటే మీ అమ్మకూ, నాకు నిన్నుజూస్తన్నట్టే అనిపించింది. ఆపిల్ల బొంబాయిలో ఆటో డ్రయివర్ కూతురంటమ్మా.

ఏందోలే..ఎగసాయం దండగమారి దయిపోతంది. రైతు బతుకు నవ్వులపాలవుతుంది. మా సోదంతా చెప్పి నీ బుర్ర పాడు చెయ్యాలని నా ఉద్దేశం కాదు. మా లాగా నువ్వు అగచాట్లు పడకుండా బతకాలి. అంతేనమ్మా మేము కోరుకునేది. నువ్వెంత బాగా కష్టపడి చదివి పైకి రావాలో తెలిసి రావాలనే తపనతోనే.

చదువు దుర్గా బాగాచదువు.
నువ్వు మంచిమనిషిగా ఎదగటానికి చదువు
నీ బతుకు నువ్వు గౌరవంగా బతకటానికి చదువు
నీ కాళ్ల మీద నువ్వు గట్టిగా నిలబడటానికి చదువు
చదువమ్మా బంగారు తల్లీ, ఇంకా బాగా చదువు.

ఇట్లు, నీ తండ్రి సాంబయ్య

---




**వల్లూరు శివప్రసాద్**

సామాజిక చైతన్యం, సంస్కారం పెంపొందించే ప్రయోజనాత్మక కథా, నాటక రచయిత, వైద్య, ఆరోగ్యశాఖలో అధికారిగా పదవీ విరమణ చేశారు. 60 కథలు రాస్తే అందులో 20 కథలకు వివిధ బహుమతులు పొందారు. వీరి కథలు, 30 హిందీలోకి అనువదించ బడ్డాయి. 25 బాలల కథలు, ఒక నవల రాశారు. 5 నాటకాలు, 23 నాటికలు, 6 బాల నాటికలు రాశారు. వీరి నాటికలకు పలు నందులు, సన్మానాలు పొందారు. టెలిఫిల్మ్‌లకు రచనలు అందించారు.

E-mail : sprasadvalluru@gmail.com

సంచారవాణి : 92915 30714

# ఇంటి బెంగ





రోజూలాగానే మూషికాలన్నీ ఒకచోట పోగయ్యాయి. పగలంతా వేటకు వెళ్లివచ్చి ఫలహారం కాస్త మునివళ్లతో కొరికేసి, తీరికగా కబుర్లు చెప్పుకోసాగాయి. ఏ విషయం గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాయి. అన్నట్లు ఈ మూషికాలకు ఎవరన్నా, ఏ పిల్లి అన్నా భయం లేదు, కాని వాళ్ల కాపలా పిల్లి అంటే మాత్రం కాస్త భయం, ఇంకాస్త భక్తీ ఉన్నాయి. ఎందుకంటే ఆ పిల్లి మాంసాహారి కాదు. పైగా ఎలుకలు ఎదురుగాపోయినా వాటిని తినదు. వాళ్లకు సౌకర్యాలు కూడా బాగా చూస్తుంది. నిజానికి ఎలుక పిల్లలను తన పిల్లలుగా చూసుకుంటుంది. కాని వచ్చిన పేచీ ఏమిటంటే ఆ పిల్లిగారు అప్పుడప్పుడు పులిలాగా మారుతుంది. అలా ఎందుకు మారుతుందో ఏ మౌస్ కూ అంతుబట్టదు. పెంపుడు ఎలుకలు ఎంత సమంజసమైన కోరిక కోరినా సరేనని తలఊపదు వాళ్ల కాపలా పిల్లి.

ఆరోజు మన ఎలుకలకు ముఖ్యమైన సమస్య ఏదో వచ్చిపడినట్లుంది. సమస్యను నానబెట్టగూడ కున్నది, ఒక సీనియర్ ఎలుక. పిల్లిగారి ఆసనం ముందుగా ఏదో పనిమీద వెళుతున్నట్లుగా వెళ్లి పిల్లి గారి మూడ్ ఎలా ఉందో పసిగట్టాలనుకున్నది. అడుగులో అడుగు వేసుకుంటూ ఎలుక సాగుతుంది. ఆ అడుగులను వెనకనుంచి వందల ఎలుకలు ఫలితం కోసం ఆశ నిరాశల మధ్య ఉయ్యాలలు ఊగుతూ ఆత్రంగా స్తంభాల చాటునుంచి ఎదురు చూస్తున్నాయి. రెండు మూడు సార్లు అటూ ఇటూ తిరిగింది. కాని వాళ్ల బాస్ మూడ్ ఎలా ఉందో గ్రహించటం ఆ ఎలుకకు చేతకాలేదు.

అప్పుడే మూడు రోజుల శలవుల్లో సగం రోజు అయిపోయింది. సమయం అంటే విలువ ఇటువంటప్పుడు బాగా తెలుస్తుంది. పాడు గడియారాలు ఒక గంట ఐదు నిమిషాలుగా పరుగులు తీస్తున్నాయి. ఎదురుగా పకోడీలు కరకరలాడుతూ బాగా ఉన్నాయి, వాటిని తీరికగా తింటూ కూర్చుంటే ఎలా? చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. సమయం లేదు. అందుకని కొత్త, పాత కాని ఒక ఎలుక సాహసించింది. చేతిలో నాలుగు కాగితాలు, మరో చిన్న కాగితం పట్టుకుంది. ధైర్యేసాహసే లక్ష్మి కదా? లక్ష్మి అను ఆ పేరుగల ఎలుక కదిలింది. అంతదూరాన్ని నాలుగు అంగల్లో దాటి పిల్లి ముందు వాలింది. చేతిలో ఉన్న కాగితం ఇద్దామంటే చెయ్యి వణుకుతుంది. కొద్దిగా చెమటలు పడుతున్నాయి. అయినా తప్పదు. తనను నమ్ముకున్న సంఘజీవులకోసం తన సాహసయాత్రను కొనసాగించక తప్పదు. తనవెంట వెయ్యి తలకాయలు,రెండు వేల కళ్లు ఎదురు చూస్తున్నాయి.

పిల్లి తల ఎత్తింది. ఎదురుగా ఎలుక. 'ఏమి కావాలమ్మా' అని అడిగింది. ఆ గొంతును బట్టి ఆ రోజు ఎదురుగాఉన్నది మార్జాలమో, శార్దూలమో తెల్చుకోలేక పోతుంది ఎలుక. అయినా తప్పదు. 'సార్' బయటకు వెళ్లాలి సార్'. ఆ మాటలు వినగానే పిల్లి పులి అయింది. కళ్లు పెద్దవి చేసింది. గొంతు పెంచింది. "ఎందుకు? పోవటానికి వీలు లేదు.పో. ఇంకేం పనిలేదా? శలవు వస్తే చాలు. ఇదొక తంతు. నేను కూడా మీ లాగానే ఇల్లు ఇల్లుఅని దూరం పోయిచదువుకోకుండా దెబ్బతిన్నా, చదువుకోపోయి" అని గదిమింది. ముహూర్తం బాగాలేదని, అయినా ఆశ పోక అలాగే నిలుచుంది. 'నీకే చెప్పేది పో.పోయి చదువుకో." "గంట పర్మిషన్ అయినా ఇవ్వండి"

సార్, సర్టిఫికెట్లు ప్రింట్ అవుట్ వేయించుకోవాలి' అని చేతిలో కాగితాలను చూపింది. అయినా పిల్లి మనసు రాయిలాగానే ఉంది. కుదరదు, వెళ్లు. ఎవరికి పర్మిషన్లు లేవు. వెళ్లి చదువుకో"

* * * * * *

ఇంతకీ సమస్య ఏమిటంటే 3 రోజులు వరుసగా సెలవులు వచ్చాయి. ఆ మూడు రోజులు హాయిగా ఎవరి కన్నానికి వాళ్ళు చేరాలని కోరిక. ఈ ఆరుబయట జైలు జీవితం బోరు కొడుతుంది. "అయినా ఎలుకలం, చిన్నప్రాణులం అని మా మీద దయ, జాలి,కరుణ, అవగాహన వంటివి చూపాలి గాని ఇలా మా స్వేఛ్ఛను హరిస్తే ఎలా? ఆఖరుకు చెర్లపల్లిలో చెరసాలలో గూడా సెల్‌ఫోన్‌లో మాట్లాడుకోవచ్చు గాని ఇక్కడ అదీ లేదు. వాళ్ల సొమ్ము ఏదో పోయినట్లు ఒకటే మాట. నలుగురు పెద్దలు ఉంటారు కదా అని ఎవరిని అడిగినా అందరిదీ ఒకే మాట". అని సణుగుకున్నాయి ఎలుకలు.

అసలు ఇలాంటి అవకాశం ఎప్పుడొస్తుంది? మూడు రోజులు వరుసగా సెలవులు. ఎంత గొప్ప అవకాశం?

* * * * * *

పిల్లి/పులి గారు అనేది ఒకటే మాట. మొన్ననే కదా ఇంటికి పోయి వచ్చింది? ఇంకో నెలరోజుల్లో పరీక్షలు ఉంటే ఇప్పుడు ఇళ్ళకుపోవటానికి వీలే లేదు అని.

చాలా ఎలుకలు తమ ఆశల మీద పుస్తకాలు కప్పాయి. ఉసూరుమంటూ తమతమ కన్నాలలోకి వెళ్ళిపోయాయి. అయినా ఆశతో కొత్తకొత్త వ్యూహాలతో కొన్ని మూషికాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. రాత్రి భోజనానికి గంట కొట్టారు. బయటినుంచి ఎలుకల బంధువులు వచ్చి సిఫారసులు ప్రయత్నించాయి. పులిరాజా మెట్టు దిగలేదు. ఆరోజు భోజనంలో ప్రత్యేక అంశం గుడ్డు వేపుడు వాసన గుమాయిస్తుంది.

ఎలుకలు / మూషికాలు/మౌస్‌లు అన్నీ కాయిన్ ఫోను చుట్టూ మూగాయి. ఎవరి పళ్లెం వాళ్లు చేత్తో పట్టుకొని అవును "పరీక్షలు దగ్గరకు వచ్చాయి గదా మనం బాగా చదవకపోతే ఎలా? మొన్ననేగా ఇంటికి పోయి వచ్చింది" అని సర్దుబాటు చెప్పుకున్నాయి. **అందని ద్రాక్ష పండ్లు పుల్లన** అని చేతిలో పళ్లెం పకపక నవ్వుతుంది.



**ఫ్లారెన్స్ నైటింగేల్**

నర్సింగ్ వృత్తికి పవిత్రత కలిగించడానికి విశేష కృషి చేసిన వనిత.



**మరియా మాంటిసోరి**

దండనలేకుండా ఆటల రూపంలో చదువు నేర్పాలని ప్రతిపాదించి ప్రచారం చేసిన మహిళ.



**హెన్రీ మార్టిన్ (1781-1812)**

కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదువు. గణితంలో బంగారు పతకం. హిందీ, పర్షియన్, అరబిక్ భాషల్లో ప్రావీణ్యం. స్త్రీలకోసం ప్రత్యేక పాఠశాల ప్రారంభం.

పుస్తకం ఒక పూలతోట, ఒక పండ్లతోట, భాండాగారం, ఒక వినోదం, తోటి బాటసారి, సలహాదార్ల సమూహం. హెన్రీ బీచర్

## కంప్యూటర్‌లో తెలుగు టైపు చేయటం



మూలం : **ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరరావు,** యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.

కంప్యూటర్‌తో తెలుగు రాయలేవా? అయితే ఈ పాఠం చదివి నేర్చుకో. వేలమంది లాగా నువ్వు కూడా పదిగంటల సాధనతో దీనిని చేసుకోగలుగుతావు. నెల సాధన చేస్తే ప్రావీణ్యత పొందుతావు. జీవితాంతం ఉపయోగపడే నైపుణ్యం నేర్చుకోవటానికి అంతమాత్రం ప్రయత్నం చేయగూడదూ? పైగా ఇప్పుడు తెలుగుకు ప్రాధాన్యం పెరుగుతుంది. నువ్వు క్లుప్త సందేశాలు పంపాలన్నా, పవర్ పాయింట్ ప్రజంటేషన్లను తెలుగులో ఇవ్వాలన్నా యక్స్. యల్. షీట్ల పైనా ఈ నైపుణ్యం ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది.

ఇందుకు కావలసింది నీ కంప్యూటర్ / ల్యాప్‌టాప్‌లో విండోస్-7 ఉంటే చాలు. దాన్ని ఆన్‌చేయాలి. My Computer క్లిక్ చేసి Control Panel కు వెళ్ళాలి. అందులో గ్లోబు బొమ్మ ఉన్న Regional Language ఎంచుకొని వచ్చిన బాక్స్‌లో format క్లిక్ చేయాలి. అందులో ప్రమేయం లేకుండా (డిఫంక్ట్) English ఉంటుంది. పక్కన నొక్కితే అందుబాటులో ఉన్న భాషల జాబితా స్క్రోల్ అవుతుంది. వాటిలో Telugu క్లిక్ చేయాలి. కింద O.K. చేయాలి. అంతే నీ సిస్టమ్ లో తెలుగు వచ్చినట్లే. టాస్క్‌బార్ కింద En. Alt+Shift నొక్కితే HIN (హిందీ), మళ్లీ Alt+Shift నొక్కితే TEL (తెలుగు) ఆరుతూ వెలుగుతూ కనిపిస్తుంటుంది.

ఇపుడు ఇక నువ్వు ఏ భాషలో కావాలంటే ఆ భాషలో టైపు చేసుకోవచ్చు. తెలుగు/హిందీలకు ఒకే కీ బోర్డ్ పనిచేస్తుంది. ఇది DOE Keyboard (Department of Electronics) దీనిలో ఎడమచేతి వైపు అచ్చులు ఉంటాయి. అచ్చులు చేసేటపుడు Shift Key పట్టుకోవాలి.

D అ E ఆ F ఇ R ఈ G ఉ T ఊ

Z. ఎ S ఐ, ఒ A ఓ ఔ D+x.,అం D+ _ అ:

మిగతావి హల్లులు. వాటిని కింద చూపిన కీ బోర్డ్ ప్రకారం తెలుసుకోవచ్చు. దీనిని అంతర్జాలం నుంచి కూడా దిగుమతి చేసుకోవచ్చు. దానిని ఎదురుగా ఉంచుకొని టైపింగ్ సాధన చేయవచ్చు.

x/X కం/కc.,సున్న /అరసున్న c/C మ/ణ v/V న.,

గుణింతాలు క+ఆ=కా, క+ఇ=కి, క+ఐ=కై ఇలా వస్తాయి.

ద్విత్వాక్షరాలు: క+ర=క్ర, చ+చ=చ్చ., స+వ=స్వ

D=+లింక్ మీట ర/ఱ, k/K= క/ఖ, i/I= గ/ఘ, అవుతాయి. అంటే హల్లులు మామూలుగ కొడితే మామూలు అక్షరాలు (ర,క,గ) గా వస్తాయి. అవే మీటలను షిఫ్ట్ పట్టుకొని చేస్తే వత్తు అక్షరాలు (ఱ,ఖ,ఘ)లుగా వస్తాయి. అందువల్ల నువ్వు గుర్తు పెట్టుకోవలసినది తక్కువ. నువ్వు త్వరగా నేర్చుకోగలుగుతావు. నీ టైపు వేగం కూడా పెరుగుతుంది.

మొదట కొన్ని రోజులు కాస్త తడబడినప్పటికీ, తెలుగులో నీ పేరు, నీకు తెలిసిన పేర్లు, ఊళ్ల పేర్లు కొట్టుకోవటం చేతనయే కొలది నీకు ఆనందం ఆత్మవిశ్వాసం పెరుగుతాయి.

టైపు చేసినతరువాత నీకు కావలసిన రకంగా డిజైన్ మార్చుకోవచ్చు.

ఖతులు (Fonts) Windows లో UNICODE fonts ఉంటాయి. యూనికోడ్ ఫాంట్ల వినియోగం ప్రపంచవ్యాప్తంగా పెరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ఇటీవల 18 యూనికోడ్ తెలుగు ఫాంట్లను విడుదల చేశారు. వీటిని ఎవరైనా ఉచితంగా Teluguvelugu.org. నుంచి దిగుమతి చేసుకోవచ్చు.

వీటి ద్వారా టైపు చేసిన పేర్లు / సంఖ్యలను ఇంగ్లీషులో లాగా సార్ట్ చేసి అక్షరక్రమంలో (అ – నుంచి హ) వరకు ఒక్క క్షణంలో మార్చుకోవచ్చు.

*కష్టించి పని చేయటం సరళరేఖ వంటిది, అదృష్టం వక్రరేఖ, నువ్వు సరళరేఖను అనుసరించు, వక్రరేఖ నిన్ను అనుకరిస్తుంది.*

# స్త్రీలు - విద్యావశ్యకత



మానవుడికి విద్య మూడో నేత్రంలాంటిది. విద్య ద్వారా మనిషి సమున్నతమైన వ్యక్తిత్వాన్ని సంస్కారాన్ని సముపార్జించగలడు. సమాజంలో సగభాగం అయిన స్త్రీకి విద్యావశ్యకత మరింత ఉంది. ఆమె కుటుంబాన్ని తీర్చిదిద్దటంలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఆమె విద్యావంతురాలైతే కుటుంబం మొత్తం విద్యా సంస్కారాన్ని పొందుతుంది. అలాంటి విద్యా వినయ సంపన్నమైన కుటుంబాల వలన సమాజం మొత్తం సంస్కారపూరితం అవుతుంది.

వేదకాలంలో స్త్రీల విద్య కొంత మెరుగుగా ఉన్నట్లు కన్పిస్తుంది. ఋగ్వేదంలో అనేకమంది స్త్రీలు మంత్రద్రష్టలుగా ఉన్నారు. వారిని ఋషికలని, బ్రహ్మవాదనులని వేదం పేర్కొన్నది. వారు స్వయంగా అగ్నికృత్యాలు చేసినట్లు మంత్రాలు తెలుపుతున్నాయి. ఋగ్వేదంలో స్త్రీల పేరుతో ఉన్న స్త్రీ సూక్తం స్త్రీల విద్యార్హతలను తెలియజేస్తుంది.

భారతీయులు మొట్టమొదట నుండి స్త్రీమూర్తికి విశేష ప్రాధాన్యమిచ్చినట్లు కన్పిస్తుంది. సర్వకళలకు అధిష్టాన దేవత శ్రీ సరస్వతిగాను, దుష్టనివారిణిగా శ్రీదుర్గ, సకల ఐశ్వర్య ప్రదాయినిగా శ్రీ లక్ష్మీమాతను చేశారు. పృధ్వీమాత, సప్తమాతృకలు, నదీమ తల్లులు, ప్రకృతి, మాతృభూమి అన్నిచోట్ల స్త్రీకే ప్రాధాన్యమిచ్చారు. నాటి సమాజంలో గార్గి, మైత్రేయి, మదాలస లాంటి విదుషీమణులు సర్వవిద్యా పారంగతులై వాక్పటిమ కలిగి వుండేవారు. యత్ర నార్యంతు పూజ్యతే అన్న ఆర్యోక్తి నిజమైంది. అంతటి మహర్దశ కలిగిన స్త్రీ స్థానం ఒక్కొక్క మెట్టు దిగజారి 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్న సూక్తిని అనుసరించింది.

తదనంతర మధ్యయుగాల్లో సమాజం స్త్రీని విద్యకు దూరం చేసింది. అవిద్యావంతురాలై బానిసత్వంతో యుగాలు కాలం ఆమె గడిపింది. ఆమెపై అనేక రకాల మూఢాచారాలు కూడా రుద్దబడ్డాయి. సతీసహగమనం, బాల్య వివాహాలు, కన్యాశుల్కం ఇలా ఏ సామాజిక దురవస్థ ఏర్పడినా దాని వలన స్త్రీయే బలియైపోయింది.

శతాబ్దాల తరబడి స్త్రీజాతిని పట్టిపీడిస్తున్న దురాచారాలను తొలగించటానికి 19వ శతాబ్దంలో ఎందరో సంఘసంస్కర్తలు ఉద్యమాలను నడిపారు. స్త్రీలకు విద్యా హక్కు కల్పించటానికి ఉద్యమాలు సాగాయి. ఈ ఉద్యమాలు స్త్రీల స్థితిగతులను కొంత వరకు మార్చటానికి దోహదం చేశాయి. స్త్రీ విద్య నేర్చుకుంటే ఆమె సామాజికంగా ఎదుర్కొనే అనేక రకాల సమస్యల నుండి విముక్తిని పొందటం సాధ్యం అవుతుందని సంస్కర్తలు ఆశించారు. ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారు "వివేకవర్ధిని" అనే పత్రికను స్థాపించి స్త్రీ విద్య అవసరం అనే శీర్షికతో సీరియల్‌గా వ్యాసాలు వ్రాశారు. సమాజంలోని పురుషులలోను కొంత మార్పు తెచ్చే ప్రయత్నంలో కృతకృత్యులయ్యారు.



స్వాతంత్ర్యానంతరం స్త్రీలలో విద్యా వ్యాప్తి పెరిగింది. 19వ శతాబ్దంలో స్త్రీ విద్య ప్రోత్సహించబడుట వలన అనేక మంది స్త్రీలు విద్యావంతులై రాజకీయనేతలుగా కవయిత్రులుగా, కళాకారిణులుగా, మేధావులుగా సమాజంలో మన్ననలందుకున్నారు. స్వాతంత్ర సమరరంగంలో దూకి అద్భుతమైన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కవయిత్రులు తమ కవిత్వం ద్వారా వీరులకు ఉత్తేజం కల్గించారు.

బ్రిటిష్‌వారిపాలన భారతీయులకు శాపమైనా భారతీయ మహిళలకు వరమైంది. భారతీయమహిళల జీవితంలో తిరిగి వెలుగులు ప్రసరించాయి. ఇందుకు కారకులైన రామమెహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ లాంటి మహనీయులకు స్త్రీ సమాజం ఎప్పుడు ఋణపడే వుంటుంది.

*నీ దగ్గరనుంచి ఇతరులు తీసుకు వెళ్ళిన దాని గురించి ఆలోచించకు, నీ దగ్గర మిగిలిఉన్న వాటితో ఏమి చేయాలో ఆలోచించు.*

స్త్రీ చైతన్యవంతమైన వ్యక్తిగా నిలచి సమాజాభివృద్ధికి తోడ్పడాలంటే ఆమెకు కావలసిన ప్రాథమిక హక్కు విద్య అనే అభిప్రాయం ఈనాడు బలంగా కన్పిస్తుంది.

విద్యావంతురాలైన స్త్రీ తన బిడ్డలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలదు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక, వైజ్ఞానిక మార్పులను తెలుసుకోవాలన్నా ప్రతి స్త్రీకి విద్య అవసరం. అనేక దురాచారాల మధ్య నలిగిపోయి తనను తనకు తాను నిలదొక్కుకుంటూ ముందుకు వెళ్తున్న స్త్రీలు అరాచకాలను దుర్ఘటనలను ఎదుర్కొనవలసి వస్తుంది.

స్త్రీ విద్య వలన ఆత్మ విశ్వాసమే గాదు మానసికంగా ఎదగటానికి ధైర్యం కూడా లభిస్తుంది. బహుభాషాధ్యయనం వల్ల విభిన్న సంస్కృతులను దర్శించవచ్చు. స్త్రీ విద్య అనే ఆయుధం స్త్రీసమాజంలో కీచకులైన దుర్మార్గులను అంతం చేసే ఆదిశక్తి కావాలి.

కమ్మజనసేవా సమితి వారు గ్రామీణ ప్రాంత బాలికలకు మంచి వసతిని కల్పించి, స్త్రీ విద్యా వ్యాప్తి కొరకు కృషి చేస్తూ ప్రోత్సహాన్నిస్తున్నందుకు వారిని మనసారా అభినందిస్తున్నాను.



జాతీయ అవార్డు గ్రహీత,
"ఆధ్యాత్మిక సేవాశిరోమణి"
ధార్మిక సేవారత్న
**గద్దె రామతులశమ్మ**

**ప్రపంచంలో**
**సాధించబడిన ఘనకార్యాలు**
**అలసిపోయి, నిరుత్సాహంగా**
**ఉన్నప్పటికీ ప్రయత్నాలు కొనసాగించిన**
**వారి ద్వారానే సంభవం అయాయి.**



**ఉన్నవ లక్ష్మీనారాయణగారు**

గుంటూరులో మహిళా విద్యకు పునాదులువేసి, భార్య లక్ష్మీబాయమ్మగారి తోడుగా **శారదానికేతన్** నెలకొల్పారు.



**డా॥ కె. కోటేశ్వరమ్మగారు**

మాంటిసోరి పద్ధతిలో విద్యాబోధన ప్రారంభించి పలు విద్యాసంస్థలను స్థాపించి స్వయంపాలక స్థాయికి పెంచిన విద్యావేత్త.



**డా॥ నన్నపనేని మంగాదేవి**

గుంటూరులో పలు విద్యాసంస్థలను, సేవాసంస్థలను ఆదర్శంగా నిర్వహిస్తున్నారు.

టి.వి. ద్వారా చాలా నేర్చుకోవచ్చు. ఇంట్లో ఎవరో ఒకరు దానిని పెట్టగానే నేను మరో గదిలోకి వెళ్ళి పుస్తకం చదువుకుంటాను.

## ఏ మీడియం మంచిది?

"మార్కులెందుకు తక్కువొచ్చాయమ్మా? బొత్తిగా చదవలేదా ఏంటి? అయినా ఇరవైకి అయిదు మార్కులేంటమ్మా?" అని చిన్నగా మందలిస్తున్న స్వరంతో ఇంజనీరింగు చదువుతున్న దీప్తిని ప్రశ్నించింది వాళ్ల ఇంగ్లీషు లెక్చరర్ రూప.

"చదివాను మాడమ్. ముందు రోజు రాత్రంతా నిద్రకూడా పోకుండా చదివాను మేడమ్. కానీ నేను ఇంటరు వరకూ తెలుగు మీడియంలో చదవటం వల్ల నాకు ఇంగ్లీషు రాదు మేడమ్" అని బెరుకు బెరుకుగా సగం మాటలు మింగుతూ సమాధానం చెప్పింది దీప్తి.

"ఇంగ్లీషు రాకపోతే మరి ఇంజనీరింగు ఎలా ఇంగ్లీషులో చదువుతున్నావు? ఆ సబ్జక్టులు ఎలా అర్థమవుతున్నాయి?" అడిగింది రూప.

"కొందరు సార్లు, మేడమ్‌లు తెలుగులో చెబుతారు మేడమ్. అవి పర్లేదు మేడమ్, అర్థమవుతాయి. కాని కొందరు సార్లు మొత్తం ఇంగ్లీషులో చెబుతారు. అవి ఏమీ అర్థం కావు" అంది దీప్తి.

"మరి మొదటి సంవత్సరం అయిపోవస్తుంది. ఇలా నాకేమీ అర్థం గావటం లేదంటే ఎలా? అర్థం చేసుకోవటానికి ఈ సంవత్సరమంతా నీవైపు నుంచి నువ్వేమి ప్రయత్నం చేశావో చెప్పు?" అన్న రూప ప్రశ్నకు దీప్తి నిశ్శబ్దమే సమాధానంగా అలా నిలబడిపోయింది.

"నువ్వు ముందు కూర్చోమ్మా" అని తన ఎదురుగా ఉన్న కుర్చీని చూపించింది రూప."థాంక్యూ మేడమ్" అని తలకాయ వంచుకొని బెరుకుగా కూర్చుంది దీప్తి.

"చూడు దీప్తీ, నువ్వు నాకు ఇంగ్లీషు రాదు అని నీ మనసును కండిషన్ చేసి పెట్టావు. కానీ అది నిజం కాదు. నీకు ఇంగ్లీషు అస్సలు రాకపోతే పదిలో, ఇంటర్ రెండు సంవత్సరాలూ ఎలా పాసయ్యావు? నువ్వు ఇక్కడి పరీక్షల్లో సరిగ్గా రాయకపోవడానికి "నాకు ఇంగ్లీషు రాదు' అనే దానిని ఒక వంకగా చూపిస్తూ కష్టపడటం మానేస్తున్నావు, అది తప్పు.

నీకు ఇంగ్లీషు తప్పకుండా వస్తుంది. దానికి నువ్వు చెయ్యవలసినదల్లా రోజుకి గంటసేపు ఇంగ్లీషులో ఏదో ఒకటి నీకు అసక్తిని కలిగించేది చదవాలి. అవి చిన్న చిన్న కథలు కాని మరే ఏ ఇతర పుస్తకాలు కాని ప్రాథమిక తరగతుల పాఠ్య పుస్తకాలు, ఉదాహరణకి సాంఘిక శాస్త్రం, సైన్స్ లాంటివి చదువు. ఎందుకంటే ఆ పుస్తకాల్లో ఉండే విషయాలు నీకు తెలిసినవే అయి ఉంటాయి. కానీ వాటిని ఇంగ్లీషులో ఎలా వ్యక్తపరిచారో గమనిస్తూ నువ్వు వాటిని చదవాలి".

అంతే కాకుండా రోజు మొత్తంలో నీవు నీ తరగతుల్లో వినే ఇంగ్లీషును మీ ఉపాధ్యాయులు ఎలా వాడుతున్నారో గమనించాలి. ఏదైనా కొత్త భాషను నేర్చుకోవాలంటే, బలమైన కోరిక, ఆ భాషకు సంబంధించిన ఏ చిన్న ప్రయోగాన్నైనా గ్రహించటానికి మనసు ఎప్పుడూ తెరచి ఉంచుకోవాలి. నాకు 'ఇంగ్లీషు రాదు' లాంటి తప్పుడు నమ్మకాలు మనసును మూసివేసి భాష నేర్చుకోవటానికి పెద్ద ప్రతిబంధకాలుగా మారతాయి.

తెలుగు మీడియంలో చదివాను కాబట్టి నాకు ఇంగ్లీషు రాదు అనేది నువ్వు సృష్టించుకున్న ఓ బలమైన అబద్ధం. నువ్వు అందులోంచి బయటపడి నాకు ఇంగ్లీషు తప్పకుండా వస్తుంది అని నమ్మాలి.

నేను 8వ తరగతిలో ఆరు సబ్జక్టులలో ఐదింటిలో తప్పాను. మా అన్నయ్య ఎగతాళి చేసేవాడు.

అంతదాకా ఎందుకు, నేను ఇంటరు వరకూ



తెలుగు మీడియంలోనే చదివాను. డిగ్రీలో నా క్లాసులో ఉన్న ముప్పయి మందిలో ఇరవై రెండు మంది మొదటి నుండీ కేంద్రీయ విద్యాలయాల్లాంటి ఇంగ్లీషు మీడియం స్కూళ్ళల్లో చదివినవారే.

నేను మొదటి సెమిస్టరులో సెకండు క్లాసులో పాసయ్యాను. మార్కుల్లో క్లాసులో పదహారో దానిగా వచ్చాను.

*సరిగా వాడుకోవడం చేతనయిన వాళ్లకు సమయం బాగా దొరుకుతుంది. – లియోనార్డ్ డావిన్సీ*

ప్రతిరోజు క్రమం తప్పకుండా కోర్స్ సిలబస్‌కి సంబంధించినవి కాకుండా గంటసేపు ఏదో ఒకటి ఇంగ్లీషులో చదివేదాన్ని. తెలియని పదాలకు అర్థాలు తెలుసుకొని చదివేదాన్ని. వాటిని ఒక నోట్ పుస్తకంలో నా సొంత వాక్యాల్లో ప్రయోగిస్తూ రాసేదాన్ని. ఆ పదాల్ని వాడే అవకాశాలు సృష్టించుకునే దానిని.

నా డిగ్రీ కోర్సు చివరి అయిదు సెమిస్టర్లలో నేనే క్లాసు ఫస్టు వచ్చాను. నేనిదంతా నా గురించి గొప్పలు చెప్పుకోవడానికి చెప్పటం లేదు. నువ్వు స్ఫూర్తిని పొంది ఇంగ్లీషు నేర్చుకుంటావని చెబుతున్నాను.

అంతదాకా ఎందుకు? నాకు ఇంగ్లీషు నేర్పిన అత్యుత్తమ గురువులందరూ పది, పన్నెండు తరగతుల వరకూ వారి వారి మాతృభాషల్లో చదివిన వాళ్ళే. ఆ తరువాత విదేశాలలో పి.హెచ్.డి పట్టాలు పొంది వెనక్కి వచ్చినవారే.

**తెలుగు మాధ్యమంలో చదవటమనేది ఇంగ్లీషు నేర్చుకోవటానికి ఏ మాత్రం ప్రతిబంధకం కాదు సరికదా అది నువ్వు ఇంగ్లీషు నేర్చుకోవటానికి దోహదపడుతుంది కూడా. నువ్వు ఇంగ్లీషు నేర్చుకోవటంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలనే దానికి సంకేతం మాత్రమే.**

నేను అందరిలాగే ఇంగ్లీషును మాట్లాడగలను రాయగలను అనే దృఢ నమ్మకం నీపై నీకుండాలి. నీకు ఇంగ్లీషు నేర్చుకోవటానికి ఈ కాలేజీలో, హాస్టల్లో, ఇంట్లో ఉన్న వనరులన్నింటినీ ఉపయోగించుకో. ఇంగ్లీషు వార్తలు వినటం, డిస్కవరీ, నేషనల్ జియోగ్రాఫిక్ లాంటి ఛానళ్ళలోని కార్యక్రమాలు చూడటం, చూస్తున్నంత సేపూ దృష్టి వాటిల్లో వాడే ఇంగ్లీషు భాషపైనే పెట్టటం ఎంతైనా అవసరం.

నేర్చుకునే క్రమంలో నీకెలాంటి సందేహాలున్నా నన్ను వచ్చి అడుగు. నేను చెబుతాను అని ముగించిన రూపకు దీప్తి కళ్ళల్లో ఆశ చిగురించటం స్పష్టంగా కనబడింది. ●



ప్రొఫెసర్ పి.హరి పద్మరాణి

ఆంగ్లశాఖ,

శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం



## పుస్తకాలు

సేకరణ : లంకా సూర్యనారాయణ

టి.వి. కార్యక్రమం, చలనచిలన చిత్రం లేదా మరేదైనా ఆధునిక ప్రసార మాధ్యమం కంటె పుస్తకం గొప్పది. అది ఏళ్ళ తరబడి నిలబడి వుంటుంది.

భగవంతుని ప్రేమ గురించి రాసినా సరే చెడ్డ పుస్తకం చెడ్డదే.
థామస్ మెర్టన్

పుస్తకం ఆశీర్వాదం వల్ల లభించే నేస్తం. సరిగా ఎంచుకొన్న పుస్తకం జీవితాంత నేస్తం. తాకినంత మాత్రాన్నే తన హృదయాన్ని మన హృదయంలోకి పోస్తుంది. - డగ్లస్ జెరాల్డ్

పుస్తకం ఒక సున్నితప్రాణి. కాలంతోపాటు మారుతుంది. కాని దానికి ఎలుకలు, మెదడు/ మురికి చేతులు అంటే భయం.
- అంబర్డో ఎకో

పుస్తకం ఒక నేస్తం. మంచి పుస్తకం మంచి నేస్తం. అడిగితే మాట్లాడుతుంది. వద్దంటే ఆగుతుంది. అలా చేయగల స్నేహితులు ఎంతోమంది వుండరు. - బి.ఎ.బిల్డింగ్స్లీ

నీవు జేబులో పెట్టుకొని పోగల ఉద్యానవనం పుస్తకం.
- అరేబియన్ సామెత

పుస్తకం ఒక పూలతోట, ఒక పండ్లతోట, భాండాగారం, ఒక వినోదం, తోటి బాటసారి, సలహాదార్ల సమూహం.హెన్రీ బీచర్

పదేపదే తెరచి చూచుకోగల కానుక పుస్తకం. -గ్యారిసన్ కైలర్

ఒకో పుస్తకం ప్రపంచపు ఒకో కోణం. అది నీకు నచ్చకపోతే దానిని పట్టించుకోకు. లేదా దానికి బదులుగా నీ ప్రపంచాన్ని చూపించు. - సాల్మన్ రష్దీ

నీవు చదవాలనుకునే పుస్తకం ఇంత వరకు ఎవరూ రాయలేదంటే నీవే దాన్ని రాయాలి. - టోనీ మారిసన్

పుస్తకాలు లేని గది (ఇల్లు) ప్రాణం లేని శరీరంతో సమానం. సిసిరో

పుస్తకాలు ప్రశాంత నేస్తాలు. అవి అతి సులువుగా అందుబాటులో వుంటాయి, అతి గొప్ప సలహాదారులు, అతి సహనం గల అధ్యాపకులు. - చార్లెస్ డబ్ల్యు. ఇలియట్

# మృదు, దృఢ నైపుణ్యాలు
# (సాఫ్ట్ స్కిల్స్ - హార్డ్ స్కిల్స్)

మన తాతల కాలంలో చదువు అంటే అక్షరాస్యత. చదవటం,రాయటం తెలియటమే. చదువు అనగానే గణితం, భాషలు సామాన్య,సాంఘిక శాస్త్రాలు. టెంత్, ఇంటర్, డిగ్రీలు తరువాత ఉద్యోగాలకై ప్రయత్నాలు. కొంతమంది 80% మార్కులు ఉన్నా, అంతకంటే తక్కువ మార్కులు ఉన్నవారితో పోటీపడలేకపోతారు. వీటన్నింటికీ ప్రధాన కారణం - సాఫ్ట్ స్కిల్స్ లేకపోవడం అని అర్థమౌతుంది.

ఈ సాఫ్ట్‌స్కిల్స్ గురించి ఈ మధ్య తరచుగా విన్పడుతుంది. పైగా ఇది ఏ పాఠ్యగ్రంథాలలోనూ కనబడదు. మోడల్ ప్రశ్నాపత్రం అంటూ ఉండదు. మిగిలిన సబ్జెక్టుల్లాగా ఒక సంవత్సరం చదివేసి,పరీక్ష రాసేసి,మార్కులు తెచ్చుకుని,సర్టిఫికెట్ పొందాలంటే కుదిరేది కాదు. అసలీ సాఫ్ట్‌స్కిల్స్ అంటే ఏమిటి? ఇవి ఎందుకు? వాటిని పొందడమెలాగో ఇక్కడ చూద్దాం!

## సాఫ్ట్‌స్కిల్స్ అంటే ఏమిటి?

క్లుప్తంగా చెప్పాలంటే - వ్యక్తిత్వ నైపుణ్యాల సమాహారమే సాఫ్ట్‌స్కిల్స్. వివరంగా చెప్పాలంటే - ఆశావాద దృక్పథం (పాజిటివ్ ఆటిట్యూడ్), ఆత్మవిశ్వాసం, గ్రహణశక్తి, సంభాషణా నైపుణ్యం, సృజనాత్మకత, బృందంలో ఒకరుగా పనిచేయగలగడం, సమయపాలన, వత్తిడిని తట్టుకోగలిగే శక్తి, సమస్యా పరిష్కారతత్వం మొదలైనవన్నీ ఉండటమే సాఫ్ట్‌స్కిల్స్ కలిగి ఉండటం. ఇవేమీ పుట్టుకతో వచ్చే లక్షణాలు కావు. సాధనతో ప్రయత్నించి అలవరుచుకున్న లక్షణాలే!

## సాఫ్ట్‌స్కిల్స్ ఎందుకు ?

మనకి తరచుగా కనబడే ఉదాహరణను చూద్దాం! ఆయా సబ్జెక్టులలో అభ్యర్థులు పాసయ్యారని, మార్కులు, సర్టిఫికెట్లు నిరూపిస్తాయి. ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తూ ఇవన్నీ వివరిస్తారు. వీటి ఆధారంతో ఆయా సంస్థలు ఇంటర్వ్యూకి రమ్మంటాయి. అంటే ఈ మార్కులు, సర్టిఫికెట్లు ఆయా అభ్యర్థులను ఉద్యోగ సంస్థ వాకిలి వరకు వెళ్లే అవకాశమిస్తాయి. అపుడు మొదలవుతుంది. అసలు కథ. రాత పరీక్ష, బృందచర్చ, మానవ సంబంధాలు ప్రతి దానిలోనూ సాఫ్ట్‌స్కిల్స్ ఉన్న వారిదే పైచేయి అవుతుంది. అంతిమంగా వీరిదే విజయం! అంతేకాదు. తరువాత వేసే ప్రతి అడుగులోనూ, నిచ్చెన ఎక్కే ప్రతి మెట్టులోనూ సాఫ్ట్‌స్కిల్స్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. కేవలం ఉద్యోగం తెచ్చుకోవడమే కాదు, దాన్ని నిలబెట్టుకోవాలన్నా, ఆపై స్థాయికి ఎదగాలన్నా, అంతెందుకు అసలు మనిషి జీవితానికి అర్థం ఇచ్చేవే ఈ సాఫ్ట్‌స్కిల్స్.

## సాఫ్ట్‌స్కిల్స్ పొందడమెలా?

ఇది కొన్ని రోజుల్లోనే, కొన్ని క్లాసులతోనో, కొన్ని పుస్తకాలను చదివేసో సాధించలేం! నిజానికి ఇది చిన్నప్పటినుండే మనలో అంతర్లీనంగా, నిరంతరంగా సాగే వ్యక్తిత్వ నిర్మాణక్రియ. కేవలం ఒక ఉద్యోగం కోసమో, ఒక ప్రమోషన్ కోసమో కాదు, మొత్తంగా వ్యక్తి వికాసానికి తోడ్పడేవే ఈ నైపుణ్యాలు. ఏ వయసులోనైనా ప్రారంభించి వీటిని మెరుగు పరచుకోవచ్చు.

మనిషిని ఒక కంప్యూటర్ పరికరంతో పోలిస్తే, దానికుండే నెట్ సిగ్నల్స్‌ని సాఫ్ట్‌స్కిల్స్ అనుకుందాం. ఈ కనెక్షన్ (సిగ్నల్స్) బలహీనంగా (Weak) ఉందా, బావుందా (good) బలంగా (strong) గా ఉందా, అద్భుతంగా (excellent) ఉందా అని ఎవరికి వారే ముందే విశ్లేషణ చేసుకోవాలి. వారికి స్పష్టత లేనపుడు, ఆప్తులను/ టీచర్లును/ వృత్తి నిపుణులను సంప్రదించి బలహీనంగా ఉన్నవానిని మెరుగుపరుచుకోవటానికి సాధన చెయ్యాలి.

తరచిచూస్తే, ప్రతివ్యక్తికీ కొన్ని బలాలు, కొన్ని బలహీనతలు, కొన్ని అవకాశాలు, కొన్ని అవరోధాలు ఉంటాయి. మన బలాలేంటి బలహీనతలేంటి అని నిజాయితీగా ఎవరికి వారు విశ్లేషించుకోవడానికి కొన్ని సూచనలు ఇక్కడ ఉన్నాయి. ఒక నోట్‌బుక్ తీసుకొని, ఆలోచించి రాసుకోండి. దీన్నే SWOT Analysis అంటాము. SWOT ( Strengths బలాలు, Weaknesses బలహీనతలు Opportunities అవకాశాలు, (Threats అవరోధాలు) ఈ పదాల మొదటి అక్షరాలే SWOT మేనేజిమెంట్‌లో ఈ పరీక్ష కీలకమైనది. వ్యక్తికైనా, సంస్థకైనా ఈ పరీక్ష ముఖ్యమైనది.

## SRENGTHS:

సానుకూల దృక్పథం (పాజిటివ్ ఆటిట్యూడ్) తెలివితేటలు, సంభాషణ నైపుణ్యం, కష్టించే తత్వం, ఏ పనినైనా పూర్తి బాధ్యతతో, ఉత్సాహంతో నిర్వర్తించడం,

*సమయాన్ని ఒక పరికరంగా వాడుకోవాలి. పడకలా కాదు. - జాన్ యఫ్. కెనెడీ*

ఆత్మవిశ్వాసం, నిజాయితీ, బృందంలో ఒకరిగా పని, అందరితో పంచుకోవడం, ఓటమి నుంచి నేర్చుకోవడం, క్రమశిక్షణ, సమయపాలన, నిర్ణయించే శక్తి (Decision making skills) మిమ్మల్ని మీరు పరిశీలించి చూసుకుంటే మరికొన్ని మంచి లక్షణాలు కూడా ఉండవచ్చు. అందుకని ఇవన్నీ నోట్ చేసుకోవడం అవసరం.

**WEAKNESSES:** భయం, కోపం, ఆత్మనూన్యత, సిగ్గు, ఏకాగ్రత లేకపోవడం, భావవ్యక్తీకరణ చెయ్యలేకపోవడం, పనిని వాయిదా వేస్తూ ఉండటం, నిరాసక్తతతో ఎప్పటికీ చెయ్యకపోవడం, ఓటమికి కృంగిపోవడం, నిరాశా, నిస్పృహలు, శారీరక శ్రమ లేకపోవడం, బద్ధకం, త్వరగా అలిసిపోవడం ప్రతి చిన్న దానికి ఆందోళన పడటం, అనవసరంగా అబద్ధాలు చెప్పడం లాంటివి.

ఆసక్తితో పాటు, సంభాషణా నైపుణ్యం, బృందంతో కలిసిపోయి, పనిచేయగలగడం, శారీరక దారుఢ్యం, మాతృభాషతో పాటుగా హిందీ, ఇంగ్లీషులలో బాగా మాట్లాడటం అదనపు అర్హతలు అవుతాయి. నిజానికి మన ఆసక్తిని బట్టి ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని దానిలో ఉన్న విస్తృతావకాశాలను గమనించాలి. **Opportunities :** నీ స్నేహితులు, బంధువులు, విద్యాసంస్థలు వంటివి నీకున్న అవకాశాలు.

**అవరోధాలు: THREATS :** ఇంతకు ముందు చెప్పుకున్న బలహీనతలు ప్రధాన అవరోధాలు అవుతాయి. ఇవి కాక ప్రకృతిపరమైన అడ్డంకులు, భవిష్యత్తుపై భయాందోళనలు లాంటివి కూడా అవరోధాలుగా చెప్పవచ్చు. అననుకూల పరిస్థితులు, వాతావరణంతో పాటు సమాజంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు కూడా ఈ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం పేదరికం, ద్రవ్యోల్బణం, ఉద్యోగాల కుదింపు, నిరుద్యోగం లాంటివన్నీ దీనికి ఉదాహరణలే! ఇతరులు తనకంటే బాగా చేస్తారనే భయంతో, ఆత్మ విశ్వాసం లోపించడంతో పాటు, ఏకాగ్రత, సృజనాత్మకత పోగొట్టుకోవడం మనం ఆపాదించుకున్న అవరోధమౌతుంది. అలాగే పనిభారం పెరిగి నపుడు వత్తిడికి గురవ్వడం, మందబుద్ధి, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోవడం, పొరపాట్లని నిజాయితీగా ఒప్పుకోకపోవడం, ఇతరులను బాధ్యులుగా చెయ్యడం లాంటివన్నీ అవరోధాలే!

**సర్వజ్ఞులు ఎవరూ ఉండరు:**

అన్నీ బలాలే కలిగిన వ్యక్తి ఎలా ఉండరో, అన్నీ బలహీనతలు కలిగిన వ్యక్తీ ఉండరు. బలం పునాదులపై, బలహీనతలను అవరోధాలను ఎదుర్కుంటూ, అవకాశాలను అందిపుచ్చుకోలగడవే వ్యక్తిని శక్తివంతునిగా మారుస్తుంది. పేదరికం, అనారోగ్యం లాంటి అవరోధాల్ని, వ్యక్తిగత సాధన ద్వారా ఎలా జయించవచ్చో అబ్దుల్ కలాం, స్టీఫెన్ హాకింగ్స్ నిరూపించారు. అబ్దుల్‌కలాం కడు పేదరికంలో, పుట్టి ఎంత ఉన్నత స్థాయికి ఎదిగారో మనందరికీ తెలిసిందే! అలాగే స్టీపెన్ హాకింగ్స్ తీవ్రమైన నరాల సంబంధ వ్యాధిని ఎదిరించి, ఎన్నో ప్రముఖ సిద్ధాంతాలను ఆవిష్కరించిన శాస్త్రవేత్త. వీరి జీవితాలను పరిశీలిస్తే, ఎంతో స్ఫూర్తిదాయకమైన విషయాల్ని, తీవ్రమైన బలహీనతల్ని అధిగమించి, బలాన్ని ఎలా పెంపొందించు కోవచ్చో తెలుసుకోవచ్చు. ఇటువంటి వారు నీ చుట్టూ ఉంటారు. గమనించు. నీవు ఎందుకు చేయగలవో, ఎలా చేయాలో ఆలోచించు. అందుచేత మృదునైపుణ్యాల సాధన మనిషి జీవితలో ఒక భాగంగా మారాలి. పిజీలు, కేజీలు చదువుతున్న ఈ తరం వారికి, పోటీ ప్రపంచంలో దూసుకుపోవటానికి ఈ సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ తప్పనిసరి అవుతుంది.

అలాగే ఆడపిల్లలకు కొన్ని "హార్డ్" స్కిల్స్ కూడా అవసరం. ఇంటా బయటా తమను తాము కాపాడు కోగలిగే శారీరక బలం తప్పనిసరి. ఇంట్లో నుంచి వాహనాలెక్కి, కాలేజీకి వెళ్ళి 8-9 గంటలు కూర్చుని, ఇంటికి వచ్చి విశ్రాంతి తీసుకుంటారు. లేదా మళ్ళీ చదువు. కంప్యూటర్ లాంటివి ఉంటాయి. ఇలాంటి దినచర్యలో శారీరకంగా బాగుండే అవకాశం లేదు. అందుకని ఆడపిల్లలు మరింత అబలలు అవుతున్నారు. వీలైతే కొద్ది కాలమైనా కరాటే లాంటి వాటిలో శిక్షణ తీసుకోవడం, రోజూ కొంత సమయం ఎక్సర్‌సైజ్ చేయడం ద్వారా శారీరక దృఢత్వం కలుగుతుంది. అననుకూల పరిస్థితుల్లో ప్రతిఘటించడం లేదా కనీసం పారిపోవడానికైనా శక్తి కావాలి కదా! "నన్ను నేను కాపాడుకోవాలి" అనే దృఢచిత్తంతో ప్రయత్నిస్తే సబలలుగా మారవచ్చు.



**Dr.G. Vijaya Lakshmi**
Ex.Soft Skills Consultant - IEG, JKC
Ex. Associate Professor - KLUniversity
Vijayagottipati@gmail.com
Cell : 99487 79891

నిశ్చలమైన అనంతానికి చలించే ప్రతిరూపం కాలం. - ప్లేటో



# సూక్తులు

మైనేని సీతారామయ్య

"విద్యాతురాణాం నసుఖం న నిద్రా" విద్యకోసం తపించే వ్యక్తి నిద్రను, సుఖాన్ని త్యాగం చేయక తప్పదు.

"అహంకార నిర్మూలనకు అనుకూలింపని విద్య కేవలం అవిద్య.
ఆత్మ సందర్శనమునకు తోడ్పడని జ్ఞానం అజ్ఞానం.

"మనిషికి ప్రతిభ వుంటే చాలదు, దానిని సద్వినియోగం చేయాలి.

గురువు శిష్యునకు భయపడితే ప్రపంచమే వెనకకు నడుస్తుంది.

మనం మరీ మంచి వాళ్ళమో, సున్నితమైన వాళ్లమో అయితే మనం ఏదీ పొందలేం.

సమస్యలు కోతుల్లాంటివి మనం భయపడి పారిపోతున్నంత వరకు అవి మనల్ని వెంటాడి వేధిస్తాయి. వాటికి ఎదురు తిరిగితే అవే తోక ముడిచి పారిపోతాయి.

ప్రపంచంలో ఏ విలువా శాశ్వతం కాదు. శాశ్వతంగా వుండేది రాజీ పడగల నేర్పు.

దానం చెయ్యక, తాను హాయిగా అనుభవించక కూడ బెట్టిన వాడు వంచకుడు, దండానార్హుడు.

విప్లవమంటే విందు భోజనం కాదు.

రాజకీయాలంటే రక్తపాతం లేని యుద్ధం.
యుద్ధమంటే రక్తపాతంతో కూడిన రాజకీయాలు.

"అమాయకత్వం మీద తెలివైన వాడు ఆడుకొనే ఆటే రాజకీయం".

జయాపజయాలను నిర్ణయించేది మానవశక్తే గాని, భౌతిక శక్తికాదు.

వందపూలు పూయనివ్వండి. వంద రకాల ఆలోచనలు వికసించనివ్వండి, యివ్వన్నీ విజ్ఞాన శాస్త్రం, కళలు పురోగమించడానికి దోహద పడేటట్లు చూడాలి"

"శత్రువు ముందుకు వస్తే మనం వెనకకు తగ్గాలి.
శత్రువు తిష్టవేసినపుడు మనం కలవర పెట్టాలి.
శత్రువు అలసిపోయినపుడు మనం దాడి చెయ్యాలి
శత్రువు వెనుకంజవేసినపుడు మనం వెన్నాడాలి".

ఇతరుల్ని కొంచెం బాధ పెడుతూ మనల్ని ఎక్కువగా బాధపెట్టుకొనేదే త్యాగం.

వ్యాపార ప్రపంచంలో మాటమీద నిలబడే వాళ్ళు ఎక్కువ. డబ్బుపోయినా పరవాలేదు. పరువుపోతే కష్టం అనుకునే వాళ్లే రాణిస్తారు.

ఆనందమంటే ఏ లోటూ లేకపోవడం కాదు
లోటు పాట్లకు అతీతంగా మెలగగలగడం.

డబ్బు పెట్టి కొన్నవారికైనా, దర్జాగా పండించుకొన్న వారికైనా.... భుక్తం వరకే హక్కు.

నేలపాలు చేసే అధికారం ఎవరికీ లేదు'.

నీకు ఆకలవుతుంది. అన్నం తింటావు. అది ప్రకృతి.
నీకు ఆకలవుతుంది. మరొకడిని కొట్టి వాడి అన్నం నీవు తింటావు. అది వికృతి

నీకు ఆకలవుతుంది. నీ అన్నంలో కొంత మరొకడికి పెడుతూ నీవు తింటావు. అది సంస్కృతి, అదే భారతీయత.

స్త్రీ మీద గౌరవం వుండాలి. కాని అది నీ హృదయంలో వుండిపోవాలి.

ఇక్కట్లే ఎదగడానికి మెట్లు.

అనుకోని అలుపు..... అధిగమిస్తే గెలుపు.

పరాయి మోజులు ... బంధానికి బీటలు.

ఆన్‌లైను ప్రేమ... అభాసుపాలు! తస్మాత్ జాగ్రత్త.

సరదాల మోజు.... జీవితం బేజారు

గోరంత సాయం.... కొండంత స్ఫూర్తి.

యువ జనరేషన్... సేవకు సైరన్ కావాలి.

ఆశయం పవర్ ఫుల్ కష్టాలు బేఖాతర్.

నీవు బ్రతుకు... ప్రక్క వాడిని బ్రతకనివ్వు.

అపాత్రదానం అనర్థం... పాత్ర నెరిగి దానం చెయ్యి'.

అసాధ్యం అనే పదం అవివేకుల నిఘంటువులలోనే ఉంటుంది. - నెపోలియన్

# ఇంగ్లీషు అవసరం

**సౌజన్యం : ఆంగ్లశాఖ,**
**జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి కళాశాల, గుంటూరు**

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్లం నేర్చుకోవడం, మాట్లాడటం అత్యవసరం. ఆంగ్లం పెద్ద, చిన్న పల్లె, పట్నం తేడా లేకుండా చదువుకున్న వారికి, చదువురాని వారికి, అన్ని వృత్తుల, వ్యాపారాల వారికి అత్యవసరం అవుతుంది. ఆంగ్లం రాకపోతే అవకాశాలు పోయినట్లే. అంతర్జాతీయ భాషగా, బోధనాభాషగా, లింక్ భాషగా, శాస్త్ర వైజ్ఞానిక భాషగా, గ్రంథాలయ భాషగా, కంప్యూటర్ భాషగా వెలుగొందడమే కాక సగం పై చిలుకు వార్తాపత్రికలు, రేడియోలు, టీవీలు, ఇంటర్నెట్, ఉత్తర ప్రత్యుత్తరాలకు ఆంగ్ల భాషను ఉపయోగించు కుంటున్నారు. మాతృభాషలో భావవ్యక్తీకరణ సరిగా వస్తే ఇంగ్లీషు భాషలో సులభతరమౌతుంది. ఎన్నో సంవత్సరాలు నేర్చుకున్నా, ఇంగ్లీషు మీడియంలో చదివినా అడిగే ప్రశ్నలకు విద్యార్థులు సమాధానాలు ఇవ్వలేకపోతున్నారు. ఏదైన ఒక విషయాన్ని వివరించటం 'ఒక వస్తువునో, స్థలాన్నో, మనిషినో వర్ణించటం, వారిని మీరు పరిచయం చేసుకోవటం, ప్రక్కవారిని మరొకరికి పరిచయం చెయ్యటం, నలుగురితో మాట్లాడటం మొదలగునవి తెలియకపోవటం బాధాకరం.

ఇంగ్లీషు మీడియంలో చదివే వారి పరిస్థితి కూడా అంతే. ఇంగ్లీషులో మాట్లాడలేకపోవడం, మాట్లాడినా ధారాళంగా మాట్లాడ లేకపోవడం, మర్యాదలు తెలియకపోవటం, ఉత్తర ప్రత్యుత్తరాలు జరపలేకపోవడం తరచుగా గమనిస్తున్నాము.

ఎంతో అభివృద్ధి చెందిన సాఫ్ట్‌వేర్ రంగంలోని వేలమంది ఉద్యోగులకు ఆంగ్లంలో మాట్లాడటం, రైటింగ్ స్కిల్స్, స్పీకింగ్ స్కిల్స్, కాంప్రహెన్షన్ స్కిల్స్ కావాలి.

భాష రెండు రూపాల్లో ఉంటుంది. 1) మాట్లాడేది. 2) రాసేది. Spoken form లో ఉండే English ని Spoken English అంటారు. Sound అనేది Spoken English కి ప్రాణం లాంటిది. వాక్యాల్లో words ఉంటే words లో Syllables, Syllables లో Sound ఉంటాయి. రాసే బాషకు పదాలు, వ్యాకరణం రక్తమాంసాల లాంటివి.

పద సంపద (Vocabulary) ని నేర్చుకుని సాధన చెయ్యటంతో పాటు ప్రతి పదానికి సరైన ఉచ్చారణ నేర్చుకోవాలి. ఒకే మాట Noun లేదా adjective అయితే ఒకలా verb అయితే మరోలా, పలకాల్సి ఉంటుంది.

Speaking is an art' మాట్లాడటం ఒక కళ. ఆ కళకు మెరుగు పెట్టుకోటానికి అందంగా మాట్లాడటానికి నిరంతరం అభ్యాసం, చదవటం, వినటం, పదేపదే సాధన చెయ్యటం తప్పనిసరి. నీళ్ళలోకి దిగకుండా ఈత నేర్చుకోలేనట్లే, సైకిల్ ఎక్కకుండా అదితొక్కటం రానట్లే. నలుగురిలో మాట్లాడకుండా మాట్లాడటం రాదు. దానికి మనోధైర్యంతో పాటు సిగ్గు, బెరుకు, మోహమాటం, భయం, అపనమ్మకం, న్యూనతాభావం మొదలగునవి ఉండకూడదు. చాలామంది విద్యార్థులు ప్రక్కన వాడు ఏమనుకుంటాడే అనో, ఏమైనా comment చేస్తారనో, style అనో, పోజ్ అనో అంటారేమోననే ఆలోచనతో మనసులో ఇంగ్లీషులో మాట్లాడాలని ఉన్నా పైకి మౌనంగా ఉంటుంటారు. వీటన్నిటినీ అధిగమించినపుడే ఫలితం ఉంటుంది. తోటివాళ్ళతో మాట్లాడటం అత్యవసరం. మాటలు వినటం, ఆలోచించటం, అర్థం చేసుకోవటం, తిరిగి మాట్లాడటం సంభాషణ మెరుగు అవటంలో భాగాలే.

సరైన పద్ధతిలో మాట్లాడటం అనేది కొంత సాధన ద్వారా వస్తుంది. మాటల మధ్య వచ్చే వ్యవధి వల్ల కూడా అర్థాలు మారటమో, అపార్థాలు కలగటమో జరుగుతుంది.

నిజాయితీ, నిబద్ధత, అంకితభావం విజయ రహస్యాలు. శ్రమకొద్దీ ఫలితం ఉంటుంది. భాష రావటమనేది నేర్చుకోవాలి అనే తపన తీవ్రతని బట్టి పెట్టుకున్న లక్ష్యం. ఆవశ్యకతలపై ఆధారపడి ఉంటుంది. మాట్లాడే భాష బాగా రావాలను కొనేవాళ్ళు రోజుకో ఇంగ్లీష్ మాట, దాని అర్థాలు, ప్రత్యేకార్థాలు, ఉచ్చారణ నేర్చుకోవాలి. రోజూ ఇంగ్లీషు చదవాలి. ఉదా: పత్రికలు, కథలు, ఇంగ్లీషు దూరదర్శన్ టి.వి.లో వినాలి. వారానికి ఒక వ్యాసం దాని సారాంశం, సమీక్ష రాసుకోవాలి. ఒక డైరీలో రాసుకుని మళ్ళీ మళ్లీ గుర్తుచేసుకోవాలి. అద్దం ముందు నుంచుని 5 ని॥ ప్రతిబింబం చూస్తూ మాట్లాడితే - హావభావాలను గమనించుకొనే వీలుంటుంది. మొహమాటం తగ్గుతుంది. తమ మీద తనకి నమ్మకం పెరుగుతుంది.

ఏమీ లేని ప్రతికూల ఆలోచన కంటే కొంచెం అయినా ఉన్న సానుకూల ఆలోచన మేలు. - ఎల్బర్ట్ హబ్బర్డ్



## మాట



మనసుల్ని కలిపేది,
మనుషుల మధ్య విస్ఫోటాలు కలిగించేదీ
అపార్థాలు రగిలించేది, అనర్థాలు సృష్టించేదీ
ఓదార్పునిచ్చేదీ, ప్రేమను పంచేదీ
ప్రపంచాన్ని చూపేదీ 'మాటే'

మాట 'మాటకీ', ఉందెంతో తేడా
పలికే మనిషిలో, పలికించే గొంతులో
పలుకుతున్న రీతిలో
గూఢార్థాలు, అనంత అర్థాలు....
తీసెయ్యలేం 'మాటేగా అని'
పెట్టెయ్యలేం ప్రక్కన, ఏముందిలే 'మాటేగా' అని

మాటకున్న బలం మరి దేనికుంది లోకంలో?
తూటాకన్నా దృఢమైనది, కత్తికంటే పదునైంది
తేనెకంటే తియ్యనైందీ, వెన్నకంటే మృదువైనదీ
మాటలేనిదే లేదు మనుగడను మనిషికి
మాటతో శాసిస్తాం, మాటలతోనే శ్వాసిస్తాం

సంత్ తుకారం మాటల్లో చెప్పాలంటే
నా దగ్గరున్న సంపద అంతా మాటలే
నేను ధరించేది మాటలనే
నా జీవన మనుగడకు పోషించేది మాటలే
ప్రజల మధ్య నేను పంచేది పదాల సంపదనే.

## గుంటూరు



పాడిపంట పొంగిపొరలు
పల్లెలెన్నొ చుట్టి కొలువ
హారములో మేరువుగా
అలరారును గుంటూరే!



ఎండుమిరప ఘాటునైన,
మండుటెండ ధాటినైన
తట్టుకొనెడు దిట్టలుండు
పట్టణమ్ము గుంటూరే!

విద్యలందు, వైద్యమందు,
వివిధసంఘ సేవలందు
కరుణామయు స్మరణ సేయు
పురమాయెను గుంటూరే!

సామాజిక రాజకీయ
చైతన్యము ప్రస్ఫుటించు
ఉద్యమాల కెన్నిటికో
ఉనికిపట్టు గుంటూరే!



మతసాంఘిక కలహాలను
మాపగల్గు కవనాలను
కవిబ్రహ్మ కడనెన్నడొ
కనుగొన్నది గుంటూరే!

వీసమేని ఏసలేని
వినసొంపగు తెనుగుబాస
నలవోకగ తనగళమున
బలుకునదీ గుంటూరే!



అటు తీర్థుల తరంగముల,
ఇటు దాసుల కీర్తనముల
వెలికివచ్చి రాకమున్నె
వినియున్నది గుంటూరు!

తెనుగువాని కెవనికేని
తనసొంతమె యీప్రాంతము
అనిపించెడు ఆత్మీయత
నందించును గుంటూరే!

– ధనేకుల వెంకటేశ్వరరావు

మిత్రమా, నీ దగ్గర నుంచి ఇతరులు తీసుకువెళ్ళిన దాని గురించి ఆలోచించకు, నీ దగ్గర మిగిలి ఉన్న వాటితో ఏమి చేయాలో ఆలోచించు.

## ఆ ఆరుగురి స్నేహం....



'నోర్మూయ్... భడవ.. చెప్పి, చెప్పి నా నోరు నొప్పెడుతుంది. చదువు సంధ్యలు మానేసి, ఏం చెయ్యాలని? ఎల్లకాలం వండి వార్చే వారుండరు... చదువు లేకపోతే అడుక్కు తినాల్సి వస్తుంది' సుప్రభాతం కంటే ముందే మొదలయింది అన్నపూర్ణ సతాయింపు.

'మార్కులు బాగా వస్తున్నా, నీ దండయాత్రలు ఆపవా' అమ్మను అర్థిస్తున్నట్లు మెల్లగా గొణిగాడు చందూ.

'ఆ.. వస్తున్నాయిలే! బోడి 80 మార్కులు.అవి కూడా ఒక మార్కులేనా? ఓ మాష్టారి అబ్బాయికి ఆ మార్కులా? ఇక మీ నాన్నగారి పరువేం కాను. నీ కంటే చిన్నది మన గాయత్రికి 95కు ఎప్పుడూ తగ్గలేదు. అంటూ దండకం కొనసాగించింది అన్నపూర్ణ.

'అమ్మ ఎప్పుడూ ఇంతే' అంటూ చందు బ్యాగ్ భుజాన తగిలించుకుని బయటికి జారుకున్నాడు.

'అలా కసురుకుని చెప్పేకంటే, అనునయంగా అర్థం చేసుకునేటట్లు చెప్పటం మంచిది' అన్నారు రాఘవయ్య మాష్టారు. 'మీరు చెప్పరు, నన్ను చెప్పనివ్వరు. వాడు పూర్తిగా చెడిపోయే వరకు గారాబం చెయ్యటం మాత్రం మీ ఒక్కరికే సాధ్యం' అంటూ కసిగా చూసింది అన్నపూర్ణ. 'అదికాదే' ---- అనే లోపునే వంటింట్లోకి వెళ్ళిన అన్నపూర్ణ పోపు తాళింపు చిటపటల ధ్యాసలో మునిగిపోయింది. 'భార్య కోపానికి అంతం లేదా? ఎందుకు అంతగా విసుక్కోవటం. పసివాడి మనసు గాయపడితే? వాడు ఏమైపోతాడు'? మాష్టారి మస్తిష్కంలో ఆలోచనా పరంపర మొదలైంది.

ఓ పోలీసు నేరస్తుడిని దండిస్తే, మరో కానిస్టేబులు బుజ్జగించే మాటలు చెప్పే పోలీసు విధానం గుర్తుకు వచ్చింది మాష్టారికి. నేరస్తుడు ఎవరో ఒకరికి దగ్గరై నిజం బయట పెట్టినట్లు, చందూ కూడా అటు తల్లికి లేదా తనకు దగ్గరై మార్గం సుగమం కావచ్చు కదా అని అప్పటికి సరిపెట్టుకున్నారు మాష్టారు. కాలేజికి వెళ్ళిన చందు మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. 'ఏరా ... ఏమైంది అపుడే వచ్చావ్' అంటూ అడిగింది అన్నపూర్ణ.

"అమ్మా, ఇవాళ మా కాలేజి వార్షికోత్సవం, కొత్త పిన్సిపాలు గారు మా అందరినీ తల్లిదండ్రులతో సహా తప్పక రమ్మన్నారు"

చందు గాయత్రి, అన్నపూర్ణతో పాటు, రాఘవయ్య మాష్టారు 4.30 గంటలకు బయలుదేరి కాలేజికి వెళ్ళారు. అప్పటికే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఖాళీగా వున్న కుర్చీలు చూసుకుని మాష్టారి కుటుంబం కూడా కూర్చుంది. ప్రిన్సిపాల్ రామమోహనరావుతోపాటు, పలువురు అధ్యాపకులు, పెద్దలు, విద్యార్థి నాయకులు, తమ సందేశాలను తెలియజేశారు. అనంతరం రిటైర్డ్ ప్రిన్సిపాల్ మూర్తి గారిని పరిచయం చేస్తూ గమ్యాన్ని

నిర్దేశించుకో, సమయపాలన, భావ వ్యక్తీకరణ లాంటి గ్రంధాలను రచించారని, ఇప్పుడు వారు ప్రసంగిస్తారని అనటంతో అందరు ఆసక్తిగా ఆవైపు చూశారు.

సభా సాంప్రదాయలను ముగించిన అనంతరం మూర్తి తన ఉపన్యాసాన్ని గంభీరంగా ప్రారంభించారు. 'జీవితంలో గొప్పగా ఎదగాలన్న తపన, మంచి హోదా, సంపద కలిగి ఉండాలన్న ఆశ, ప్రతి ఒక్కరిలో ఉండటం సహజం.

'నిజానికి అలాంటి భావాలు ఉండటం అత్యవసరం. మనిషి ఎదుగుదలకు ఒక గొప్ప లక్ష్యం ఉండాలి. గొప్ప లక్ష్యం కలిగి ఉండటం ఎంత ముఖ్యమో, దాని సాధనకు - అది కార్యరూపం ధరించటానికి చేయవలసిన కృషి కూడా అంతే అవసరం. ఆ లక్ష్య సాధనలో అపజయాలను ఎదరించగల మనోబలం కలిగి ఉండాలి.

'చదువు కంటే వ్యాకులపాటు వల్లనే ఎక్కువమంది విఫలమై పోతున్నారు. చదవటం మరచిపోయి వ్యాకులం చెందటమే అందుకు కారణంగా ఉంది.

'విద్యుత్ బల్బు తయారీలో థామస్ ఆల్వా ఎడిసన్ ఒకటి రెండు సార్లు కాదు పదివేల పర్యాయాలు విఫలం అయ్యాడు. అనంతరమే విజయం లభించింది. ఏకలవ్యుని జీవితం మనకు నేర్పేది ఈ సత్యాన్నే. మనలోని పిరికితనాన్ని, అలసత్వాన్ని, నైరాశ్యాన్ని తరిమికొట్టటం నేర్చుకోవాలి. మన ఆలోచనలే మన వ్యక్తిత్వాన్ని రూపొందిస్తాయి.

'మానవ శరీరం అంతా దైవ నిర్మితమే, కాని మనిషి మనసు ఒక్కటి మాత్రం మానవ శోభితం, మనసును మంచి ఆలోచనలతో నింపి పురోగమించు. అదృష్టం నీ నొసట లేదు, అది నీ చేతుల్లోనే వుంది. పని చేస్తే ఉక్కులా తయారవుతావు. చేయకుంటే తుప్పుగా మిగిలిపోతావు'

'ఇక సమయపాలన అనేది విద్యార్థికి ఎంతో అవసరం. ఒక పనిని నిర్దిష్ట సమయంలో క్రమపద్ధతిలో నిర్వహించటం నేర్చుకోవాలి. విజేతకు పరాజితునికి మధ్య వ్యత్యాసం కేవలం 15 నిముషాలు అంటాడు నెపోలియన్. విజేత చదివిన చదువును సమీక్షించుకుంటాడు. టైంటేబుల్‌ను నియమబద్ధంగా పాటించటమే సమయపాలన సారాంశం. అదే గెలుపు పిలుపు. జీవితం పరమపదసోపాన పటం లాంటిది. కృషిని కబళించే పాములు ఉంటాయి. ప్రోత్సహించే నిచ్చెనలు ఉంటాయి. నిరుత్సాహపడకుండా ముందుకు సాగిపోతూ లక్ష్యాలను సాధించాలని' చెప్పి మూర్తి తన ప్రసంగాన్ని ముగించారు.

**ఏమిటి? ఎందుకు?**

**ఎప్పుడు? ఎలా?**

**ఎక్కడ? ఎవరు?**

ఆ రోజు నుంచి చందు ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఆత్మ విశ్వాసంతో, సమయాన్ని సద్వినియోగ పరుచుకున్నాడు. పరీక్షల అనంతరం ఫలితాలు వచ్చాయి. 93 శాతం మార్కులతో చందు, తల్లిదండ్రుల ముందు తలెత్తుకు నిలబడ్డాడు. రాఘవయ్య ఓ ప్రైవేటు ఎలిమెంటరీ స్కూలు మాష్టరు కావటంతో అమ్మాయిని చదివించలేనంటూ తలదించుకున్నాడు.

'ఉన్న ఆస్తిని అమ్మి పిల్లలు ఇద్దరిని చదివిద్దాం' అంటూ అన్నపూర్ణ పట్టుబట్టింది.

'ఉన్నది కాస్తా అమ్ముకుంటే ఆడపిల్ల పెళ్ళి ఎలా చెయ్యాలి' మాష్టారి ప్రశ్న.

'ఉద్యోగాలు చేసుకుని వాళ్ళే అంతో ఇంతో సంపాదిస్తారు. అనే తీర్మానానికి ఇద్దరు వచ్చి పై చదువుల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎక్కడ చేర్చాలి, హాస్టలు ఖర్చులు ఎంత అంటూ అన్వేషణ ప్రారంభించిన సందర్భంలో శంకరరావు మాష్టారు తటస్టపడి గుంటూరు కమ్మజన సేవాసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టల్ గురించి చెప్పారు. దాని ప్రస్తుత అధ్యక్షులు బలరామకృష్ణయ్య. ఆయనకు పెద్ద చదువులేదు. తండ్రి

అర్ధంతరంగా చనిపోవడంతో ఇంటి బాధ్యతలు చదువుకు దూరం చేసాయి. కెరటం నా ఆదర్శం, లేచి పడినందుకు కాదు, పడినా లేచినందుకు అంటారు ఆయన. అదే ఆదర్శంతో గొప్ప పారిశ్రామికవేత్త అయ్యారు.

తాను చదువుకోలేక పోయినా, చదువుకునే వారిని, అందునా బీద విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు అని చెప్పిన శంకరరావు మాష్టారు, రాఘవయ్యను పరిచయం చేసి ఆయన ఆర్థిక ఇబ్బందులను ఏకరువుపెట్టారు. ఏమిటి?, ఎందుకు?, ఎప్పుడు?, ఎలా?, ఎక్కడ?, ఎవరు?, అనే ఆరుగురి స్నేహం మరువనందు వల్లనే ఇంతవాడిని అయ్యానని, బలరామయ్య అంటారు. విద్యార్థులు తమ చదువుల విషయంలో కూడా ప్రతి దాన్ని విశ్లేషిస్తూ ఈ ఆరుగురితో స్నేహం తప్పక చెయ్యాలని ఈ ప్రశ్నలతో అధ్యాపకుల నుంచి విజ్ఞానాన్ని అందిపుచ్చు కోవాలన్నారు. గాయత్రికి ప్రతిభ ప్రాతిపదికన హాస్టల్ సీటు దొరికింది. భారం సగం తగ్గి కళ్ళు చెమర్చాయి.



**కె.వి.కె. రామారావు**
విశ్రాంత గ్రంథాలయ అధికారి
ఎస్.ఎస్.ఎన్. కళాశాల,
నరసరావుపేట.
విశ్రాంత ఈనాడు సీనియర్ విలేఖరి

ఒక గంట సమయం వృధా చేసేవ్యక్తికి జీవితపు విలువ తెలియదు. **- చార్లెస్ డార్విన్**



# ప్రశ్న

**నార్ల వెంకటేశ్వరరావు**

పరమ పూజనీయ గురుపాదు లార్గురి
చెప్పమన్న పేర్లు చెప్పవచ్చు.
"ఎందుకెప్పు డేమి టెచ్చ టెట్టు లెవరు"
నవయుగాల బాట నార్ల మాట

"ఏల, ఎప్పు, డెవ్వ" డిత్యాది ప్రశ్నలే
పశువు నుండి వేఱుపరచె నరుని;
ప్రశ్నతోనె నరుడు పరిణామ మందెరా! ॥నవయుగాల॥

వేయి ప్రశ్నలుండు విజ్ఞానవేత్తకు;
ప్రశ్న లుండబోవు పామరునకు;
విజ్ఞు డౌను నరుడు జిజ్ఞాస చేతనే ॥నవయుగాల॥

ప్రశ్న అడిగినవాడు 5 నిమిషాలపాటు తెలివితక్కువవాడు అనిపించవచ్చు. అడగనివాడు ఎప్పటికీ తెలివి తక్కువవాడిగానే మిగిలిపోతాడు. ప్రశ్నించటానికి వెనకాడకు, భయపడకు. తెలియక పొరపాట్లు చేయటం కంటే ప్రశ్నించి తెలుసుకోవటం మేలు కదా!

ప్రశ్ననుండి పుట్టు పరిణత జ్ఞానమ్ము,
ప్రశ్నతోడ పెరుగు ప్రాభవమ్ము;
ప్రశ్నలేక ప్రగతి ప్రశ్నార్థకమ్మురా; ॥నవయుగాల॥

ప్రశ్నతోనె రేగు వాదోపవాదాలు,
ప్రశ్నతోనె బుద్ధి పదును తేరు,
ప్రశ్నతోనె జ్ఞానపరిధులు పెరుగురా ॥నవయుగాల॥

ప్రశ్నలెన్నొ లేక, పరిశోధనము లేక
విరివి గాంచ వెట్టి విద్యలైన;
ప్రశ్న లేనినాడు పరిణతి లేదురా! ॥నవయుగాల॥
ప్రశ్న తీరుబట్టి ప్రశ్నించు మానిసి
తెలివితేట లేవొ తేల్చవచ్చు;
చొప్పుదంటు ప్రశ్న మొప్పెకే తగునురా! ॥నవయుగాల॥

పరుల స్వేచ్ఛ కొక్క ప్రతిబంధకమ్ముగా నిలువరాదు సుమ్ము నీదు స్వేచ్ఛ - నార్ల

## యువతలో జీవన నైపుణ్యాల అభివృద్ధి



సఫల జీవితానికి అంటే విద్యాపరంగా, సామాజికంగా, కుటుంబపరంగా, వృత్తిపరంగా, బహుముఖాలలో సమాజంలో పరిపూర్ణ పౌరులుగా జీవించటానికి సన్నద్ధం చేస్తుంది చదువు. విద్య వ్యక్తులలో నిద్రాణంగా దాగివున్న సామర్థ్యాలను వెలికితీస్తుంది. వాటిని జీవితంలో అవసరమైన చోట ఉపయోగించి జీవితాన్ని సుఖమయంగా, సమతుల్యంగా చేసుకోవటానికి దోహదపడుతుంది. ప్రపంచీకరణ, స్వేచ్ఛీకరణల నేపథ్యంలో, శాస్త్ర సాంకేతిక, సమాచార రంగాల ప్రగతి వల్ల సామాజిక, ఆర్థిక మార్పులు వేగంగా వస్తూ జీవితానికి సవాళ్లుగా ఎదురు నిలుస్తున్నాయి.

ఈ నేపథ్యంలో జీవన నైపుణ్యాల ఆవశ్యకతను గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ పది ముఖ్య నైపుణ్యాలను గుర్తించింది. అవి

1) సృజనాత్మక ఆలోచన
2) విమర్శనాత్మక ఆలోచన
3) నిర్ణయాత్మక శక్తి
4) సమస్యాపరిష్కార శక్తి
5) సమర్థవంతమైన భావవ్యక్తీకరణ
6) ముఖాముఖి (ప్రత్యక్ష) సంబంధాలు
7) సహానుభూతి
8) స్వీయ అవగాహన
9) భావోద్వేగాల సర్దుబాటు
10) ఆందోళనతో సర్దుబాటు

వీటిలో మొదటి నాలుగు కాగ్నిటివ్ నైపుణ్యాలు. స్వీయ అవగాహన, సహానుభూతి మనకు సహజంగా వచ్చేవి. మిగతా సామాజిక నైపుణ్యాలను మనం నేర్చుకోవాలి.

స్వీయ అవగాహన ముఖ్యమైన జీవన నైపుణ్యం. దీనివల్ల మనం ఏమిటో, ఎక్కడ ఉన్నామో, ఎలా ఉన్నామో, ఎందుకు ఇలా ఉన్నామో, మన శక్తియుక్తులు ఏమిటో తెలుపుతుంది. స్వీయ అవగాహన అంటే ఎవరికి వారు ఆలోచనలు, అనుభూతులు ప్రవర్తనలలో తమ బలాలు, బలహీనతలు, తమకు ఉన్న సంపదలు, బాధ్యతలు తెలుసుకొని అటు సందర్భానుసారంగానూ, ఇటు అంతరాంతరాలలో తమను తాము అవగతం చేసుకోవటానికి వీలు అవుతుంది. కొన్నిసార్లు మనను మనం అతిగా అంచనా వేసుకుంటాం. శక్తికి మించిన ఆశయాలను ఎంచుకొని వాటిని చేరుకోలేక వైఫల్యాలను పొంది మానసికంగా కుంగిపోతుంటాం. కొన్ని రంగాలలో మనకున్న నైపుణ్యాన్ని అన్ని రంగాలలో ఉందని అన్వయించుకోగూడదు. అలాగే కొన్ని సార్లు మనకు యదార్ధంగా ఉన్న బలాలను కూడా గుర్తించలేక ముందుకు అడుగు వేయలేకపోతాము, అవకాశాలను చేజార్చుకుంటాం.

ఈ నైపుణ్యం జీవితవాస్తవాలను ఎదుర్కొనే సంస్కృతిని అందిస్తుంది. ఇతరులను అర్థం చేసుకోవటానికి వీలు కలిగిస్తుంది. గతంలో జరిగిన పొరపాట్లను గురించి విచారిస్తూనో, రాబోయే ప్రమాదాలను అతిగా ఊహించుకుంటూనో శక్తి సామర్థ్యాలను వృధా చేసుకోకుండా, ప్రస్తుత పరిస్థితులలో జీవించటానికి, ఊహలలో కాక వాస్తవలోకంలో జీవించటానికి దోహదపడుతుంది. గతంలో విహరిస్తుంటే ఆందోళన, నిస్సహాయతలు కలుగుతాయి. ఆలోచనాశక్తికి గ్రహణం పట్టినట్లయి నిరాశాపూరిత భావాలు పెరుగుతాయి. ఈ నైపుణ్యం వల్ల తన పాత్రను, భాద్యతలను ఆదమరవకుండా ఉంటాము.

మానవునికి జ్ఞాపకశక్తి ఒక వరం. సృజనాత్మకత కూడా ఒక సహజ శక్తి. అయితే అది అందరిలో ఒకే రీతిలో ఉండదు. ఉన్నవారు కూడా దానిని ఉపయోగించుకోరు. సృజనాత్మకత అంటే వేరు వేరు రకాలుగా ఆలోచించటమే. కొత్త ఆలోచనల ద్వారా కొత్త మార్గాలను తెలుసుకోవటం, పాత మార్గాలకు కొత్త మెరుగులు దిద్దటం, ప్రత్యామ్నాయ విధానాలను కనుక్కోవటం. దీనిని జీవితంలో అన్ని రంగాలలో ఉపయోగించవచ్చు. తాను గీసుకున్న గిరులను మించి సాధించవచ్చు. ఇందుకు ఆసక్తి కావాలి. కొత్త మార్గంలో ప్రయాణం చేయటానికి భయపడకూడదు.

విమర్శనాపూర్వక ఆలోచన అంటే కేవలం తప్పులు వెదకటం, నైరాశ్యంతో చూడటం కాదు. అది విలువను మదింపు చేయటం. ఈ తరం యువత ప్రతిదానినీ గత తరాలకంటే ఎక్కువగా ప్రశ్నిస్తుంది. మంచి, చెడు ఆలోచించకుండా గుడ్డిగా దేనినీ నమ్మటం లేదు. కాని భిన్నకోణాల నుంచి ఆలోచించకుండా, అందుబాటులో గల సమాచారాన్ని అంతా సేకరించకుండా, నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాము చేయదలచుకున్న పనికి అనుకూలంగా సమాచారం సేకరిస్తుంటారు. అలా కాక బాగోగులను విశ్లేషించుకొని నిర్ణయాలు తీసుకోవాలి. ప్రకటనలకు, ఇతరుల అభిప్రాయాలకు ప్రభావితులు కాకుండా, దేనినీ సంప్రదాయం అనో, నిర్హేతుకంగానో నమ్మగూడదు. భావోద్వేగాలకు లోనయి నిర్ణయాలు తీసుకోకూడదు. చదువుకుంటున్న వారు బాధ్యతలను గుర్తుంచుకోవాలి.

జీవితంలో చిన్నవి, పెద్దవి రకరకాల నిర్ణయాలు తీసుకోవలసి రావటం నిరంతర ప్రక్రియ. ప్రయాణం రైలులో చేయాలా, బస్సులోనా, ఏ రకం బస్సులో, ఎప్పుడు అనేది కూడా. మనకు అందుబాటులో గల అనేక విధానాలలో ఒకదానిని ఎంచుకుంటాం. అలాగే ఏ హోటల్‌కు వెళ్ళాలి. ఏ పలహారం తీసుకోవాలి, ఏ కలం కొనాలి వంటివి చిన్న చిన్న రోజువారీ నిర్ణయాలు, తరువాత ఏ కోర్సు చదవాలి, ఎక్కడ చదవాలి, జీవిత భాగస్వామిగా ఎవరిని ఎంచుకోవాలి అనేవి కీలక నిర్ణయాలు.

సామాజిక, ఆర్థిక నిర్ణయాలను ఆయా బృందసభ్యులు కలసి తీసుకుంటారు. తరగతికి నాయకత్వం ఎవరు వహించాలి, కుటుంబ ఖర్చులు ఎలా చేయాలి, అని చేసేవి. సమన్వయ నిర్ణయాలు పెద్ద పనిని కొందరు కలసి చేయవలసినపుడు ఎవరు ఏ పని ఎలా చేయాలి అని నిర్ణయించుకోవటం. నిర్ణయం చిన్నదైనా, పెద్దదైనా దానిని తీసుకోబోయే ముందు నిజాయితీగా, సంబంధించిన సమాచారాన్ని అంతా సేకరించుకున్న పిమ్మటనే మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడే తీసుకోవాలి. బయటి వత్తిళ్ళకు ప్రభావితం కాగూడదు. చేయాలనిపిస్తుంది కనుక చేయగూడదు. తరగతులకు దుమ్మా కొట్టి సినిమాకు వెళ్లాలని స్నేహితుల వత్తిడివల్ల ఒప్పుకోవద్దు. దాని వల్ల నీవు కోల్పోయేది ఏమిటి, పొందేది ఏమిటి అని బేరీజు వేసుకొని మాత్రమే చేయాలి. మొహమాటం కోసం రానంటే స్నేహితురాళ్లు బాధ పడతారని మాత్రం నిర్ణయం తీసుకోగూడదు. సాధన ద్వారా ఈ నైపుణ్యాన్ని పెంచుకోవాలి. ఒకోసారి నీవు తీసుకున్న నిర్ణయాలు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవచ్చు. నీ నిర్ణయాన్ని సరిచేసుకోవచ్చు. మార్చుకోవటానికి వెనకాడ కూడదు.

సమస్యలు - అవి వ్యక్తిగతమైనవి, విద్యాపరమైనవి, సామాజిక పరమైనవి ఏవైనా జీవితంలో తారసపడటం సహజం. వీటి వల్ల కొంత అసౌకర్యం, ఆందోళన, ఒత్తిడి కలిగి సాధారణ విధులకు ఆటంకం కలగవచ్చు. సమస్యలేని జీవితం ఉండదు. సమస్యలు కొన్నిసార్లు ప్రగతికి అవకాశాలు కూడా కావచ్చు. ప్రతిదానికీ ఇతరులమీద ఆధారపడేవాళ్లు ప్రతిమార్పును ఒక సమస్యగా భావిస్తారు. సమస్యను చూసి భయపడి పారిపోతారు. **సమస్యా పరిష్కార నైపుణ్యం** అంటే దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్య తీవ్రతను, దాని స్వభావాన్ని తెలుసుకొని దానితో జీవించటం/ ప్రభావాన్ని తగ్గించుకోవటం/పూర్తిగా పరిష్కరించుకోవటంలో ఏదో చేయటం.

దైనందిన జీవితంలో **భావప్రసారణ** అంటే ఒకరితో మరొకరు సమాచారాన్ని పంచుకోవటం, తన భావాలను ఇతరులకు, రాత/మాటలు/శారీరక సంకేతాలతో స్పష్టంగా చెప్పగలిగే నైపుణ్యం. అలాగే ఇతరుల భావాలను, శారీరక భంగిమలను, వారు అందించిన సమాచారాన్ని అర్థం చేసుకోగలగటం. ఇందుకు ఎదుటివారు చెప్పే దానిని మధ్యలో ఆపకుండా, శ్రద్ధగా వినాలి. వాళ్లు చెప్పేటప్పుడు ఎటో చూడటం, ఏదో ఆలోచించటం, సమయం



నైపుణ్యాలు ఉండగానే సరిపోవు.
వాటిని సరిగా వినయోగించుకోగలిగితేనే
విజయం నిన్ను వరిస్తుంది.



చూసుకోవటం చేయగూడదు మనం అందజేయవలసిన సమాచారాన్ని మొత్తాన్ని పూర్తిగా అందించి ఎదుటివారి నుంచి ఆశించిన ఫలితాన్ని పొందగలగటవే భావప్రసారణ నైపుణ్యం.

ఈ 21వ శతాబ్దంలో **విద్య లక్ష్యం కలసి బ్రతకటం నేర్చుకోవటమే.** ఇది విద్యకు ఒక మూలస్థంభం. మిగతా మూడు, తెలుసుకోవటం, చేయటం, మనుగడ సాగించటం నేర్చుకోవటం. సుహృద్భావ వాతావరణంలో ఆరోగ్యకరమైన సంబంధాలను కొనసాగించటమే ముఖాముఖి/ప్రత్యక్ష సంబంధాల నైపుణ్యం. ఇతరులతో కలసి వారి ఆనందాలను, పంచుకోవటం, కష్టాలలో, సుఖాలలో సహానుభూతి చూపాలి. భిన్న సామాజిక నేపథ్యాలలో ఎదుటివారి అనుభూతులు, భావోద్వేగాలు, అవసరాలు, అభిప్రాయాలు, సమస్యలను గ్రహించి సత్సంబంధాలను కొనసాగించగలగడమే ఈ నైపుణ్యం. నీ ప్రవర్తన సామాజికంగా ఆమోదకరంగా ఉండాలి. కలసిమెలసి ఉంటున్నప్పటికీ తగు దూరంలో ఉండాలి.

సహానుభూతి అంటే ఇతరుల లాగా అనుభూతి చెందగల సామర్థ్యం. ఆపదలో, అవసరాలలో ఉన్న వారిని చూసి వారి బాధలు తమవిగా అనుభూతి చెందగల శక్తి. ఇది జాలి చూపటం కాదు. దానం, ధర్మం చేయటం కాదు. వారి బాధలను పంచుకోవటం.

భావోద్వేగాలకు అనుగుణంగా సర్దుబాటు చేసుకోగల్గటం కూడా ఒక అవసరమైన నైపుణ్యం. యువతలో మనోభావాలు తీవ్రంగా ఉంటాయి. వారు చెప్పేది వినాలని, ప్రశంసించబడాలని, అభిమానింప బడాలని, అర్థం చేసుకోబడాలని అందరి లాగా కంటే కాస్త ఎక్కువగా కోరుకుంటారు. కాని అవి ఆశించిన మేరకు ఎక్కువ కాలం అందకపోతే నిరాశకు, అసంతృప్తికీ గురి అయి దానిని ఇతరుల మీద కోపం, అసూయ రూపంలో వ్యక్తం చేస్తారు. అటువంటి పరిస్థితుల్లో సర్దుబాటు చేసుకోగల నైపుణ్యం పెంచుకోవాలి. కోపం అవసరమైనా దానిని తగు మాత్రమే, తగు సమయంలో అవసరమైన వారి పైననే చూపాలి. వాస్తవానికి కోపాన్ని నటిస్తే చాలు. నిజంగా కోపపడగూడదు. దానిని పరిమితంగా ఔషదంలా వాడటం నేర్చుకోవాలి. ఉద్వేగాలు నిన్ను నియంత్రించకుండా చూసుకోవాలి. అలాకాకపోతే శారీరక ఇబ్బంది మానసిక సమస్యకు దారి తీయవచ్చు.



డా॥ అరుణ మోహన్ గోగినేని
రిటైర్డ్ రీడర్,
సెయింట్ జోసఫ్
కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్,
గుంటూరు. సెల్ : 9866117137

## మంచి ఆలోచనలు

సర్వ జీవరాశిలో ఆలోచించే శక్తి కేవలం మనిషికి మాత్రమే వుంది. మనిషి జీవిత దిశను నిర్దేశించడంలో ఆలోచనలు ప్రధానపాత్ర నిర్వహిస్తాయి. మంచి ఆలోచనల వల్ల ప్రాణానికి బలం చేకూరుతుందని వేదాలు చెబుతున్నాయి. ప్రతి వ్యక్తి మంచి గురించే ఆలోచించాలి తప్ప చెడుకు స్థానమివ్వకూడదు. చెడ్డ తలంపులేని ఆలోచనలే గెలుపునందిస్తాయి. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకునే ఏ పని చేయాలన్నా బాగా ఆలోచించి మంచి బుద్ధితో అడుగు ముందుకు వేయమన్నారు అనుభవజ్ఞులు.

ఆలోచించడం మనస్సుధర్మం. ఏదైనా ఒకపని చేపట్టి అందులో గెలుపు సాధించాలంటే చక్కటి ఆలోచనలను ఏకాగ్రపరచాలి. ఒకే స్థలంలో పడే నీటిధార కఠినమైన రాయిని సైతం అరగదీస్తుంది. మంచి ఆలోచనలు నిరంతరం ఏకాగ్రచిత్తంగా వుంటే ఎంతటి బాధనైనా, కష్టాన్నయినా మనిషి సులభంగా ఎదుర్కోగలడు. మంచి ఆలోచనలను ఒకచోట కలపడం ద్వారా అంతులేని శక్తి ఉత్పన్నమవుతుంది. తద్వారా అనుకున్న కార్యం నిరాటంకంగా నెరవేరుతుంది. గెలుపు మనదవుతుంది.

మంచి ఆలోచనలకు స్వేచ్ఛనిస్తే కోర్కెల రూపాన్ని ధరిస్తుంది. ఫలిస్తుంది. కార్యం సిద్ధిస్తుంది. ఈ అలవాట్లు కొన్నాళ్లకు వాస్తవరూపం దాల్చి మనిషిని ఓ ఉన్నత శిఖరంపై కూచుండబెడతాయి. *

## విద్యాధనం

మనిషిని ఏది బంధాల నుంచి దూరం చేస్తుందో అదే విద్య' అని చెబుతారు. ఈ ఒక్కమాటతో విద్యకు నిర్వచనం పూర్తయింది. విద్య కేవలం బంధవిముక్తి చేయడమే కాకుండా ఇంకా ఎన్నో ప్రయోజనాలను సాధించి పెడుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు. ధనం ఖర్చుపెడుతున్న కొద్దీ తరిగిపోతుంది. విద్య ఖర్చు పెడుతున్నకొద్దీ పెరుగుతుంది. ధనాన్ని దాచుకుంటే పెరుగుతుంది. కానీ విద్యను దాచేస్తే తరిగిపోతుంది. ఇదే విద్యకూ, ధనానికీ ఉన్న తేడా, ధనాన్ని దొంగలు అపహరిస్తారు. ధనాన్ని పాలకులు తీసుకుంటారు. అన్నదమ్ములు పంచుకుంటారు. ధనాన్ని మోసుకొని పోవడం కష్టం. అయితే విద్యాధనాన్ని ఎవరూ దొంగి లించలేరు. ప్రభువులు గుంజుకోలేరు. అన్నదమ్ములు పంచుకోలేరు. విద్యను మోయడం సులభమే. అందువల్ల అన్నిధనాల్లోనూ విద్యాధనమే శ్రేష్ఠమైందని మహాకవులు అంటారు.

విద్యావంతుడు మణిలాంటివాడు. మణి ఎల్లప్పుడూ ప్రకాశిస్తూనే వుంటుంది. దానికి అన్ని కాలాల్లోనూ విలువ ఎక్కువే. విద్యాహీనుడు మట్టిముద్ద లాంటివాడు. మట్టిలో ఏదీ ప్రతిఫలించదు. ప్రకాశించదు. విద్యాహీనుడు మూర్ఖుడే. గురువు మూర్ఖుడికీ, సూక్ష్మగ్రాహికీ సమానంగానే విద్య నేర్పుతాడు. చురుకైనవాడు ఆ విద్యను చక్కగా నేర్చుకోగలుగుతాడు. మందబుద్ధి అయిన మూర్ఖుడు నేర్చు కోలేడు. గురువు చదువు చెప్పగలడేకాని, స్వభావాలను మార్చలేడు.

చదువు తల్లివలె రక్షిస్తుంది. తండ్రివలె మేలు చేకూరుస్తుంది. భార్యవలె ఆనందింపజేస్తుంది. దు:ఖాన్ని పోగొడుతుంది. సంపదల్ని విస్తరింపజేస్తుంది. దశదిశలా కీర్తిని వ్యాపింపజేస్తుంది. కల్పవృక్షం వలె కోరిన కోరికలన్నీ తీరుస్తుంది.

ఏ మనిషికైనా చదువు కన్నులాంటిది. ఆ కన్ను మామూలు కన్నుకాదు. జ్ఞాన నేత్రం. అది ఎన్నో సందేహాలను దూరం చేస్తుంది. కంటికి కనబడని రహస్యాలను బహిర్గతం చేస్తుంది.

పశుసంపద ఎంత వున్నా,డబ్బు ఎంత మూలుగుతున్నా, ధాన్యరాశులు కుప్పలుతెప్పలుగా వున్నా – 'విద్య' అనే ధనం లేకుంటే మనిషికి పరిపూర్ణత లేదు. మనశ్శాంతి వుండదు. పల్లకీలు వద్దు. వాహనాలు వద్దు. రత్న కిరీటాలు వద్దు. దాసదాసీజనం వద్దు. విలువైన వస్త్రాలు వద్దు. అందరిచేత నమ్కరించదగిన యోగ్యతను ప్రసాదించే వుత్తమ విద్య ఒక్కటే చాలు అంటాడు ఒక మహాకవి. లోకంలో ఏ ధనాన్ని పోగొట్టుకొన్నా మళ్లీ అనంతకాలంలో సంపాదించుకోవచ్చుగానీ, విద్యాధనాన్ని సకాలంలో సంపాదించుకోకపోతే ఎన్నటికీ అది సాధ్యం కాదనేది యథార్థం.

మాదల రామారావు, విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకులు, గుంటూరు



## పుస్తకాలు

విషయాన్ని గ్రహించు, మాటలు అవే అనుసరిస్తాయి.
కాటో ఎల్డర్ (234 బిసి 149 బిసి)

టి.వి. ద్వారా చాలా నేర్చుకోవచ్చు. ఇంట్లో ఎవరో ఒకరు దానిని పెట్టగానే నేను మరో గదిలోకి వెళ్ళి పుస్తకం చదువుకుంటాను.

నేను రైతులతో/ వ్యవసాయదారులతో వుండటానికి ఇష్టపడతాను. వాళ్ళు చదువుకోలేదు. అసమంజసంగా వాదించటం, తిరస్కరించటం వాళ్ళకు తెలియదు.

పుస్తకాలు ఇంకా ఉండటం మంచిదే. కాని అవి నన్ను నిద్రపుచ్చుతాయి.

అమాయకులే విద్య అవసరం లేదంటారు.
ఫ్రాంక్ జప్యా పబ్లియస్ సిరియన్ (in 100 BC)



# బ్రహ్మకుమారీల సూక్తులు

సేకరణ: మల్లెల హరీంద్రనాథ్ చౌదరి




ప్రతిరోజూ వీటిలో ఒక సూక్తిని ఎంచుకొని దానిపై దృష్టి కేంద్రీకరించి ఆచరణలో పెట్టటంవల్ల అద్భుత ఫలితాలు పొందవచ్చు.

1. ఆనందంతో, చిరునవ్వుతో కష్టాన్ని ఎదిరించ గలవాడే ఘనుడు.
2. ఆనందంగా పనిచేస్తే సమస్యలు ఉండవు. కష్టమే అనిపించదు.
3. విజ్ఞానం, అవగాహన భయాన్ని పోగొట్టే మార్గాలు.
4. గౌరవం పొందాలంటే ముందుగా దానిని నువ్వు ఇవ్వాలి.
5. ఆత్మశాంతి లేనివానికి బయట ప్రపంచంలో శాంతి ఎక్కడైనా దొరుకుతుందా?
6. కోపంతో నీవు మండిపడితే ఆ పగ నీ కళ్ళల్లోకి వచ్చి నిన్ను దహిస్తుంది.
7. నిశ్శబ్దం అంటే ధ్వని లేక పోవటమే కాదు, మనసుకు విశ్రాంతి కూడా.
8. పొగడ్తలకు పొంగిపోయేవాడు సులభంగా అవమానాలకు కూడా గురవుతాడు.
9. ఆయుధాలు తమంత తాము ప్రమాదకరం అయినవి కావు. మనిషిలో కోపమే ప్రమాదకరము.
10. ఆవేశం మనిషిని పిచ్చివాణ్ని చేస్తుంది. అందుకే విజ్ఞతతో ఎందు కుండరాదు?
11. ఎంత తక్కువ మాట్లాడితే అంత ఎక్కువగా ఇతరులు నీ మాట వింటారు.
12. కోపం వస్తే శక్తి ఎంతో వృధా అవుతుంది. అందువలన శక్తిని యుక్తిగా వినియోగించాలి.
13. నీ విజయానికై ఎంత ఆతృతపడతావో ఇతరుల విజయం కోసం కూడా అంతే ఆత్రం చెందు.
14. అందరినీ గౌరవించడం నీ స్వభావము కావాలి.
15. ప్రేమతో పనిచేస్తే విజయం తథ్యం.
16. నువ్వు చూసే తీరునిబట్టి నీ చుట్టూ ప్రపంచంలోని వస్తువుల అందం ఆధారపడి ఉంటుంది.
17. వాగ్దానాలు నిలుపుకోలేకపోతే సన్నిహితులు కూడా దూరమైపోతారు.
18. నిన్ను నువ్వు ప్రేమించుకోవటం నేర్చుకుంటే ఇతరులను ద్వేషించటం మానివేస్తావు.
19. దేనినీ ప్రతిబంధకంగా భావించకు. ప్రతి దానిని విజయానికి ఒక మెట్టుగా స్వీకరించు.
20. పిరికితనం అందరికీ ప్రమాదకరమే.
21. ఇతరుల కార్యకలాపాల గురించి పట్టించుకునే దురభ్యాసం నీకు ఉన్నట్లయితే అది నీ పనులను పాడుచేస్తుంది.
22. ఒక టన్ను బరువైన నిరాశను తొలగించేందుకు ఒక ఔన్సు ధైర్యం చాలు.
23. ఆటంకం వస్తే పరితపించటం మానివేసి ప్రయత్నించటం ప్రారంభించాలి.
24. ఆశను ఎప్పుడూ విడనాడకు. జీవితంలో నిన్ను లాలించేది ఆశ ఒక్కటే.
25. నీ మాటలు ఎంతటి గొప్పవైనా నీ చేతలను బట్టే నిన్ను అంచనా వేస్తారు.
26. ఒకరిపై చాడీలు చెప్పేవారితో నీవు ఏకీభవిస్తే తరువాత నీ పని కూడా అంతే.
27. కాలు జారితే వెనక్కు తీసుకోగలం. కాని మాట జారితే వెనక్కు తీసుకోలేం. చిరకాలం నిలిచి ఉంటుంది.
28. నీ ప్రతిభ, నైపుణ్యం దుర్వినియోగపరిస్తే నష్టపోయేది నీవే.
29. రేపటి భయాలను గురించి విచారిస్తూ వుంటే ఈనాటి ఆనందాలు చేజారి పోతాయి.
30. సోమరికి పూచిక పుల్లను కదిలించటం కూడా కష్టమే.
31. ఇతరుల లోపాలు వెతకటం నీకే ప్రమాదం బలహీనతలు అంటు రోగాల వంటివి.

ఇంటిని పుస్తకాల బీరువాలతో అలంకరింపజేయాలి. అలా నా పిల్లలు చేస్తే నేను చాలా సంతృప్తిపడతాను. - అన్నా క్విండ్లెన్